అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శనివారం 16-12-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 | సంచిక : 345 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



ఇనుప కంచెలు తొలిగాయ్

నియంతృత్వం నుంచి విముక్తి

స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్న తెలంగాణ

- ఇది విస్పష్టమైన ప్రజాతీర్పు
- పౌరహక్కుల, ప్రజాస్వామ్య పాలనకు నాంది
- 48 గంటల్లోపే రెండు హామీలు అమలు
- మిగిలినవీ వందరోజుల్లోపే నెరవేరుస్తాం
- కాళేశ్వరం అవినీతిపై విచారణ
- ఇంటి నిర్మాణాలకు పేదలకు రూ.5 లక్షలు ఇస్తాం
- అమరుల కుటుంబాలకు 250 గజాల ఇంటి స్థలం, గౌరవభృతి : ఉభయసభలనుద్దేశించి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

ఆరునెలల్లో మెగా డీఎస్సీ.. ఏడాదిలోపు రెండు లక్షల ఉద్యోగాల భర్తీ

'పదేండ్ల నిర్బంధపు పాలన నుంచి విముక్తి కావాలని, తమ బతుకుల్లో గొప్ప మార్పు రావాలని కోరుకున్న తెలంగాణ ప్రజలు ఇటీవల ఎన్నికల్లో విస్పష్టమైన తీర్పు ఇచ్చారు. వారి విజ్ఞతను నేను అభినందిస్తున్నాను. నా ప్రభుత్వంలో తెలంగాణ స్వేచ్ఛావాయువులను పీల్చుకుంటున్నది. నియంతృత్వ పాలన, పోకడల నుంచి తెలంగాణ విముక్తి పొందింది. ప్రజాతీర్పు పౌరహక్కులకు, ప్రజాస్వామ్య పాలనకు నాంది అయ్యింది. పాలకులకు, ప్రజలకు మధ్య ఉన్న ఇనుప కంచెలు తొలగిపోయాయి. అడ్డుగోడలు, అద్దాల మేడలు పటాపంచలై ప్రజా ప్రభుత్వ ప్రస్థానం మొదలైందని చెప్పడానికి గర్విస్తున్నాను' అని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. వివరాలు 13లో


సభలో సీఎం రేవంత్‌రెడ్డి

దద్దరిల్లిన పార్లమెంట్

భద్రతా ఉల్లంఘనలపై చర్చించాలి

- హోంమంత్రి ప్రకటన చేయాలి : ఉభయ సభల్లో ప్రతిపక్షాల ఆందోళన
- సస్పెన్షన్‌కు గురైన ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో నిరసన



నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

ప్రతిపక్షాల ఆందోళనతో పార్లమెంట్ దద్దరిల్లింది. భద్రత ఉల్లంఘనలపై చర్చించాలని, దీనిపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రతిపక్షాలు తమ ఆందోళనను కొనసాగించాయి. దీంతో ఉభయ సభలు వాయిదాల పర్వం తొక్కాయి. మరోవైపు సస్పెన్షన్‌కు గురైన ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. వీరికి మద్దతుగా మిగిలిన ప్రతిపక్ష ఎంపీలు నిరసనలో పాల్గొన్నారు. పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యంపై కేంద్ర హోం మంత్రి ప్రకటనకు పట్టుబడుతున్న ఎంపీలు వెనక్కి తగ్గకపోవడంతో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు. సభ ప్రారంభమైన సెకన్లలోనే వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలోనూ ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. దీంతో సభ మళ్లీ సెకన్లలోనే సోమవారానికి వాయిదా పడింది.

భద్రతా ఉల్లంఘనపై 23 నోటీసుల తిరస్కరణ

మరోవైపు రాజ్యసభలో కూడా ప్రతిపక్ష ఎంపీలు ఇదే అంశంపై చర్చకు డిమాండ్ చేయడంతో చైర్మెన్ జగదీప్ ధన్‌ఖర్ సభను మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు. పార్లమెంట్‌లో భద్రతా ఉల్లంఘనపై చర్చించాలని ప్రతిపక్ష ఎంపీలు ఇచ్చిన 23 నోటీసులను రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్‌ఖర్ తిరస్కరించారు. దీంతో ఎగిసిన నిరసనల మధ్య రాజ్యసభ కార్యకలాపాలు మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడ్డాయి. శుక్రవారం సభ ప్రారంభమైన వెంటనే పార్లమెంట్ భద్రతా ఉల్లంఘన కారణంగా తలెత్తిన "తీవ్రమైన పరిస్థితి"కి సంబంధించి తనకు 23 నోటీసులు వచ్చాయని చైర్మెన్ సభకు తెలియజేశారు. ఘటనపై విచారణ జరుగుతోందని, దాన్ని ముగింపునకు తీసుకెళ్తామని ధన్ ఖర్ చెప్పారు. "నోటీసులను అనుమతించను" అని అన్నారు. ఇది ప్రతిపక్ష పార్టీల నిరసనకు దారితీసింది. దీంతో సభ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడింది. అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లను రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్‌ఖర్ తన ఛాంబర్‌లో సమావేశానికి ఆహ్వానించారు. సమావేశమైనప్పటికీ పరిస్థితుల్లో ఎలాంటి మార్పు కనబడలేదు. మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి ప్రారంభమైన సభ ప్రతిపక్షాల ఆందోళనతో దద్దరిల్లింది. దీంతో సభను సోమవారానికి వాయిదా వేశారు.

సస్పెన్షన్‌కు గురైన ఎంపీల నిరసన

ఢిల్లీలోని పార్లమెంట్ ఆవరణలోగల మహాత్మా గాంధీ విగ్రహం ఎదుట ...13లో

అన్నీ అసత్యాలే..కొత్తదనం లేదు

- గవర్నర్ ప్రసంగంపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గవర్నర్ ప్రసంగంలో కొత్తదనమేమీ లేదనీ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోను చదివినట్టుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశం, అరెకపూడి గాంధీ తదితరులతో కలిసి శుక్రవారం అసెంబ్లీలోని మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. గత పదేండ్లుగా తెలంగాణ తిరోగమనంలో ఉన్నట్టు గవర్నర్ ప్రసంగించటం విచారకరమన్నారు. జాతీయ స్థాయిలో అనేక అవార్డులు రాష్ట్రం అందుకున్నదనే విషయాన్ని గవర్నర్ మరిచిపోయారని ...13లో

శాసనసభకు నలుగురు విప్‌లు

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

శాసనసభకు రాష్ట్ర ప్రభుత్వం నలుగురు విప్‌లను నియమించింది. ఈమేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అండ్లూరి లక్ష్మణ్‌కుమార్ (ధర్మపురి), జాటోత్ రామచంద్రు నాయక్ (దోర్నకల్), ఆది శ్రీనివాస్ (వేములవాడ), బీర్ల ఐలయ్య (ఆలేరు)లను నియమించింది. చీఫ్‌విప్‌ను మాత్రం నియమించలేదు. ఆ పదవికి సంబంధించిన ఉత్తర్వులు శనివారం వెలువడే అవకాశం ఉన్నది. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను చీఫ్‌విప్‌గా నియమించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్టు సమాచారం.

రాఫెల్ డీల్‌కే పేఛే!

అవినీతిపై ఫ్రెంచ్ న్యాయమూర్తుల విచారణ

- సహకరించేందుకు మోడీ సర్కారు నిరాకరణ
- ఫ్రెంచ్ రాయబార కార్యాలయంతో ఎనిమిది నెలలు సంబంధాలు కట్ : మీడియాపార్ట్ సంచలన నివేదిక


(ఫైల్)
రాఫెల్ డీల్‌పై ఒప్పందపత్రాలు తీసుకుంటున్న భారత్,ఫ్రాన్స్ దేశాలు



రాఫెల్ డీల్ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. 2016లో భారత్‌కు 7.8 బిలియన్ యూరోలకు దస్సాల్ట్ తయారు చేసిన 36 రాఫెల్ యుద్ధ విమానాలను విక్రయించడంలో అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే, ఈ అవినీతిపై జరుగుతున్న దర్యాప్తులో భారత్ సహాయం కోరిన ఫ్రాన్స్ న్యాయమూర్తులతో సహకరించేందుకు కేంద్రంలోని మోడీ సర్కారు నిరాకరిస్తున్నది. ఈ సంచలన విషయాన్ని పారిస్ కేంద్రంగా పని చేసే పరిశోధనాత్మక వెబ్‌సైట్ 'మీడియాపార్ట్' ప్రచురించిన కొత్త నివేదిక బయట పెట్టింది. ఇప్పుడు ఈ అంశం ఇరు దేశాల్లో చర్చనీయాంశంగా మారింది.

న్యూఢిల్లీ : భారత్‌లోని ఫ్రెంచ్ రాయబారి ఇమ్మాన్యుయేల్ లెనైన్ ఈ ఏడాది జులై 25న రాసిన దౌత్య నోట్‌లో భారత్‌తో క్రిమినల్ కేసుల సహకారంలో సవాళ్లను హైలైట్ చేశారు. "చాలా కేసులను మా భారతీయ భాగస్వాములు చాలా కాలం ఆలస్యంగా నిర్వహిస్తారు. తరచుగా అసంపూర్తిగా ఉంటారు" అని ఆయన తన నోట్‌లో పేర్కొనటం గమనార్హం. ఈ కేసులో మోడీ సర్కారు విచారణకు కట్టుబడి ఉండటం లేదని నివేదిక వివరించింది.

ఈ నివేదిక ప్రకారం.. అనుమానిత అవినీతి, ప్రభావ పెడ్లింగ్‌పై నేర పరిశోధనకు బాధ్యత వహించే ఇద్దరు ఫ్రెంచ్ న్యాయమూర్తులు గతేడాది నవంబర్‌లో చేసిన కేసుపై అంతర్జాతీయ సహకారం కోసం చేసిన అధికారిక అభ్యర్థనను అనుసరించడానికి భారత ప్రభుత్వం వాస్తవంగా నిరాకరించింది. కేంద్రం భారత్‌లోని ఫ్రెంచ్ రాయబార కార్యాలయంతో ఎనిమిది నెలల పాటు సంబంధాలు లేకుండా చేసింది. ఫలితంగా, ఇప్పుడు బ్రెజిల్‌లో ఫ్రాన్స్ రాయబారిగా ఉన్న భారత్‌లోని ఫ్రెంచ్ రాయబారి లెనైన్..ఈ సమస్యపై దౌత్యపరమైన నోట్‌ను రాయవల్సి వచ్చింది. భారత ప్రధాని మోడీ, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌లను ఇరికించగల అత్యంత సున్నితమైన దర్యాప్తును నెమ్మదించాలనే కోరికతో ఫ్రెంచ్, భారత ప్రభుత్వాలు ఎలా ఐక్యంగా ఉన్నాయో 'మీడియాపార్ట్' గతంలో సైతం నివేదించింది. అగస్టా వెస్ట్‌ల్యాండ్ ఛాపర్ స్కామ్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అరెస్టు చేసిన దస్సాల్ట్ మీడియేటర్ , ప్రభావవంతమైన రక్షణ వ్యాపారి సుషేన్ గుప్తాకు సంబంధించిన న్యాయపరమైన పత్రాలను తమకు పంపాలని అక్టోబర్ 2018లో ఫ్రెంచ్ దర్యాప్తు న్యాయమూర్తులు భారత అధికారులను అభ్యర్థించారు. గుప్తా రాఫెల్ డీల్ ఏజెంట్ కూడా. అతను "మిలియన్ల కమీషన్" అందుకున్నాడని 'మీడియాపార్ట్' ఏప్రిల్ 2021లో నివేదించింది. కాగా, 'మీడియాపార్ట్' నివేదికపై భారత ప్రభుత్వ కమ్యూనికేషన్ సర్వీస్, భారత హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పందించకపోవటం గమనార్హం.

కేసీఆర్ డిశ్చార్జి

నందినగర్‌లోని సొంతింటికి మాజీ సీఎం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వారం రోజుల చికిత్స అనంతరం బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆస్పత్రి నుంచి శుక్రవారం ఉదయం డిశ్చార్జి అయ్యారు. ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో జారిపడటంతో కేసీఆర్ ఎడమ తుంటి భాగంలో తీవ్ర గాయమైన విషయం తెలిసిందే. ఆయన్ను హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆయనకు తుంటి మార్పిడి శస్త్రచికిత్స చేశారు. అనంతరం ఆస్పత్రిలో కోలుకుంటున్న కేసీఆర్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు పరామర్శించారు.డిశ్చార్జి అనంతరం హైదరాబాద్ నందినగర్‌లోని సొంతింటికి చేరుకున్న కేసీఆర్‌కు సాంప్రదాయ పద్ధతిలో దిష్టి తీసి, హారతితో స్వాగతం పలికారు.చికిత్స అందించిన డాక్టర్లు, నర్సులు సహా యశోద సిబ్బందికి కేసీఆర్ పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు. తన కోసం వచ్చిన అభిమానులకు అభివాదం చేశారు.

రాబోయే కాలంలో నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తాం

లోపాలను సమీక్షించి పార్టీని పటిష్టం చేస్తాం



- సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గానికి శుభాకాంక్షలు
- ప్రజాస్వామికంగా పాలన అందించాలి
- కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయాలి
- ఉద్యోగాల కల్పనపై దృష్టిసారించాలి
- బీజేపీ ఓట్లు, సీట్లు రెట్టింపు ప్రమాదకర సంకేతం
- అహంభావం, అప్రజాస్వామిక ధోరణుల వల్లే బీఆర్ఎస్ ఓటమి
- కేసీఆర్ త్వరగా కోలుకోవాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

వివరాలు 6లో..

10 వేల ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ?

రేవంత్ సర్కారు సమాలోచన



- ఆర్నెల్లలో భర్తీ చేసేందుకు ప్రణాళిక
- గవర్నర్ ప్రసంగంలోనూ హామీ
- 5,089 పోస్టులతో డీఎస్సీ వేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- మరో 5 వేల ఖాళీలు అదనంగా చేర్చే అవకాశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించింది. నియామకాల ప్రక్రియ పారదర్శకంగా ఉండేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నది. దీంతో నిరుద్యోగులు ఖాళీల భర్తీకి తీసుకుంటున్న చర్యలను జాగ్రత్తగా గమనిస్తున్నారు. నోటిఫికేషన్ల విడుదల, వాయిదా పడిన రాతపరీక్షల తేదీల కోసం ఎదురుచూస్తున్నారు. 'అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తాం. తొలి మంత్రివర్గ సమావేశంలోనే మెగా డీఎస్సీని ప్రకటించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ఆర్నెల్లలో భర్తీ చేస్తాం.'అని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన విషయం తెలిసిందే. కాంగ్రెస్‌పై నమ్మకంతో ఆ పార్టీకి నిరుద్యోగ యువకులు అండగా నిలిచారు. ఎన్నికల్లో ఓట్లేసి గెలిపించారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఎప్పుడొస్తుందా?అని నిరుద్యోగ యువత ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నది. ఆ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే ఉపాధ్యాయ ఖాళీల వివరాలను పాఠశాల విద్యాశాఖ అధికారుల నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి అడిగి తెలుసుకున్నారు. దీంతో నిరుద్యోగ యువతలో మరింత ఆసక్తి పెరిగింది. రాష్ట్రంలో 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లాస్థాయి నియామక కమిటీ (డీఎస్సీ) నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ సెప్టెంబర్ ఆరో తేదీన విడుదల చేసిన విషయం తెలిసిందే. 5,089 ఉపాధ్యాయ పోస్టులకు 1,77,502 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. అయితే మరో ఐదు వేల ఉపాధ్యాయ పోస్టులను కలపాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. పది వేల ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని సమాలోచన చేస్తున్నది. ఆర్నెల్లలో ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రణాళిక రూపొందిస్తున్నది. ఇదే విషయాన్ని ...13లో

భార్యా పిల్లల్ని కడతేర్చి...

కలెక్టర్ గన్‌మెన్ ఆత్మహత్య

- ఆన్‌లైన్ గేమ్స్‌తో ఆర్థిక సమస్యలు..


(ఫైల్)

నవతెలంగాణ-చిన్నకోడూరు

ఆన్ డ్యూటీలో ఉన్న కలెక్టర్ గన్‌మెన్.. ఆర్థిక సమస్యలతో తీవ్ర మనస్థాపానికి గురై తన రివాల్వర్‌తో భార్య, పిల్లలపై కాల్పులు జరిపి ఆపై తానూ అదే పిస్టల్‌తో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ హృదయ విదారకర ఘటన సిద్దిపేట జిల్లా చిన్న కోడూరు మండలం రాముని పట్ల గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామునిపట్ల గ్రామానికి చెందిన ఆకుల నరేశ్ (35) సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ వద్ద గన్‌మెన్‌గా విధులు ...13లో

పోలీసు రిక్రూట్‌మెంట్‌ను పారదర్శకంగా పూర్తి చేయండి

- డీఎస్పీ నళినికి ఉద్యోగమివ్వండి
- ఉన్నతాధికారుల సమావేశంలో సీఎం ఆదేశం

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో పోలీసు రిక్రూట్‌మెంట్‌ను ఎలాంటి ఆరోపణలకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలని పోలీసు ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి పోలీసు, వైద్య శాఖకు చెందిన ఉన్నతాధికారులతో ఆ శాఖల్లో నియామకాలకు సంబంధించి సమీక్ష జరిపారు. ఈ సమావేశానికి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు డీజీపీ రవిగుప్తా, వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎ.ఎం.రిజ్వి, ఆరోగ్య శాఖ కార్యదర్శి శైలజా రామయ్యర్, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మెన్ వి.వి శ్రీనివాస్‌రావు, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డి, నగర పోలీసు కమిషనర్ కె. శ్రీనివాస్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. పోలీసు రిక్రూట్‌మెంట్‌లో ఏవైనా అవరోధాలు ఏర్పడితే దానిపై తనకు నివేదిక ఇవ్వాలని సీఎం అధికారులను ఆదేశించారు. రిక్రూట్‌మెంట్ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కూడా ఆయన కోరారు. గత 9 ఏండ్లలో రాష్ట్రంలో జరిగిన పోలీసు రిక్రూట్‌మెంట్‌కు సంబంధించిన పూర్తి నివేదికను కూడా తనకు సమర్పించాలని ఆయన ఆదేశించారు. వైద్య, ఆరోగ్య శాఖలో సైతం అవసరమైన నియామకాలను చేపట్టాలని ఆయన ఆ శాఖాధికారులను ఆదేశించారు.

నళిని ఉద్యోగంలోకి ఎందుకు తీసుకోరాదు? : అధికారులతో సీఎం ఆరా

తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమం సమయంలో తన ఉద్యోగానికి రాజీనామా చేసిన డీఎస్పీ నళినికి సంబంధించి ఆయన అధికారులతో ఆరా తీశారు. ఆమెను తిరిగి ఉద్యోగంలోకి ఎందుకు తీసుకోరాదని ఆయన అధికారులను ప్రశ్నించారు. ఉద్యమ సమయంలో అనేక మంది అధికారులు రాజీనామా చేసి తర్వాత ఉద్యోగాల్లో చేరారని రేవంత్ అన్నారు. అదే సమయంలో నళినిని తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలనీ, ఒకవేళ పోలీసు ఉద్యోగంలో చేర్చుకోవటానికి ఏవైనా అడ్డంకులు ఏర్పడితే ఇతర ప్రభుత్వ ఉద్యోగంలో అదే హోదాలో చేర్చుకోవాలని ఆయన సూచించారు. ఈ విషయంలో ఆమె అభిప్రాయం కూడా తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. కాగా, పోలీసు, ఆర్టీసీ ఉద్యోగస్తుల పిల్లల కోసం కోరుకొండ సైనిక పాఠశాల స్థాయిలో రెసిడెన్షియల్ స్కూళ్లను ఉత్తర, దక్షిణ తెలంగాణలో తెరవటానికి ప్రణాళికలను రూపొందించాలని ఆయన అధికారులను కోరారు.

నా కోసం ట్రాఫిక్ ఆపొద్దు

- పోలీసు అధికారులను ఆదేశించిన సీఎం



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

తన కాన్వాయ్ కోసం ట్రాఫిక్‌ను ఆపవద్దని నగర పోలీసు ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సాధారణంగా నగరంలో ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారనీ, ఇక తన కాన్వాయ్ కదలిక సందర్భంగా ముందే ట్రాఫిక్‌ను నిలిపేయటం వల్ల ప్రజలు మరింత ఇబ్బందులకు గురవుతారని ఆయన అన్నారు. ఇందుకు తన కోసం ఎక్కడా ట్రాఫిక్‌ను ఆపవద్దని తెలిపారు. ట్రాఫిక్‌లోనే తన కాన్వాయ్ కదలిక సాగేలా చర్యలను తీసుకోవాలని అధికారులను కోరారు. సీఎం ఆదేశాల మేరకు తాము నడుచుకుంటామనీ, అయితే కాన్వాయ్ సక్రమంగా సాగేలా, ప్రజలకు ఇబ్బంది కలగకుండా అవసరమైన చర్యలను తాము తీసుకుంటామని నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి 'నవతెలంగాణ'తో మాట్లాడుతూ అన్నారు. ముఖ్యంగా, సీఎం సెక్యూరిటీ పైనా ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని ఆయన తెలిపారు.

రూ.1,050 కోట్లతో ఐదు పామాయిల్ పరిశ్రమల ఏర్పాటు

- సహకార వ్యవస్థ కంప్యూటరీకరణ
- 110 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌లు
- వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో రూ.1050 కోట్లతో ఐదు పామాయిల్ పరిశ్రమలను ఏర్పాటు చేయనున్నట్టు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం సచివాలయంలో ఆయన మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. తొలి రోజే పామాయిల్, రైతు వేదికలు, సహకార వ్యవస్థ కంప్యూటరీకరణ మొదలగు మూడు కీలక దస్త్రాలపై సంతకాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో వచ్చే ఐదేండ్లలో ఏడాదికొకటి చొప్పున పామాయిల్ పరిశ్రమను ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో నెల కొల్పుతామన్నారు. పరిశ్రమల స్థాపనతో ప్రతీ జిల్లాలో ప్రత్యక్ష, పరోక్ష, ఉపాధి లభిస్తుందని అన్నారు. టీఎస్ ఆయిల్ ఫెడ్ 2023-24 నుంచి ఏటా 40 వేల ఎకరాల విస్తీర్ణంలో మొక్కలు పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు మంత్రి తెలిపారు. 25 నుంచి 30 ఏండ్ల వరకు దిగుబడినిచ్చే దీర్ఘకాలిక పంటగా రైతుకు స్థిరమైన ఆదాయం పామాయిల్ సాగు ద్వారా వస్తుందన్నారు. ఈ సంట సాగుతో రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 110 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించేలా రూ.4.07కోట్లతో అధునిక సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రైతు వేదికల్లో రైతులకు అత్యాధునిక సాగుపద్ధతులపై అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. వ్యయసాయ శాస్త్రవేత్తలతో రైతులకు తరచూ అవగాహన సదస్సులు నిర్వహించేందుకు వీలుగా రైతు వేదికల్ని తీర్చిదిద్దుతామన్నారు.సహకార వ్యవస్థలో పారదర్శకమైన పాలన అందించేందుకు గానూ వివిధ విభాగాలను పూర్తిగా కంప్యూటరీకరణ చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గద్వాల కు చెందిన పట్టు పరిశ్రమ శాఖ అధికారి జగన్నాథ్ కుమారుడు ఆశిష్ కుమార్‌కు కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పిస్తూ మంత్రి నియామక పత్రాన్ని అందజేశారు..

తప్పుగా ప్రసారం చేశారు :తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

చిట్ చాట్ పేరిట తాను అనని మాటలను అన్నట్టు మీడియా సామాజిక మాధ్యమాల్లో తప్పుగా ప్రసారం చేశారని బీఆర్ఎస్ నేత తక్కెళ్లపల్లి రవీందర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఏదైనా మాట్లాడాలనుకుంటే అధికారికంగా మాట్లాడుతాననీ, చిట్ చాట్‌లో మాట్లాడబోనని పేర్కొన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ పై తనకు సంపూర్ణ విశ్వాసం ఉందని తెలిపారు.

సీఎంకు గ్రూప్ 1 అధికారుల సంఘం శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీఎం రేవంత్ రెడ్డికి గ్రూప్ 1 అధికారుల సంఘం శుభాకాంక్షలు తెలిపింది. ఈ మేరకు శుక్రవారం గ్రూప్ 1 ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి హన్మంతు నాయక్, నాయకులు చౌడారపు శ్రీధర్, భవాని, శశి శ్రీ, జయశ్రీ, హరికిషన్, లింగ్యా నాయక్, యూనూస్,అఖిలేష్ రెడ్డి, మైత్రి ప్రియ తదితరులు కలిశారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషిస్తామని వారు తెలిపారు. టాస్ ఏర్పాటు, అదనపు కలెక్టర్ల అంశం తదితర సమస్యల పరిష్కారం కోసం మరోసారి సమావేశమవుతామని సీఎంకు విన్నవించారు.

రైల్ నిలయంలో పెన్షన్ అదాలత్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దక్షిణ మధ్య రైల్వే పెన్షన్ అదాలత్-2023ను సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమములో ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ కిషోర్ బాబు, ఇతర సీనియర్ రైల్వే అధికారులు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. దక్షిణ మధ్య రైల్వేపరిధిలోని ఆరు డివిజన్లతో పాటు వర్క్ షాప్‌లు, ఇతర యూనిట్లకు చెందిన విశ్రాంత రైల్వే ఉద్యోగుల ఫిర్యాదుల పరిష్కారానికి వారి వారి ప్రాంగణంలలో వేర్వేరుగా పెన్షన్ అదాలత్‌ను నిర్వహించాయి. అదాలత్‌కు పెద్దఎత్తున హాజరైన విశ్రాంత రైల్వే ఉద్యోగులు తమ పెండింగ్ ఫిర్యాదులపై అధికారులతో మాట్లాడారు. పింఛనుదారులకు భవిష్యత్తులో ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వారు సకాలంలో తెలియజేయాలని తద్వారా సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి వీలవుతుందని అధికారులు సూచించారు. విశ్రాంత రైల్వే ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన దక్షిణ మధ్య రైల్వే అధికారులను అభినందించారు.

టీ-వర్క్స్ సీఈవో తొలగింపు

నవతెలంగాణ-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే కీలక పదువుల్లో ఉన్న వారిని తొలగించడంతో పాటు భారీగా ఐపీఎస్‌లు, ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. తాజాగా టీ-వర్క్స్ సీఈవోను సర్కార్ తప్పించింది. టీ-వర్క్స్ సీఈవో సుజయ్ కారంపురిని రాష్ట్ర ప్రభుత్వం తొలగించింది. టీ-వర్క్స్, టీ-ఫైబర్, ఎలక్ట్రానిక్స్ (ప్రమోషన్స్) డైరెక్టర్‌గా ఉన్న ఆయన్ను తొలగిస్తూ శుక్రవారం ఉదయం ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాజీనామా చేయాలని ప్రభుత్వం కోరినా సుజయ్ తిరస్కరించడంతో ఆయనపై సర్కార్ వేటు వేసింది. టీ-వర్క్స్ కొత్త సీఈవోగా ఆనంద్ రాజ్ గోపాల్, టీ-ఫైబర్ హెడ్‌గా కాసుల ఆనంద్, ఎలక్ట్రానిక్స్ అండ్ డిజిటల్ వింగ్ హెడ్‌గా ఎస్కే శర్మను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కిషన్‌రెడ్డి మార్పు కేవలం ప్రచారమే

- ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో బీజేపీ అధ్యక్షుడి మార్పు కేవలం ప్రచారం మాత్రమేననీ, కిషన్‌రెడ్డి మార్చబోరని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌ను ప్రజలు తిరస్కరించారనీ, రాష్ట్రంలో ఆ పార్టీ కనుమరుగు కాబోతుందని జోష్యం చెప్పారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్-బీజేపీ మధ్యనే పోటీ ఉంటుందని చెప్పారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్ గఢ్ ప్రజలు కాంగ్రెస్ ప్రకటించిన ఉచితాలను తిరస్కరించారన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వ అనుకూలత కారణంగానే విజయం దక్కిందని లక్ష్మణ్ పేర్కొన్నారు. సెమీ ఫైనల్‌లో కాంగ్రెస్‌కు చెంపపెట్టు లాంటి సమాధానమిచ్చారన్నారు.

మహిళల బాధను విస్మరించిన స్మృతీ ఇరానీ

- కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహిళల బాధను కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ విస్మరించారని కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఎక్స్‌లో పోస్ట్ చేశారు. వాస్తవిక సవాళ్ల పట్ల సాను భూతి చూపకపోవడం విస్తుగొల్పుతోందని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులకు నెలసరి సెలవులపై కేంద్ర మంత్రి వైఖరిని ఆమె తప్పు పట్టారు. "నెలసరి ఎంపిక కాదు. అది సహజమైన జీవ ప్రక్రియ. వేతనంతో కూడిన సెలవును తిరస్కరించడం అసంఖ్యాకమైన మహిళలు అనుభవిస్తున్న బాధను విస్మరించినట్లే" అని కవిత తెలియజేశారు.

ప్రేమాభిమానాలను కృతజ్ఞతలు

క్లిష్ట సమయంలో దేశ నలుమూలల నుంచి బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పట్ల ప్రేమాభిమానాలు కనబర్చినందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక విధ్వంసం కాదు .. ఆర్థిక స్వాతంత్ర్యం తీసుకొచ్చాం

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఆర్థిక స్వాతంత్ర్యాన్ని తీసుకొచ్చామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. అందుకు భిన్నంగా ఆర్థిక విధ్వంసం జరిగిందంటూ తప్పుడు ప్రచారం మానుకోవాలని ఆయన కాంగ్రెస్ నేతలకు హితవు పలికారు. అప్పుల పేరుతో పథకాల నుంచి కాంగ్రెస్ తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. గవర్నర్ ప్రసంగమా ? కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోనా? అంటూ శుక్రవారం గవర్నర్ చేసిన ప్రసంగంపై ఆయన స్పందించారు. రాష్ట్రంలో పండుతున్న పంటలు, వస్తున్న కరంటు, పారుతున్న నీళ్లు, పెరిగిన తలసరి ఆదాయం, హైదరాబాద్ అభివృద్ధి, గ్రామాలలో స్వచ్ఛత, పట్టణాల సుందరీకరణ అనేది సత్యం కాదా? అని ప్రశ్నించారు.

కాలయాపన లేకుండా మెగా డీఎస్సీని ప్రకటించాలి

- డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాలయాపన లేకుండా మెగా డీఎస్సీని వెంటనే ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంలో ఆరు నెలల్లో మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామంటూ వెల్లడించారని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలస్యం చేయకుండా గత ప్రభుత్వం జారీ చేసిన 5,089 ఉపాధ్యాయ పోస్టులకు అదనంగా కలిపి అనుబంధ నోటిఫికేషన్‌ను జారీ చేయాలని కోరారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల పేరుతో కాలయాపన చేయకుండా మెగా డీఎస్సీ షెడ్యూల్‌ను విడుదల చేసి పరీక్షల తేదీలను ఖరారు చేయాలని తెలిపారు. ఉపాధ్యాయ పదోన్నతులకు టెట్ నిర్వహిస్తే కాలయాపన అవుతుందని పేర్కొన్నారు. డీఎస్సీ రాతపరీక్షలను నిర్వహించి నియామక ప్రక్రియ పూర్తి చేసేలోపు ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టేందుకు అవకాశముందని సూచించారు. 5,089 ఉపాధ్యాయ పోస్టులకు 1.77 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. మెగా డీఎస్సీకి అనుబంధ నోటిఫికేషన్ ఇస్తే దరఖాస్తుల సంఖ్య పెరుగుతుందని వివరించారు. రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని కోరారు.

అప్పుల్ని.. తప్పుల్ని ఎత్తి చూపిన గవర్నర్

బీఆర్ఎస్ వైఫల్యాలపై దాడి..

- కాంగ్రెస్ కొత్త స్కీముల ఏకరువు...
- అసెంబ్లీలో ఘన స్వాగతం పలికిన సీఎం, స్పీకర్, సీఎస్, డీజీపీ తదితరులు
- కాళన్న పలుకులతో ప్రసంగం ప్రారంభం..దాశరథి పలుకులతో ముగింపు
- 20 నిమిషాల్లో పూర్తి
- సభ శనివారానికి వాయిదా
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై నేడు చర్చ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉభయ సభలనుద్దేశించి రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ శుక్రవారం చేసిన ప్రసంగం ఆద్యంతం గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపింది. ఆ సర్కార్ చేసిన అప్పుల్ని.. అప్పటి తప్పుల్ని ఏకరువు పెడుతూ ఆమె మాట్లాడారు. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ సర్కారు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నిర్దిష్ట సమయంలో అమలు చేస్తుందంటూ హామీనిచ్చారు. శాసనసభ, మండలి సభ్యులనుద్దేశించి ప్రసంగించేందుకు అసెంబ్లీకి విచ్చేసిన గవర్నర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీఎస్ శాంతికుమారి తదితరులు ఘన స్వాగతం పలికారు. ఆమెను సీఎం, స్పీకర్, మండలి చైర్మెన్ లోపలికి తోడ్కొని వెళ్లారు. అనంతరం గవర్నర్ ప్రసంగిస్తూ... బీఆర్ఎస్ హయాంలో అన్ని వ్యవస్థలూ విధ్వంసమయ్యాయంటూ తూర్పారబట్టారు. ముఖ్యంగా విద్యుత్, పౌర సరఫరాల శాఖల్లో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాల గురించి ప్రస్తావించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలోని లోపాలనూ గుర్తు చేశారు. 'దివాళా తీసిన ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచటం నా ప్రభుత్వం ముందున్న అతి పెద్ద సవాల్' అంటూ ఆమె భవిష్యత్ గురించి ఆందోళన వ్యక్తం చేయటం కొసమెరుపు. నియంతృత్వ పాలన, నిర్బంధంలాంటి పదాలు గవర్నర్ ప్రసంగంలో చోటు చేసుకోవటం గమనార్హం.

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీని, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఒకరకంగా చెప్పాలంటే పదేండ్ల తర్వాత కొలువుదీరిన 'కాంగ్రెస్ సర్కార్ ఆత్మ'ను గవర్నర్ తన ప్రసంగం ద్వారా ప్రజల ముందుంచారు. ఆమె స్పీచ్ ఇటు అసెంబ్లీలోనూ, ఇటు బయటా తీవ్ర చర్చనీయాంశమైంది.

ప్రజాకవి కాళోజీ నారాయణరావు పలుకులతో తన ప్రసంగాన్ని ప్రారంభించిన గవర్నర్.. మహాకవి దాశరథి పలుకులతో ముగించారు. ఉదయం 11.33 గంటలకు ప్రారంభమైన ఆమె ప్రసంగం.. 20 నిమిషాలపాటు కొనసాగి 11.53 గంటలకు ముగిసింది. అనంతరం సభ శనివారానికి వాయిదా పడింది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఉభయ సభల్లో శనివారం చర్చ జరగనుంది.

ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్.

ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ రవిగుప్తా, ఆర్థిక శాఖ కార్యదర్శి శ్రీదేవి, ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ సచివాలయానికి వచ్చి ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోవడానికి మంత్రుల పేషీల్లో నిర్దిష్టమైన సమయం, ప్రత్యేక అనుమతులు కల్పించేందుకు అధ్యయనం చేయాలని చెప్పారు. పట్టణాలు, గ్రామాల్లో ప్రతినెల మొదటి వారంలో ఒకటి లేదా రెండు రోజుల పాటు సభలు నిర్వహించి వారి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తే వారు హైదరాబాద్ దాకా వచ్చే అవసరం తగ్గుతుందని అన్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి సమయం నిర్దేశించుకుని పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య మంచి సత్సంబంధాలు ఏర్పడతాయని, సుహృద్భావ వాతావరణంలో ప్రభుత్వం పనిచేసేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. విజ్ఞప్తులు, ఫిర్యాదులను డిజిటలైజ్ చేయాలనీ, ఎప్పటికప్పుడు స్టేటస్‌ను ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు. ప్రజావాణికి భారీ స్పందన వస్తున్నందున, అందుకనుగుణంగా ఫిర్యాదుల స్వీకరణకు టేబుల్స్ పెంచాలనీ, కనీస అవసరాలయిన మంచినీరు, ఇతర వసతులను కల్పించాలని సూచించారు. ప్రజావాణికి వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చుడాలని అన్నారు. శిక్షణలో వున్న ఐఎఎస్ అధికారుల సేవలను కూడా వినియోగించుకోవాలని సీఎం సూచించారు.

కొత్త సర్కార్‌తో...
చిగురిస్తున్న ఆశలు

- ప్రజావాణికి బారులు తీరిన జనం
- పంజాగుట్ట నుంచి ప్రజాభవన్ వరకు...
- అర కిలోమీటర్‌కు పైగా క్యూలైన్
- సమస్యలు ఏకరువుపెట్టిన ప్రజలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణిలో సమస్యలు చెప్పుకునేందుకు భారీగా ప్రజలు తరలి వచ్చారు. ఉదయం 5 గంటల నుంచే బాధితులు తమ గోడు వెళ్లబోసుకునేందుకు గేటు ముందు పడిగాపులు కాసారు. పంజాగుట్ట చౌరస్తా నుంచి ప్రజాభవన్ వరకు అర కిలోమీటర్ వరకు క్యూలైన్ సాగింది. ఏండ్లుగా పరిష్కారం కాని తమ సమస్యలు కొత్త ప్రభుత్వంలోనైనా ఓ కొలిక్కి వస్తాయనే ఆశ అందరిలో కనిపించింది. ఈ కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి తమ సమస్యలను చెప్పుకున్నారు. ఆసరా పింఛన్లు, రేషన్ కార్డులు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, భూ సమస్యలు ఎక్కువగా కనిపించాయి. వృద్ధులు, వికలాంగులు, వితంతు మహిళలు, నిరు పేదలు, రైతులు, నిరుద్యోగులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే అర్జీలు తీసుకుంటుండటంతో వేకువ జాము నుంచే ప్రజాభవన్ గేటు ముందు జనం బారులు తీరారు. ప్రజల నుంచి వస్తున్న వినతుల పరిష్కారానికి ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టింది. జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, ఆయుష్ శాఖ కమీషనర్ హరిచందన, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్‌లు ప్రజల నుంచి ధరఖాస్తులను స్వీకరించారు. ప్రజా వాణికి వచ్చిన వారి సమస్యను తెలుసుకుని సంబంధిత శాఖలకు సిఫారసు చేశారు. ప్రతి అర్జీకి ఒక నంబర్ ను కేటాయించారు. అర్జీదారుల రిఫరెన్స్ కొరకు వారి సెల్ ఫోన్ నంబర్‌కు సంక్షిప్త సందేశం పంపుతున్నారు. గత పదేండ్లుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పని కాని పరిస్థితి నెలకొంది. ముఖ్యమంత్రి కలవరు... మంత్రులు, ఎమ్మెల్యేలు తమ పరిధిలో లేదని తప్పించుకున్న సందర్భాలు కోకొల్లలు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలతో సత్సంబంధాలు నెరపడంలో విఫలమైందనే విమర్శలను మూటగట్టుకుంది.

తాజాగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర స్థాయిలో ప్రజా సమస్యలను పరిష్కరించే వేదికగా సర్కార్ ప్రజావాణిని ఏర్పాటు చేసింది. గత 10 రోజులుగా హైదరాబాద్‌లోని ప్రజాభవన్ లో ప్రతి మంగళ, శుక్రవారాలు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. కొత్త సర్కార్ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జనం నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది.



వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చూడండి

మిషన్ భగీరథ శాఖ సమీక్షలో మంత్రి సీతక్క ఆదేశం

ప్రతిరోజూ సరఫరా చేయాలని సూచన

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా వేసవికాలంలో తాగునీటి ఎద్దడి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మిషన్ భగీరథ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. క్రమం తప్పకుండా సరఫరా జరిగేలా జాగ్రత్తలు అవసరమని సూచించారు. నిరంతర పర్యవేక్షణ చేయాలని అభిప్రాయపడ్డారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో చీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లతో మంత్రి సీతక్క సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా పరిస్థితిని ప్రతిరోజూ నిశితంగా పర్యవేక్షించాలనీ, ప్రతి మారుమూల గ్రామానికి రోజువారీ నీటి సరఫరా జరిగేలా చూడాలని ఇంజినీర్లను కోరారు. అనంతరం మేడారం జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. త్వరలో మేడారం జాతరపై సంబంధిత శాఖలతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. రిజర్వాయర్లు, నదుల తదితర తాగునీటి వనరుల స్థాయిలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

రిజర్వాయర్లలో నీటి మట్టాలు తగ్గినప్పుడల్లా ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి, ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యలు రాకుండా చెప్పారు. ఇందుకోసం ఎప్పటికప్పుడు ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని అన్నారు. భగీరథ ప్రాముఖ్యతపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రచారం చేయాలనీ, ఇందుకోసం ఏర్పాట్లు చేయాలని సీఈలు, ఎస్ఈలకు సూచించారు. సమీక్ష దాదాపు మూడు గంటలపాటు జరిగింది. అంతకుముందు మిషన్ భగీరథ కార్యదర్శి స్మీతా సభర్వాల్ మంత్రి సీతక్కకు భగీరథ ప్రాజెక్టు, నీటి సరఫరా తదితర అంశాలపై వివరంగా చెప్పారు. ఈసందర్భంగా మంత్రి సైతం తనకున్న సందేహాలను నివృత్తిచేసుకున్నారు. ఈ సమీక్షా సమావేశంలో మిషన్ భగీరథ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఎం. కపాకర్ రెడ్డి, సీఈలు విజయ్‌ప్రకాశ్, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయండి

- మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి
- కారోబార్, బిల్‌కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలి
- మంత్రి సీతక్కకు సీఐటీయూ వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. అర్హులైన కారోబార్, బిల్‌కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ, బీమా, ఇన్సూరెన్స్, తదితర సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. శుక్రవారం హైదరాబాద్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు వినతిపత్రాన్ని అందజేశారు. మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గ్యార పాండు, చాగంటి వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ పైళ్ళ గణపతిరెడ్డి, మహిళా కన్వీనర్ పి. యాదమ్మ, రాష్ట్ర కార్యదర్శులు పి. సుధాకర్, తునికి మహేష్, మల్లేష్, అంజయ్య, పులి మల్లేష్, మండ్ల రాజు, వెంకటేష్ గౌడ్, నర్సమ్మ, ఆశయ్య, శ్రీకాంత్, రామకృష్ణ, వి.వి. నర్సింహా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన విధంగా పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని కోరారు. దీనివల్ల 12,769 పంచాయతీల్లో పనిచేస్తున్న 52 వేలకుపైగా ఉన్న పంచాయతీ కార్మికులు, ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. కారోబార్, బిల్ కలెక్టర్లు, గుమస్తాలను సహాయ కార్యదర్శులుగా నియమిస్తామనే హామీల అమలుకు సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, సిబ్బందికి జీఓ నెం.60 ప్రకారం వేతనాలు పెంచినట్టుగానే జీపీ కార్మికులకు కూడా వేతనాలు పెంచాలనీ, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేసి పాత కేటగిరీలను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.

గవర్నర్ ప్రసంగం చాలా బాధాకరం

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ అనిల్ కూర్మాచలం

నవతెలంగాణ-హైదరాబాద్

రాష్ట్ర ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ తమిళిసై సౌందరాజన్ చేసిన ప్రసంగం బాధాకరమని తెలంగాణ ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ అనిల్ కూర్మాచలం అన్నారు. రాష్ట్ర ప్రజలను పరాయి పాలన నుంచి, వివక్ష నుంచి విముక్తి చేసిన నాయకుడు కేసీఆర్ అని గుర్తు చేశారు. అలాగే తన ప్రాణాలను ఫణంగా పెట్టి రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా స్వయంపాలనలో తెలంగాణను తక్కువ కాలంలోనే దేశంలోనే అన్ని రంగాల్లో అభివద్ధి చేసి మొదటి స్థానంలో నిలిపారని చెప్పారు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉండి, ఒక కాంగ్రెస్ నాయకురాలిగా మాట్లాడటం సరికాదన్నారు. బాధ్యత గల పదవిలో ఉండి ప్రజలకు వాస్తవాలు తెలపాల్సింది పోయి అవాస్తవాలు చెప్పడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ నాయకత్వం లేని తెలంగాణను ప్రజలు ఊహించుకోలేకపోతున్నారని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా వాల్యూజోన్ మార్ట్ ప్రారంభం

ప్రారంభించిన హీరో బాలకృష్ణ




హైదరాబాద్ : నగరంలోని పటాన్‌చెరులో ఏర్పాటు చేసిన నూతన వాల్యూజోన్ హైపర్ మార్ట్‌ను శుక్రవారం ప్రముఖ నటుడు బాలకృష్ణ వేడుకగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆ సంస్థకు బాలకృష్ణ బ్రాండ్ అంబాసీడర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. దీనికి పి వెంకటేశ్వర్లు, ఎస్ రాజమౌళి, టి ప్రసాదరావులు ప్రధాన మెంటర్లుగా ఉన్నారు. ప్రారంభోత్సవానికి హాజరైన బాలకృష్ణను చూడటానికి ప్రజలు భారీగా పోగయ్యారు. వ్యాల్యూజోన్ రిటైల్ వాణిజ్య వ్యవస్థలోనే ఒక వినూత్న విప్లవాన్ని తీసుకురానుందని బాలకృష్ణ అన్నారు. ఇది హైదరాబాద్ నగరానికే గర్వకారణమన్నారు. ఇందులో విస్తృత శ్రేణికి చెందిన నాణ్యమైన ఉత్పత్తుల్ని, లాభసాటి ధరలకు కొనుగోలు చేయవచ్చన్నారు. గొప్ప షాపింగ్ అనుభవాన్ని అందిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ ప్రారంభోత్సవానికి వాల్యూజోన్ డైరెక్టర్లు సురేష్ సీర్ల, పివిఎస్ అభినవ్, టి రాకేష్, కేశవ్ గుప్తా తదితరులు హాజరై మాట్లాడుతూ.. వినూత్న షాపింగ్‌కు తమ సంస్థ చిరునామాగా నిలువనుందన్నారు. తమ మాల్‌లోని అసంఖ్యాకమైన బ్రాండ్లపై 40 శాతం వరకు డిస్కౌంట్లను అందించనున్నట్లు, విభిన్నమైన ఆఫర్లు అందుబాటులో ఉంటాయన్నారు. అందుబాటు ధరల్లో వినియోగదారులు మరిన్ని వస్తువులు కొనుగోలు చేయడానికి ప్రోత్సహించేలా వాతావరణం ఉంటుందన్నారు.

గుడిసె వాసులకు పట్టాలివ్వాలి

- ప్రజావాణిలో వినతి
- వ్యవసాయ కార్మిక సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రభుత్వ భూమిలో గుడిసేలుసుకున్న పేదలకు పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి జిల్లా భిక్నూర్ మండలం జంగంపల్లి గ్రామంలోని 985, 990,991 సర్వే నంబర్‌లో గుడిసెలేసుకున్న పేదలు ఇండ్ల పట్టాలివ్వాలని విజ్ఞాపన పత్రం అందజేశారని తెలిపారు. అక్కడ కొన్ని ఏండ్లుగా ఇండ్ల స్థలాల కోసం పోరాటం జరుగుతున్నదని పేర్కొన్నారు. పట్టాలతోపాటు గృహనిర్మాణం కోసం రూ. 5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కన్వీనర్ బి.పద్మ, రాష్ట్ర నాయకులు కొత్త నర్సింములుతోపాటు 50 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రవాసీ సంక్షేమం కోసం...
ప్రత్యేక నిధి కేటాయించాలని డిమాండ్

పొట్ట చేత పట్టుకొని వేల మైళ్ల దూరం వెళ్లిన అభాగ్యులకు అక్కడ చేయూత కరువై.. చేద్దామంటే పని లేక కొన్నిసార్లు ఉత్త చేతులతో స్వదేశానికి తిరిగి వస్తున్నారు. ఇక్కడికొచ్చాక అప్పులు చెల్లించాలంటూ వేధింపులు.. ఇంటి భారమూ మోయలేని పరిస్థితులు.. ఇలా మానసికంగా కుంగిపోతున్నారు. ఈ పరిస్థితుల్లో వారిని ప్రభుత్వాలు తప్ప ఎవరూ ఆదుకోలేరు. కానీ, ప్రవాసుల సంక్షేమం కోసం గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వమైనా తమను ఆదుకోవడానికి ప్రత్యేక నిధి కేటాయించాలని తెలంగాణ రాష్ట్రం నుంచి ఇతర దేశాలకు వెళ్లిన వారు కోరుతున్నారు.

గల్ఫ్ దేశాల్లో 10లక్షల మంది తెలంగాణ కార్మికులు

నవతెలంగాణ - సిరిసిల్ల

రాష్ట్రంలోని ప్రధానంగా ఆదిలాబాద్, నిర్మల్, ఆర్మూర్, కరీం నగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల నుంచి యూఏఈ, సౌదీ అరేబియా, ఓమన్, కతర్, కువైట్, బెహరాన్, ఇరాక్, ఇజ్రాయిల్, సింగపూర్, మలేషియా తదితర దేశాలకు సుమారు 10లక్షల మంది ఉపాధి కోసం వెళ్లారు. అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర దేశాలకు కూడా వేల సంఖ్యలో ఉపాధి, ఉద్యోగాల కోసం వెళ్తున్నారు. గల్ఫ్ దేశాలకు వెళ్తున్న వారు పలు సందర్భాల్లో అష్ట కష్టాలు పడుతున్నారు. ఈ క్రమంలో గల్ఫ్ వెళ్లిన వారితోపాటు ఇక్కడ వారి కుటుంబ సభ్యులకు కూడా గల్ఫ్ పాలసీ ప్రకటించాలని కొంత కాలంగా డిమాండ్ పెరుగుతోంది.

రాష్ట్రంలో 2014మ్యానిఫెస్టోలో గత ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి రూ.500కోట్ల నిధులు వెచ్చిస్తామని, చనిపోయిన వ్యక్తి కుటుంబానికి రూ.5లక్షలు ఇస్తామని, ఏజెంట్ల మోసాలపై కఠిన చట్టాలు తీసుకొస్తామని ఇచ్చిన హామీ నెరవేరకపోవడంతో ఈసారి శాసనసభ ఎన్నికల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేయడంతో పాటు గల్ఫ్ బాధిత కార్మిక కుటుంబాలు కూడా బరిలో నిలిచాయి. ఈ ప్రాంతాల్లో ఎన్నికల ఫలితాలు గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చిన విషయం తెలిసిందే. రాష్ట్రం నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లినవారు గత ఏడాది 1200మంది మృతిచెందినట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఇలాంటి సమయంలో సంక్షేమ నిధి ఆసరాగా నిలిచే అవకాశం ఉంటుందని అంటున్నారు. అక్కడ ఇబ్బందులు ఎదురైనప్పుడు సంక్షేమ నిధి నుంచి వారి కుటుంబాలకు సహాయం చేసేందుకు అవకాశం ఉంటుంది.

డిమాండ్లు ఇవీ!

- గల్ఫ్‌తో పాటు ఇతర దేశాల్లో స్థిరపడిన వారి సంక్షేమం కోసం ప్రభుత్వం వెంటనే పాలసీ ప్రకటించాలి. గల్ఫ్ బిడ్డల భద్రత, సంక్షేమం కోసం చట్టసభల్లో విధానపరమైన నిర్ణయాన్ని ప్రకటించాలి. ఉద్యోగాల పేరుతో మోసం చేస్తూ అభాగ్యులను గల్ఫ్ దేశాలకు పంపే ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. గల్ఫ్ దేశాల్లో మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి పరిహారం అందజేయాలి. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ఆధ్వర్యంలో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలి.
- బడ్జెట్లో గల్ఫ్ సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలి. కేరళ విధానం చాలా బాగుంది. కేరళ ప్రవాసీల కోసం ప్రత్యేక నిధి కేటాయించింది. అంతేకాకుండా కేరళ రాష్ట్రం నుంచి ఎంబసీలో ఐదు నుంచి పది మంది అధికారులు ఉంటారు. చనిపోయిన గల్ఫ్ కార్మిక కుటుంబానికి ఎన్నారై పాలసీ ద్వారా రూ.10లక్షల బీమా ఇస్తోంది. కేరళ తరహాలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తే బాగుంటుంది. గల్ఫ్ దేశాల్లో ఆదరణ ఉన్న ఉద్యోగాలకు ఉచిత సాంకేతిక శిక్షణ అవగాహన కల్పించాలి. తెలంగాణ రాష్ట్రం నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లి ఆచూకీ లేకుండా పోయిన వారితో పాటు వివిధ దేశాల్లోని జైళ్లలో మగ్గుతున్న వారి వివరాలను కేంద్రం భారత రాయబార కార్యాలయం ద్వారా సేకరించి సమస్యలు పరిష్కరించాలి. అనుకోని ఘటనల్లో గాయపడిన, అచేతన స్థితిలోకి వెళ్లిన వారికి ప్రభుత్వమే వైద్య చికిత్స అందించాలి.

హామీలు అమలు చేయలేదు




గత ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చింది. ఏ ఒక్కటీ అమలు చేయలేదు. గల్ఫ్‌లో చనిపోయిన వారి మృతదేహాలను మా అవగాహన వేదిక ద్వారా స్వదేశానికి తెప్పించి వారి కుటుంబాలకు కోటి రూపాయ లకుపైగా ఆర్థిక సహాయం చేశాం. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మా సమస్యలను పట్టించుకోని డిమాండ్లను తప్పనిసరిగా నెరవేర్చాలి. కేరళ తరహాలో తెలంగాణలోనూ ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి.

- కృష్ణ దొనికేని, గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు

సంపాదకీయం

వైఫల్యం



అది దేశ చట్టసభ సభ్యులు సమావేశమయ్యే చోటు. అత్యున్నత చట్టాల రూపకల్పన జరిగే ప్రదేశం. కాబట్టి.. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండొచ్చని అంతా భావించడం సహజం. కానీ, రెండు దశాబ్దాల కిందట పార్లమెంట్ మీదే జరిగిన ఉగ్రదాడి భారత్‌కు భద్రతా నిర్వాహణలో మాయని మచ్చని మిగిల్చింది. మళ్లీ అదే తేదీన, కొత్తగా హైటెక్ హంగులతో తీర్చిదిద్దిన పార్లమెంట్‌లో అలాంటి అలజడే చెలరేగింది. ఏకంగా దిగువ సభ లోపల ఆగంతకులు దాడికి దిగడంతో 'పార్లమెంట్‌లో భద్రత మరోసారి' ప్రశ్నార్థకంగా మారింది.

ప్రధాని సహా ప్రజాప్రతినిధులందరూ సమావేశమయ్యే ప్రాంగణంలో చోటుచేసుకున్న ఈ ఘటన యావత్ దేశాన్ని ఉలిక్కిపాటుకు గురిచేసింది.

> **పార్లమెంట్ సహా ఢిల్లీ భద్రత మొత్తం చేతిలో ఉండే కేంద్రహోంమంత్రి ఈ మొత్తం ఘటనపై సభలో ప్రకటన చేయాలని అన్ని పక్షాలు పట్టుపడుతున్నాయి. కానీ, జవాబివ్వాల్సిన అధికార పక్షం మొండికేయడమే గాక, ప్రశ్నించిన పాపానికి ఒక రాజ్యసభ్యుని సహా14 మంది ప్రతిపక్ష ఎంపీల శీతకాల సమావేశాలు ముగిసేవరకు ప్రభుత్వం సస్పెండ్ చేసింది. సభలోనే కాదు ఢిల్లీలోనే లేని ఓ ప్రతిపక్ష ఎంపీ పేరు సైతం అందులో చేర్చి, తీరా రచ్చకెక్కే సరికి 'అది క్లరికల్ మిస్టేక్' అని సింపుల్‌గా చెప్పేసింది.**

2001 నాటి చేదు జ్ఞాపకాలను ఈ దురంతం మళ్లీ గుర్తుచేసింది. అప్పట్లో పాక్ ప్రేరేపిత తీవ్రవాదులు మన పార్లమెంట్‌పై తుపాకులతో దాడికి తెగబడితే, ఈసారి సందర్శకులుగా వచ్చిన ఇద్దరు భారతీయ సాధారణ యువకులు లోక్‌సభ సభా ప్రాంగణంలోకి దూకి, రహస్యంగా తెచ్చిన పొగగొట్టాలతో అలజడి రేపారు. సభ వెలుపల రంగుల పొగతో మరో ఇద్దరు నిరసన పూర్వక నినాదాలకు దిగారు. ఇంతకు నలుగురు తీవ్రవాదులా అంటే.. కాదు, మధ్య, దిగువ తరగతి నిరుద్యోగులు. భగత్‌సింగ్ అభిమానులంటున్న వీరంతా దేశంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి 'ఫేస్‌బుక్' పేజీ ద్వారా ఒక్కటయ్యారు, ఆరు డిగ్రీలు చేసి, లెక్చరర్ ఉద్యోగానికి 'నెట్' సైతం క్వాలిఫై అయిన నిరుద్యోగ హర్యానా యువతి నీలమ్. కంప్యూటర్ ఇంజనీరైన మైసూర్ నిరుద్యోగి మనోరంజన్. ఆర్మీలో చేరాలని ఆరాటపడి విఫలమైన అమోల్. లక్నోకు చెందిన ఇ-రిక్షా కార్మికుడు సాగర్ శర్మ. బహుశా అస్తవ్యస్త పరిపాలన, నిరుద్యోగ సమస్యలాంటివే వారందరిని ఐక్యం చేసి ఉండవచ్చు. వారి నినాదాల ద్వారా నిరుద్యోగం, మణిపూర్ అల్లర్లు, రైతు వ్యతిరేక చట్టాలు వంటి అంశాలను దేశం దృష్టికి తీసుకురావడానికే ఈ దుస్సాహసానికి దిగినట్టు అర్థమవుతుంది. అలజడి సృష్టించిన వారు హిందువులు కాబట్టి సరిపోయింది. మరే మతస్థులై ఉంటే దేశం ఈపాటికే రావణకాష్టంలా మండుతుండేది.

అయితే, ఆ నలుగురినీ కఠినమైన 'ఉపా' చట్టం కింద అరెస్ట్ చేసి పోలీస్ కస్టడీకి పంపారు. భద్రతా వైఫ్యలమంటూ ఎనిమిది మంది సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేశారు. కానీ, వారికి పాసులు జారీ చేసిన అధికార పార్టీ ఎంపీని మాత్రం ఇప్పటికీ పల్లెత్తు మాటనలేదు. పైగా స్పీకర్‌ను కలిసి వివరణ ఇచ్చిన సదరు ఎంపీ కనీసం పశ్చాతాపాన్ని కూడా వ్యక్తం చేయకపోగా, వారెవరో నాకు తెలియదంటూ చేతులు దులుపుకోవడం విస్తుగొలుపుతుంది. ఒకపక్క అమెరికా నుంచి ఖలిస్తానీ తీవ్రవాది గురుపథ్ వంత్ సింగ్ పన్నూ పార్లమెంట్‌పై దాడి చేస్తామని హూంకరిస్తున్న నేపథ్యంలో బుధవారం పార్లమెంట్ వద్ద ఎంత అప్రమత్తంగా ఉండాలి! అంచెలంచెల తనిఖీని దాటుకొని, ఆ నలుగురూ పొగగొట్టాలతో లోపలికి వచ్చారంటే మన తనిఖీ, నిఘా వ్యవస్థలు నిద్రిస్తున్నట్టేగా!

అధికారపార్టీ ఎంపీ నుంచి ఈ నిరసనకారులకు పాసులు జారీ కావడం ఒక ఎత్తయితే, వెంటపడి పాసులు తీసుకున్న వారి కనీస వివరాలు సైతం నా దగ్గర లేవంటున్న సదరు ఎంపీ నిర్లక్ష్యాన్ని ప్రతిపక్షాలు తప్పు బడుతున్నాయి. పార్లమెంట్ సహా ఢిల్లీ భద్రత మొత్తం చేతిలో ఉండే కేంద్రహోంమంత్రి ఈ మొత్తం ఘటనపై సభలో ప్రకటన చేయాలని అన్ని పక్షాలు పట్టుపడుతున్నాయి. కానీ, జవాబివ్వాల్సిన అధికార పక్షం మొండికేయడమే గాక, ప్రశ్నించిన పాపానికి ఒక రాజ్యసభ్యుని సహా14 మంది ప్రతిపక్ష ఎంపీల శీతకాల సమావేశాలు ముగిసేవరకు ప్రభుత్వం సస్పెండ్ చేసింది. సభలోనే కాదు ఢిల్లీలోనే లేని ఓ ప్రతిపక్ష ఎంపీ పేరు సైతం అందులో చేర్చి, తీరా రచ్చకెక్కేసరికి 'అది క్లరికల్ మిస్టేక్' అని సింపుల్‌గా చెప్పేసింది. కేవలం భద్రత విషయంలోనే కాదు.. సభా నిర్వహణ లోనూ సర్కార్ నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతోంది. ఒకవేళ వచ్చింది 'తీవ్రవాదులై' ఉంటేనో? వారు పొగగొట్టాలు కాక, ఏ మారణాయుదాలో, విషవాయువులో తీసుకువచ్చి ఉంటే పరిస్థితేంటి? ఆ ఆలోచనే వెన్నులో వణుకు పుట్టిస్తుంది.

శత్రు దుర్భేద్యమని ప్రధాని పదేపదే చెప్పిన కొత్త పార్లమెంట్ భవనంలోనే ఇంతటి ఘటన జరగడం శోచనీయం.కాగా, ఏమాత్రం జవాబుదారీతనం లేని సర్కార్ తీరు అవాంఛనీయం.

"పైపై సొగసులు కల్ల సుమా
లోపలిదంతా డొల్ల సుమా
నిజం తెలియమని నేనంటాను
లేదా కొంపే గుల్ల సుమా" అంటూ కొన్ని దశాబ్దల క్రితం దాశరథి రాసిన ఈ పద్యం ప్రస్తుతాన్నికి సరిగ్గా సరిపోతుంది. ఈ అత్యంత ఆధునాతన భవనం సైతం గతకాలపు తప్పిదాలు పునరావతం కాకుండా నిలువరించ లేకపోయింది. పోలీసు, ఇంటలిజెన్స్ సహా పార్లమెంటు భద్రతకు పూచీపడే సమస్త వ్యవస్థల వైఫల్యం కారణంగా, అప్పటి దురాగతాన్ని గుర్తుచేస్తూ, అదే రోజున దేశం మరోమారు ఈ ఘటనను చవిచూడాల్సి వచ్చింది. దీనిపై సమగ్రమైన దర్యాప్తు చేసి, దేశ ప్రజలకు నమ్మకాన్ని కలిగించాల్సిన బాధ్యత కేంద్రానిదే.

హిందూత్వవాదుల అదుపులో విద్యావ్యవస్థ




రామ్ పునియానీ

పాలక భారతీయ జనతాపార్టీ తన రెండు విడతల అధికారాన్ని పూర్తి చేసే సమయం దగ్గర పడుతుండటంతో, విద్యా సంస్థలపై దాని ప్రభావం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్, ఆదాయ పన్నుల శాఖ అధికారులు, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ లు, ప్రతిపక్ష పార్టీలను చిక్కు పరిస్థితుల్లోకి నెట్టివేయడంలో తమవంతు పాత్రను పోషించాయి. కొన్ని సందర్భాల్లో ఎలక్షన్ కమిషన్ పక్షపాత ధోరణిని ప్రదర్శించింది. అధికార భారతీయ జనతాపార్టీ రాజకీయ భావజాలానికి అనుగుణంగా విద్యావిధానం, నిర్మాణాన్ని మార్పు చేయాలని జరుగుతున్న ప్రయత్నంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ (ఎన్సీఈఆర్టీ)లు ఏ మాత్రం వెనుకబడి పోలేదని ఇప్పుడు స్పష్టం అవుతుంది.

విద్యార్థుల్లో హిందూ జాతీయవాద భావోద్వేగాలను, నైతిక ధోరణులను పరిచయం చేసే ఉద్దేశంతో విద్యా సంస్థలకు క్రమం తప్పకుండా కొత్త సూచనలను పంపిస్తున్నారు. ప్రస్తుత పాలక ప్రభుత్వం విద్యార్థి ఉద్యమాలను బలహీనపరచి, బెదిరింపులకు గురి చేసే ప్రయత్నం చేసినపుడు, విద్యార్థులు నిరసిస్తే, ఆ నిరసనలు జాతి వ్యతిరేకం అని ముద్ర వేసింది. ప్రతీ విశ్వవిద్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించడానికి ఒక పొడవైన స్తంభాన్ని ఏర్పాటు చేయాలని మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ మాజీ మంత్రి స్మృతీ ఇరానీ ప్రతిపాదన చేసింది. సహజంగానే ప్రభుత్వ ఆలోచనలకు వ్యతిరేకంగా విద్యార్థులు బహిరంగంగా చర్చలు జరిపే జవహర్ లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయ ప్రాంగణంలో ఆయుధ వినియోగ విధానాన్ని అధికారికంగా నిలిపివేసే మిలిటరీ ట్యాంక్ ను ఉంచాలనే మరొక ఆలోచన తెరపైకి వచ్చింది.

ఇటీవల కాలంలో మరిన్ని సర్క్యులర్లను జారీ చేశారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) స్థాపకుడైన ఒక రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రచారకుడు, దత్తాజీ దిదోల్కర్ శతజయంతి (సంవత్సర కాలంపాటు జరిగే)ఉత్సవాల్లో విద్యార్థులందరూ తప్పనిసరిగా పాల్గొనాలని ఒకరు చెపుతారు. ఒక హిందూ జాతీయవాది కోసం కోరుతున్న ఈ జీవన విధానపు ఆచరణ ప్రధానంగా మహారాష్ట్రలో కళాశాలల కోసం ఉద్దేశించబడింది. హిందూ జాతీయవాదానికి చెందిన వ్యక్తి ఉత్సవాలను యూజీసీ ప్రోత్సాహించడం సరిదైనదేనా? వాస్తవానికి యూజీసీ, బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వారిని లేదా భారత జాతీయవాదం కోసం నిలబడిన వారిని ప్రోత్సహించాలి. కానీ దిదోల్కర్‌కు, స్వాతంత్ర్య పోరాటంలో ఎలాంటి భాగస్వామ్యం లేదు. అదేవిధంగా స్వాతంత్ర్య భారతదేశ రాజ్యాంగంలో పొందు పరచిన విలువలను అతడు ఏ విధంగానూ ప్రతిబించలేదు.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలని మరొక సర్క్యులర్ డిమాండ్ చేస్తుంది. 2024 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అలాంటి చర్యల్ని చేపడుతు న్నారు, కానీ ఒక ప్రజాస్వామ్య దేశంలో అలాంటి వాటికి స్థానం ఉండదు. అది ప్రజాస్వామ్య నైతికతను, ప్రజాస్వామిక, రాజ్యాంగ విలువలను ఘోరంగా ఉల్లంఘించడమే అవుతుంది. ఇది అధికారాన్ని మొత్తంగా దుర్వినియోగం చేయడమే.



అంతేకాదు, చరిత్ర పా ఠ్యాంశాలలో భాగంగా ఏడవ తరగతి నుండి పన్నెండవ తరగతి చదువుతున్న విద్యార్థులకు రామాయణం, మహాభారతాలను బోధించా లని, వాటిని 'సాంప్రదాయ కాలం' (క్లాసికల్ పీరియడ్)లో ఉంచాలని ఇటీవలకాలంలో ఒక ఆదేశం జారీ అయింది. ఎన్సీఈఆర్టీ నిపుణుల బృందం చెప్పేదాని ప్రకారం రామాయణం, మహాభారతాలను నేర్చు కోవ డం వలన ఆత్మగౌరవం, దేశభక్తి, ఆత్మసంతృప్తి పెరుగుతుంది.

భారతదేశ రెండు గొప్ప ఇతిహాసాలు మన పురాణాలలో ఒక భాగంగా ఉన్నాయి. అవి వ్రాయబడిన కాలం నాటి సమాజం, నియమనిబంధనల గురించి అద్భుతమైన విజ్ఞానాన్ని అందించగలవు. ఈ గొప్ప ఇతిహాసాలు అస్పష్టమైన అవగాహన లేదా అసంపూర్ణమైన జ్ఞానంలో చిక్కుకొని పోయిన చరిత్ర కాలాల గురించి నిశితదృష్టిని కలుగజేస్తాయి.

భారతదేశానికి అవతల అంటే శ్రీలంక, థాయ్‌లాండ్, బాలి, సుమత్రా, ఇంకా ఇతర ప్రాంతాల్లో రామాయణం ప్రసిద్ధి చెందింది. ఆసక్తికరమైన విషయం ఏమంటే, రామాయణానికి అనేక వృత్తాంతాలు (వెర్షన్స్) ఉన్నాయి. వాస్తవానికి వాల్మీకి చేత వ్రాయబడిన రామాయణం, గోస్వామి తులసీదాస్ వ్రాసిన అవధి ఇతిహాస రామాయణం ద్వారా జన సమ్మతం అయ్యింది. 16వ శతాబ్దం నుండి ఉత్తర భారతదేశంలోని ప్రసిద్ధ సంస్కృతిలో ఇది భాగంగా మారింది. అనేక రామాయణ వృత్తాంతాలు, దాని వైవిధ్యమూలాలు, భౌగోళికవ్యాప్తి నుండి వచ్చాయి. కానీ హిందూ జాతీయవాదులు మాత్రం కేవలం ఒక వృత్తాంతాన్నే గొప్ప ఇతిహాసంగా ప్రోత్సహిస్తున్నారు. పౌలా రిచ్ మాన్ రచించిన 'మెనీ రామాయణ్స్:ద డైవర్సిటీ ఆఫ్ ఏ న్యారేటివ్ ఇన్ సౌత్ ఏషియా'ను1991లో ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ మొదటిసారి ప్రచురించింది. ఇది శ్రీరాముని కథ వైవిధ్యమైన వృత్తాంతాలను పరిశోధిస్తుంది. ప్రముఖ మేధావి ఏ.కే. రామానుజన్ రచించిన అసాధారణ వ్యాసం, '300 రామాయణాస్: ఫైవ్ ఎగ్జాంపుల్స్ అండ్ త్రీ థాట్స్ ఆన్ ట్రాన్స్లేషన్' ను 2011 వరకు ఢిల్లీ విశ్వ విద్యా లయంలో బోధనాంశాలలో చేర్చారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేయడంతో ఆ విశ్వవిద్యాలయం ఒత్తిడికి గురైంది.

రామానుజన్ మనకు వైవిధ్యమైన కథనాలు అంటే జైన, బౌద్ధ, మహిళల (చివరగా రంగ నాయకమ్మ) రామాయణాల గురించి చెప్తే, హిందూ జాతీయవాదులు శ్రీరాముని కథల్లోని ఒకే ఒక నిర్దిష్టమైన వృత్తాంతాన్ని ప్రామాణికంగా ముందుకు తీసుకురావాలని అనుకుంటున్నారు. 'ఆదివాసీ రామాయణం' కూడా మిగిలిన వాటికి భిన్నమైన ఇతివృత్తాన్ని కలిగి ఉంది. కానీ ప్రధాన స్రవంతి మీడియా, ప్రభుత్వం దానిని దాచిపెట్టాలని అనుకుంటున్నాయి.

బీ.ఆర్.అంబేద్కర్, తన "రిడిల్స్ ఇన్ హిందూ యిజం" రచనలో రాముడు, తపస్సు చేస్తున్న సమయంలో శంబూకుని (శూద్రులకు సమానత్వాన్ని నిరాకరించడంతో) చంపిన విషయంలో మన దృష్టిని ఆకర్షించాడు. కొన్ని అణగారిన వర్గాలలో గౌరవనీయమైన పాలకుడైన బాలిని కూడా రాముడు చంపాడు. 'మన బాధలు పోనివ్వండి, బాలి రాజుగా తిరిగి రాని వ్వండి' అనేది ప్రార్థన. ద్రోహం చేసిందనే అనుమానంతో రాము డు, సీతను బహిష్కరించి, అడవులకు పంపడాన్ని అంబేద్కర్ విమర్శిస్తాడు. ద్రావిడులపైన ఉత్తర భారత ఆర్యవాదాన్ని విధించిన విషయంలో పెరియార్ కూడా శ్రీరాముడిని విమర్శిస్తాడు.

> **బీ.ఆర్.అంబేద్కర్, తన "రిడిల్స్ ఇన్ హిందూయిజం" రచనలో రాముడు, తపస్సు చేస్తున్న సమయంలో శంబూకుని (శూద్రులకు సమానత్వాన్ని నిరాకరించడంతో) చంపిన విషయంలో మన దృష్టిని ఆకర్షించాడు. కొన్ని అణగారిన వర్గాలలో గౌరవనీయమైన పాలకుడైన బాలిని కూడా రాముడు చంపాడు. 'మన బాధలు పోనివ్వండి,బాలి రాజుగా తిరిగి రానివ్వండి' అనేది ప్రార్థన. ద్రోహం చేసిందనే అనుమానంతో రాముడు, సీతను బహిష్కరించి, అడవులకు పంపడాన్ని అంబేద్కర్ విమర్శిస్తాడు. ద్రావిడులపైన ఉత్తర భారత ఆర్యవాదాన్ని విధించిన విషయంలో పెరియార్ కూడా శ్రీరాముడిని విమర్శిస్తాడు.**

అదేవిధంగా మహర్షి వేద వ్యాసుడు రచించిన మహా భారతం, ఇప్పటి వరకు రచించబడిన అతి పొడవైన పద్యం. ఇది మన గతానికి సంబంధించిన విలువైన అనుభవాలను అంది స్తుంది. చారిత్రక విజ్ఞానానికి మన ఇతిహాసాలన్నీ అవసరమైన వనరులే, కానీ చరిత్ర పాఠ్య ప్రణాళికలోకి వాటిని దిగుమతి చేయడం వలన చరిత్రకు గానీ, ఇతిహాసాలకు గానీ, పురాణాల పట్ల మనకున్న అవగాహనకు గానీ ఎలాంటి న్యాయం జరగదు. ఇది, మన గతానికి సంబంధించిన వాస్తవాలను అవగాహన చేసుకునే దానికంటే కూడా హిందూ జాతీయవాద ఎజెండాతోనే ఎక్కువగా ముడిపడి ఉంది.

> **భారతదేశానికి బ్రిటీష్ మూలాలు ఉన్నాయి కాబట్టి ఇండియా, బానిసత్వాన్ని నిర్దేశిస్తుందన్న కారణంగా ఇండియా స్థానంలోకి భారత్‌ను తీసుకొని రావాల్సిన అవసరం ఉందని ఎన్సీఈఆర్టీ నిపుణుల ప్యానెల్ సూచించింది. బ్రిటీష్ వారు రావడానికి చాలా కాలం ముందే ఇండియా అనే పదం వైవిధ్యాల ఉనికిని ఉద్దేశపూర్వకంగానే అణచివేస్తున్నారు. బీసీఈ 303 నాటికి, గ్రీకు యాత్రికుడు, దౌత్యవేత్త అయిన మెగస్తనీస్ ఇండికా అనే పదాన్ని ఉపయోగించాడు. భారతదేశాన్ని సూచిస్తూ సింధూ నది నుండి వచ్చిన పదాల మూలాలు ప్రారంభం నుండి వాడుకలో ఉన్నాయి. అందుకే మన రాజ్యాంగంలోని "భారత్" అనే "ఇండియా" అనేది మనకు సరైన సూత్రీకరణ.**

భారతదేశానికి బ్రిటీష్ మూలాలు ఉన్నాయి కాబట్టి ఇండియా, బానిసత్వాన్ని నిర్దేశిస్తుందన్న కారణంగా ఇండియా స్థానంలోకి భారత్‌ను తీసుకొని రావాల్సిన అవసరం ఉందని ఎన్సీఈఆర్టీ నిపుణుల ప్యానెల్ సూచించింది. బ్రిటీష్ వారు రావడానికి చాలా కాలం ముందే ఇండియా అనే పదం వైవిధ్యాల ఉనికిని ఉద్దేశపూర్వకంగానే అణచివేస్తున్నారు. బీసీఈ 303 నాటికి, గ్రీకు యాత్రికుడు, దౌత్యవేత్త అయిన మెగస్తనీస్ ఇండికా అనే పదాన్ని ఉపయోగించాడు. భారతదేశాన్ని సూచిస్తూ సింధూ నది నుండి వచ్చిన పదాల మూలాలు ప్రారంభం నుండి వాడుకలో ఉన్నాయి. అందుకే మన రాజ్యాంగంలోని "భారత్" అనే "ఇండియా" అనేది మనకు సరైన సూత్రీకరణ. కానీ, ఇండియా/భారత్ ప్రాతినిధ్యం వహిస్తున్న వైవిధ్యం, కలుపుకొని పోయే విధానం, నిష్పటత్వాలతో హిందూ జాతీయవాదం అసౌకర్యంగా ఉంటుంది. వారు భారతదేశ చరిత్రను పునర్నిర్మాణం చేయాలని అనుకుంటున్నారు. భారతీయ చరిత్ర ప్రారంభకాలాన్ని బ్రిటీష్ వారు 'హిందూకాలం' అని పిలవగా, ఇప్పుడు హిందూ జాతీయవాదులు దానిని 'సాంప్రదాయకాలం'గా (క్లాసికల్ పీరియడ్) పిలవాలని కోరుకుంటున్నారు. ఆ కాలపు విలువలు నేటి సామాజానికి గీటురాయిగా అందించాలనేదే వారి ఆలోచన. వాటిలో చాలా విలువల్ని మనుస్మృతిలో చూడవచ్చు, ప్రచారం చేయబడిన విలువలే, అంబేద్కర్ ఈ మనుస్మృతికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసేట్టు చేశాయి. ▪

("న్యూస్ క్లిక్" సౌజన్యంతో)

అనువాదం : బోడపట్ల రవీందర్, 9848412451

హక్కుల సాధనకు చరిత్ర చెప్పిన పాఠం...పోరాటం

"మానవ సంస్కృతి వికాసానికి భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణ లేదా అసమ్మతి కారణం.ప్రపంచంలోని జ్ఞానం ప్రశ్నించకుండా అభివృద్ధి చెందదు. ఆధునిక సమాజంలో భిన్నాభిప్రాయాలు ఉండటం, పౌరులు అసమ్మతులు వ్యక్తపరచడం వారి వాక్ స్వాతంత్ర్యంలో తప్పనిసరిగా ఒక భాగమై ఉండాలి. సమాజాలు నిరంతరంగా కొనసాగాలంటే ఇది అత్యంత కీలకం." అని అంటారు ప్రముఖ చరిత్రకారిణి రోమిల్లా థాపర్.

మానవజాతి తన మనుగడ కోసం, తను జీవించడానికి ప్రభావితం చేసే అంశాల గురించి భిన్నాభిప్రాయాలను వ్యక్తపరచడం వల్లనే మానవ సంస్కృతి, సమాజం అభివృద్ధి కాగలిగింది. బానిస వ్యవస్థ, రాచరిక వ్యవస్థలు పోయి పెట్టుబడిదారి సమాజం పెంపొందింది. ఇందులో లౌకికవాదం ఒక అంశం మాత్రమే. అయితే పెట్టుబడిదారి ఆధిపత్యం తన రూపాన్ని మార్చుకుంది. ఉదారంగా ప్రజలకు కొన్ని హక్కులు, వెసులుబాటులిస్తూ సంపన్నవర్గం తన ఆధిపత్యాన్ని, దోపిడీని చెలాయిస్తుంది. చారిత్రాత్మకంగా ఈ ప్రశ్నించేతత్వం, ధిక్కారము ఉన్నాయనడానికి వలసవాదం నుండి విముక్తి అయిన దేశాలే ఉదాహరణలు.ఆధునిక పౌరసమాజం కూడా ఇదే ఘర్షణను అసమ్మతిని, ప్రశ్నించే హక్కును కాపాడుకోవడానికి దినదిన సంఘర్షణలు పడాల్సి వస్తుంది.

మార్కెట్‌పై ఆధిపత్యం కోసం జరిగిన రెండు ప్రపంచ యుద్ధాలు మానవ హక్కుల సార్వత్రిక ప్రకటనను రూపొందించడానికి దారితీశాయి. అందరికీ స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, శాంతి, గౌరవం, రక్షణకు 1948, డిసెంబర్ 10న ఐక్యరాజ్య సమితి ప్రపంచ మానవ హక్కుల దినోత్సవంగా ప్రకటించి ఇటీవల వజ్రోత్సవం కూడా జరుపుకున్నది. అయినా ప్రపంచంలో ఏదో ఒక మూల ప్రతిరోజు ఈ హక్కుల కోసం పోరాటాలు సాగుతూనే ఉన్నాయి. బంగ్లాదేశ్‌లో ఏడాది కాలం నుండి ప్రభుత్వ నిరంకుశత్వం, అప్రజాస్వామికం, పత్రికాస్వేచ్ఛహరణ, అవినీతి, పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా, పారదర్శకమైన ఎన్నికల కోసం జరుగుతున్న సమ్మెలో పోరాటాల్లో ముగ్గురు ఉద్యమకారులు, ఒక పోలీసు మరణించారు. ఐర్లాండ్‌లో దాని జనాభాలో ఒక శాతానికి సమానంగా తరలివచ్చిన శరణార్థులను బహిష్కరించడం గురించి, స్థానిక ప్రజలకు నివాసాల ఏర్పాటు గురించి గతేడాది నుండి ఆందోళనలు జరుగుతుంటే ఆ శరణార్థుల ఆశ్రయాల కోసం కూడా మరో పక్క ఆందోళనలు జరుగుతున్నాయి. ఇజ్రాయిల్, గాజాపై చేస్తున్న అమానవీయ దాడులకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా అనేక చోట్ల నిరసన ప్రదర్శనలు జరిగాయి. స్వయంగా ఇజ్రాయిల్ ప్రజలే యుద్ధాన్ని ఆపాలి అంటూ తమ భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పాలస్తీనా ప్రజలకు మద్దతు తెలిపారు. నేతన్యాహు ప్రభుత్వం ఆందోళనలు చేస్తున్న ఉద్యమకారులను అక్రమంగా నిర్బంధించింది. యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్న పత్రికలను రద్దు చేసింది.



యం.డి.షకీల బేగం

ఇలా ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కుల కోసం మనుగడ కోసం స్థానిక ప్రజల పోరాటాలు సాగుతున్న నేపథ్యంలో ఆందోళనకారులపై, మానవహక్కుల ఉద్యమకారులపై ప్రభుత్వం విరుచుకుని పడుతూనే ఉంది. ఇలా నిరంకుశంగా వ్యవహరించడంలో భారత ప్రభుత్వమూ తీసిపోలేదు. గ్లోబల్ ఇండెక్స్ ర్యాంకింగ్‌లో ప్రపంచ సంతోష సూచికలో 126/146 వ స్థానం లోనూ, పత్రికాస్వేచ్ఛలో 161/180, ప్రపంచ శాంతి సూచికలో 135/163, లింగ వివక్షతలో 135/146, ఆకలి సూచికలో 107/121వ స్థానంలోనూ ఉన్నాయి. స్వీడన్‌కు చెందిన వీ-



డెమ్ సంస్థ సర్వే ప్రకారం భారతదేశాన్ని ఎన్నికల నిరంకుశత్వం గల రాజ్యంగా వర్గీకరించింది. ఎందుకంటే ప్రజాస్వామ్యంపై బహుళ కోణాల నుండి ఆంక్షలు విధించబడుతున్నాయి.బహుళ కోణాల నుండి అంటే కొన్ని ప్రజా సమూహాలపై వాక్ స్వాతంత్ర్యం నిర్బంధం జరుగుతుంది. కుల, మత రాజకీయాలు పెరుగుతున్న పరిస్థితులు దర్శనమిస్తున్నాయి. అభ్యుదయం, సైద్ధాంతికత్వంపై దాడులు పెచ్చ రిల్లుతున్నాయి.

జాతీయ హింస వ్యతిరేక ప్రచార సంస్థ (ఎన్‌సి ఎటి) 29 జూన్ 2020లో ఇచ్చిన రిపోర్ట్ ప్రకారం 2019లో రోజుకు ఐదుగురు చొప్పున 1731 పోలీస్ కస్టడీ మరణాలు సంభవించాయి. వీరంతా దుర్బలమైన వారు, దళితులు, ముస్లింలు, ఆదివాసీలు. సిఏఏ, ఎన్ఆర్‌సికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమ సందర్భంలో 2020లో జాతీయ క్రైమ్ రిపోర్ట్ బ్యూరో ప్రకారం (ఎన్‌సిఆర్‌బి)మతపరమైన అల్లర్లలో 62 మంది చనిపోయారు ఈ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులపై 'ఉప' చట్టంతో దేశద్రోహం కేసులు పెట్టడం, వారి నివాస ప్రాంతాలను, దుకాణాలను, ఆస్తులను బుల్డోజర్లతో ధ్వంసం చేశారు. 3 మే 2023లో మణిపూర్‌లో మైతీ - కుకీలు (మెజారిటీ - మైనారిటీ) జాతుల మధ్య జరిగిన హింసలతో 175 మంది మరణించారు. 118 మంది గాయపడ్డారు. ఈ మారణకాండలో మైనారిటీ జాతికి చెందిన మహిళలను నగ్నంగా ఊరేగించి, బలత్కరించి హత్యచేశారు.

2002లో గుజరాత్‌లో జరిగిన అల్లర్లలో అధికారిక లెక్కల ప్రకారం 790 మంది ముస్లింలు, 254 మంది హిందువులు 1044 మంది పౌరులు చనిపోయారు. ఈ మారణకాండలో మానవ హక్కులపై జరిగిన దాడులకు వ్యతిరేకంగా మానవ హక్కుల ఉద్యమకారిణి తీస్తా సెతల్వాడ్ ఉద్యమించినందుకుగాను కేసులు, నిర్బంధాలు ఎదుర్కొంటున్నారు. గిరిజనుల రక్షణ, సంక్షేమం, అభివృద్ధి కోసం గళమెత్తిన స్టాన్ స్వామినీ అక్రమ కేసులతో ప్రభుత్వం నిర్బంధించి జైల్లోనే ఆయన మరణానికి కారణమైంది. కులాంతర వివాహాలను ప్రోత్సహించిన ఉద్యమకారుడు గోవింద్ పన్సారే, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రచారం చేసిన నరేంద్ర దబూల్కర్, కుల వ్యవస్థను ధిక్కరించిన గౌరీలంకేష్‌లు నిర్దాక్షిణ్యంగా కాల్చబడ్డారు. హత్రాస్ కేసులో నిజానిజాలు బయటకు తేవడానికి ప్రయత్నించిన పాత్రికేయుడు సిద్ధిఖ్ కప్పన్‌పై యూపీ ప్రభుత్వం దేశద్రోహ కేసు పెట్టి రెండేళ్ల జైలు శిక్ష అనుభవించేలా చేసింది. డిజిటల్ మీడియా సంస్థ న్యూస్‌క్లిక్‌పై దాడి, దాని వ్యవస్థాపక సంపాదకులు ప్రబీర్ పురకాయస్థ అరెస్టు, ఇలా అనేక నిర్బంధాల ఉదాహరణలు చూడవచ్చు.

ఈ విధంగా భారతదేశంలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా మానవ హక్కుల కోసం పోరాడుతున్న ఉద్యమ కారులపై నిర్బంధాలను ప్రయోగించడంలో రాజ్యం, ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుంది. పోరాటం జరుగుతున్న ప్రాంతాలను చీకటిమయం, చేస్తూ ప్రపంచానికి ఏమీ తెలియకుండా దూరం చేసి, ఇంటర్నెట్లు, విద్యుత్తు ఆపివేసి, మీడియాని నియంత్రించి, అన్ని రకాల నిర్బంధాలను ప్రయోగిస్తుంది.పై ఉదాహరణలన్నీ మానవ హక్కుల హననం ఏ విధంగా జరుగుతున్నాయో తెలియజేస్తున్నాయి.

> **2002లో గుజరాత్‌లో జరిగిన అల్లర్లలో అధికారిక లెక్కల ప్రకారం 790 మంది ముస్లింలు, 254 మంది హిందువులు 1044 మంది పౌరులు చనిపోయారు. ఈ మారణకాండలో మానవ హక్కులపై జరిగిన దాడులకు వ్యతిరేకంగా మానవ హక్కుల ఉద్యమకారిణి తీస్తా సెతల్వాడ్ ఉద్యమించినందుకుగాను కేసులు, నిర్బంధాలు ఎదుర్కొంటున్నారు. గిరిజనుల రక్షణ, సంక్షేమం, అభివృద్ధి కోసం గళమెత్తిన స్టాన్ స్వామినీ అక్రమ కేసులతో ప్రభుత్వం నిర్బంధించి జైల్లోనే ఆయన మరణానికి కారణమైంది. కులాంతర వివాహాలను ప్రోత్సహించిన ఉద్యమకారుడు గోవింద్ పన్సారే, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రచారం చేసిన నరేంద్ర దబూల్కర్, కుల వ్యవస్థను ధిక్కరించిన గౌరీ లంకేష్‌లు నిర్దాక్షిణ్యంగా కాల్చబడ్డారు. హత్రాస్ కేసులో నిజానిజాలు బయటకు తేవడానికి ప్రయత్నించిన పాత్రికేయుడు సిద్ధిఖ్ కప్పన్‌పై యూపీ ప్రభుత్వం దేశద్రోహ కేసు పెట్టి రెండేళ్లు జైలు శిక్ష అనుభవించేలా చేసింది.**

మానవ జీవితం పవిత్రమైనదని ఒక్కోమతంలో ఒక్కో రకంగా మత నమ్మకాలు విశ్వాసాలు ఉన్నాయి. కొన్ని మతాలైతే పునర్జన్మను కూడా విశ్వసిస్తాయి. కానీ ఆధునిక మానవ హక్కులు మానవతావాదంతో కాపాడబడతాయి. ఈ మానవ జీవితాన్ని జీవించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. చరిత్రను చూస్తే గతంలో కొందరికే ఉన్న ఓటు హక్కు, ఆస్తిహక్కు పోరాటాలతోనే అందరికీ సాధించబడ్డాయి. యుద్ధాలలో ప్రాణాలు కోల్పోయిన వారి తల్లులు, భార్యలు, ఆడపడుచులు ధిక్కరించటంతో శాంతి ఒప్పందాలు చేసుకోవలసి వచ్చింది. తన ఆయుధాలను అమ్ముకోవడానికి యుద్ధాలను ప్రేరేపిస్తున్న సామ్రాజ్యవాద అమెరికాను ప్రపంచం దోషిగా చూస్తున్న సమయంలో, దానికి తల వంచుతున్న దేశాల వైపు ప్రజలు, ప్రజా పోరాటాలతో వేలెత్తి చూపాలి.ఆధిపత్యం కోసం మృగాల కంటే హీనంగా ప్రవర్తిస్తున్న వారిని వెలివేయాలి. **రోజా లగ్జం బర్గ్ అన్నట్టు "ఏం జరుగుతూ ఉన్నదో బిగ్గరగా చెప్పడమే, ఎవరైనా, ఎప్పుడైనా చేయగల అత్యంత విప్లవాత్మకమైన పని."** ఆ పనిని మానవతావాదులు చేయాలి. హక్కుల సాధనకు, భద్రత కొరకు చరిత్ర చెప్పిన పాఠం.. పోరాటాలే శరణ్యం. ▪

మెయిల్ @ నవతెలంగాణ

'మహాలక్ష్మి'కి మార్గదర్శకాలు రూపొందించాలి

రాష్ట్రంలో పదేండ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో భాగంగా మహిళల ఉచిత బస్ ప్రయాణం ఈ నెల 9న సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా ప్రారంభించారు. ఇది పేద మహిళలకు ఒక వరం. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన రెండురోజుల్లోనే మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించడం అభినందించదగినది. అయితే ఉచిత ప్రయాణ పథకాన్ని ఒక్క ప్రాంతంలో "పైలట్ ప్రాజెక్టుగా" ప్రారంభించి ఎదురయ్యే సమస్యలను రవాణాశాఖ ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి విధివిధానాలను రూపొందించి రాష్ట్రమంతా అమలు చేస్తే బాగుండేది. దేశంలో మొట్టమొదటిగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అందించిన రాష్ట్రం తమిళనాడు. తమిళనాడు రవాణాశాఖ అక్కడి మహిళల కోసం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి సరైన విధి విధానాలను రూపొందించి స్టాలిన్ ప్రభుత్వం సక్సెస్ అయ్యింది. అదే భాటలో కర్నాటక ప్రభుత్వం ప్రయత్నం చేసినప్పటికీ అమలు చేయడంలో కొంత వైఫల్యం చెందిందనే వార్తలు వచ్చాయి. ఇప్పుడు తెలంగాణ రవాణా శాఖ ఎప్పటికప్పుడు ఉచిత ప్రయాణంలో వచ్చే సమస్యలను అధ్యయనం చేయకపోతే ఈ మహత్తరమైన పథకం నీరుగారే అవకాశముంది. రాష్ట్రంలో ఈ పథకాన్ని ప్రారంభించి వారమే అవుతున్నా మహిళల ఆదరణ పొందింది. కానీ ప్రయాణించే ప్రయాణికులకు అసౌకర్యంగా కూడా మారింది. ఏ బస్సులో అయినా కిక్కిరిసిన జనంతో బస్సులు నడుస్తున్నాయి. దీనివల్ల బస్సులకు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ. అసలే బస్సుల కొరత ఉన్న రాష్ట్రంలో కొత్త బస్సుల కొనుగోలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టాలి. అలాగే జీరో టికెట్ ద్వారా స్మార్ట్ కార్డులను ప్రతి మహిళకు అందించి మార్గ దర్శకాలు రూపొందించాలి. పెట్రోల్, డీజిల్ రేట్లు పెరగ డంతో ప్రభుత్వంపై అధిక భారం పడే అవకాశం ఉంది. గనుక ఈ పథకాన్ని ఎలక్ట్రిసిటీ బస్సులనూ నడపడం ద్వారా కొంతవరకు ప్రభుత్వంపై అధిక భారాన్ని తగ్గించవచ్చును. అలాగే ఉచిత బస్సుల ప్రయాణంతో ఆటో వాలాలు రోడ్డున పడ్డారు. వారి బతుకులు ఆగం కాకుండా కుటుంబాలను ఆదుకునేలా కొత్త పథకాన్ని ప్రవేశపెట్టాలి. అప్పుడే రాష్ట్రంలో మహిళల ఉచిత బస్సు ప్రయాణం విజయవంతమవుతుంది.

- రాచకొండ విగ్నేష్, 6302246641

టాలివుడ్ 'మత్తు' వదిలించాలి!

సంచలనం సృష్టిస్తున్న టాలివుడ్ డ్రగ్స్ కేసులో రోజురోజుకూ అనేక విషయాలు బయటకు వస్తున్నాయి. క్రూయిజ్‌డ్రగ్స్ కేసులో మరో ఏడుగురు నిందితులను అరెస్టు చేసినట్టు వార్తలు వచ్చాయి. ఇందులో అనేక సినీ నటులకు సంబంధం ఉందన్న నేపథ్యంలో ఈడీ రంగంలోకి దిగింది. అసలు డ్రగ్స్ మాఫియాతో సినీ ఇండస్ట్రీకి సంబంధం ఏంటి? సడెన్‌గా సీన్‌లోకి ఈడీ ఎంట్రీ ఎందుకైంది. ఈడీకి పూర్తి ఆధారాలు ఎక్సైజ్‌శాఖ ఇవ్వకపోవడంలో అంతర్మథనం ఏంటనే అనుమానం తలెత్తుతోంది. 2017 టాలివుడ్‌ను కుదిపేస్తున్న డ్రగ్స్‌కేసులో సినీ ప్రముఖులు ఉన్నారనేది పత్రికలు, టీవీ చానళ్లు, సోషల్ మిడియాల్లో కథనాలు వస్తూనే ఉన్నాయి. అయినా డ్రగ్స్ మాఫియాను అరికట్టడంలో నిందితులను శిక్షించడంలోనూ గత ప్రభుత్వాలు విఫలమయ్యాయి. అయితే కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం టాలివుడ్ డ్రగ్స్‌పై దృష్టి సారించాల్సిన అవసరమున్నది. ఇన్నిరోజులు డగ్స్ కేసును ఈడీ విచారణలతోనే సరిపెట్టారే తప్ప ముగింపు పలకలేదు. ఇందులో రాజకీయ పార్టీల నాయకులు, బడా వ్యాపారవేత్తలు, సినీ ఇండస్ట్రీ పెద్దల హస్తం ఉండడంతో ఎటూ తేల్చలేకపోయారు. ఈ క్రమంలో రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ..డ్రగ్స్ అనే మాట రాష్ట్రంలో ఉండొద్దని, ఆ మాట వింటేనే భయం పుట్టేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

గాబ్రియేల్ నుంచే పెద్ద ఎత్తున హైదరాబాద్‌లోకి డ్రగ్స్ ప్రవేశించినట్లుగా పోలీసులు తేల్చారు. ఇటీవల మాధాపూర్ ఫ్రెష్ లివింగ్ అపార్ట్‌మెంట్‌లో సినీ నిర్మాతలు డ్రగ్ పార్టీ చేసుకుంటూ పట్టుబడిన ఘటన మరువకముందే మరో వ్యవహారం కూడా వెలుగు చూసింది. ఈ ఏడాది జూన్ 19న పృథ్వీకృష్ణ రాహుల్ తెలోర్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 70 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. కూపీ లాగితే టాలీవుడ్‌లో డ్రగ్స్ కేసులో లింకులు కదులుతున్నాయి. మాదాపూర్‌లో పట్టుబడిన మత్తు పదార్థాల కేసులో టాలీవుడ్ యాక్టర్‌కు ఈడీ లేటెస్ట్‌గా నోటీస్ జారీ చేసిన విషయం విధితమే. ఇప్పుడు ఈడీ ఎంట్రీతో మాదాపూర్ డ్రగ్స్ కేసులో ఇంకెన్ని సంచనాలు తెరపైకి వస్తాయోననే చర్చ జరుగుతోంది. కాగా మాదక ద్రవ్యాల నిరోధక విభాగం వారి నుంచి డ్రగ్స్ మూలాలపై ఆరా తీశారు. ఇప్పటి వరకు పోలీసులు కొకైన్ ఎల్ఎస్‌డీ, ఇతర మత్తు పదార్థాలు ఎంత మేరకు స్వాధీనం చేసుకున్నారనేదానిపై స్పష్టత మాత్రం లేదు. విదేశాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణకు డ్రగ్స్ సరఫరా కాకుండా ఉండేందుకు కఠిన చర్యలు అమలు చేస్తున్నా డ్రగ్స్ రాష్ట్రానికి ఎలా వస్తున్నాయనేది అంతుచిక్కని ప్రశ్నగా మారుతోంది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఈ డ్రగ్స్ వ్యవహారం బయటపడి కట్టడి అవుతుందా..?లేదా..? ఈడీ విచారణలతోనే షరామామూలే అన్నచందంగా మారు తుందా? అనేది వేచి చూడాలి.

- వేముల క్రాంతికుమార్, 9676717377

బస్సులు కిక్కిరిస్తున్నయ్..

- అదనంగా సర్వీసు నడపండి
- సాలూరలో విద్యార్థుల రాస్తారోకో



నవతెలంగాణ-బోధన్

విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం, సాయంత్రం వేళల్లో అదనంగా సాలూర మండల కేంద్రం వరకు స్పెషల్ బస్సులను నడపాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా సాలూర మండల కేంద్రంలోని అంతర్రాష్ట్ర రహదారిపై విద్యార్థులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉదయం వేళ బోధన్ నుండి వచ్చే బస్సు సుంకిని గ్రామం వరకు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో బస్సు రద్దీగా ఉంటుందన్నారు. దాంతో తమకు కనీసం నిలబడి ప్రయాణించే అవకాశం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సాయంత్రం వేళ కూడా బస్సు రద్దీగా మారడంతో తీవ్ర అవస్థలు పడుతున్నామని వాపోయారు. కావున బోధన్ డిపో మేనేజర్ తక్షణమే స్పందించి విద్యార్థుల సౌకర్యార్థం స్పెషల్ బస్సు వేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల రాస్తారోకోతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న బోధన్ రూరల్ పోలీసులు.. ఘటనా స్థలానికి చేరుకొని విద్యార్థులను సముదాయించి రాస్తారోకో విరమింపజేశారు.

ఎన్‌పీడీసీఎల్ సీఎండీగా వరుణ్‌రెడ్డి

- కలెక్టర్, సీపీని కలిసిన సీఎండీ



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కర్నాటి వరుణ్‌రెడ్డి నియమితులయ్యారు. శుక్రవారం ఉదయం ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు కంపెనీ డైరెక్టర్లు బి.వెంకటేశ్వరరావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, వి. తిరుపతిరెడ్డి, చీఫ్ విజిలెన్స్ అధికారి బి. జనార్ధన్, సీజీఎంలు బి.అశోక్‌కుమార్, టి.సదర్‌లాల్, టి.మధుసూదన్, వి.మోహన్‌రావు, కె.కిషన్, రాజు చౌహాన్, కె.ఎస్.గుట్ట, ప్రభాకర్ అశోక్, బీకంసింగ్, రవీంద్రనాధ్, అధికారులు, ఉద్యోగ సంఘాల నేతలు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, సీఎండీ కె. వరుణ్‌రెడ్డి.. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ, హన్మకొండ జిల్లా కలెక్టర్ సీఎండీకి కు పూలమొక్కనిచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డిని సీపీ అభినందించారు.

ఫార్మాసిటీ రద్దుకు సీఎం నిర్ణయం

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఫార్మాసిటీ రద్దుకు సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకుంటారని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. శుక్రవారం అసెంబ్లీలోని మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. ఫార్మాసిటీ మాట వింటేనే రంగారెడ్డి ప్రజలంతా మా బ్రతుకులు ఏమైతాయో అని బాధపడ్డారని గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షులుగా ఉన్నప్పుడే అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేస్తామంటూ ప్రకటించారనీ, ఆ హామీని నెరవేరుస్తారని తెలిపారు.

ఆగని వీధి కుక్కల దాడులు

- ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలు

నవతెలంగాణ-ఎల్బీనగర్



రాష్ట్రంలో వీధి కుక్కల నియంత్రణ లేకపోవడంతో మనుషులపై తరచూ దాడులు చేస్తున్నాయి. తాజాగా హైదరాబాద్‌లో ఇద్దరు చిన్నారులపై దాడి చేసి గాయపరిచాయి. స్థానికులు వెంటనే అప్రమత్తం అవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కొద్ది నెలల కిందట హైదరాబాద్ అంబర్‌పేటలో ఓ బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి చంపిన విషయం విదితమే. శుక్రవారం హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లో ఐదేండ్ల బాలుడు గాయపడగా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నిజాంపేట్‌లో రెండున్నరేండ్ల బాలిక గాయపడింది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..


హైదరాబాద్ గడ్డి అన్నారం డివిజన్‌లోని పీ అండ్ టీ కాలనీ పరిధిలోని శాంతినగర్‌లో బిట్టు అనే ఐదేండ్ల బాలుడు ఇద్దరు చిన్నారులతో కలిసి గురువారం రాత్రి అపార్టుమెంట్ ముందున్న రోడ్డుపై ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో వీధికుక్కలు ఒక్కసారిగా వారి వెంటపడ్డాయి. ముగ్గురు చిన్నారులు అపార్ట్‌మెంట్ లోపలికి పరిగెడుతుండగా బిట్టూ కింద పడిపోయాడు. దాంతో ఓ వీధి కుక్క అతడిపై దాడి చేసి గాయపరిచింది. అక్కడే ఉన్న ఓ వ్యక్తి కుక్కలను తరిమేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కుటుంబసభ్యులు బాలుడిని ఆస్పత్రిలో చేర్పించారు. కుక్కలు దాడి చేస్తున్న దృశ్యాలు సీసీటీవీలో నమోదయ్యాయి.

నోటితో ఈడ్చుకుంటూ..

ఆడుకుంటున్న రెండున్నరేండ్ల చిన్నారిని కుక్క తన నోటితో ఈడ్చుకుంటూ వెళ్లిన ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి పీఎస్ పరిధిలో జరిగింది. నిజాంపేట్ బండారి లేఔట్‌లో నివసిస్తున్న కుటుంబానికి చెందిన చిన్నారి సోమశ్రీ శుక్రవారం ఓ పార్కు ఆవరణలో ఆడుకుంటోంది. అయితే అటువైపుగా వచ్చిన వీధి కుక్క బాలిక మెడపై గాయం చేసి.. నోటితో ఈడ్చుకెళ్తుండగా.. స్థానికులు గమనించి చిన్నారిని రక్షించి కూకట్‌పల్లిలోని హెూలిస్టిక్ ఆస్పత్రికి తరలించారు.

హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా..
ఆమ్రపాలి బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి



హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ)లో జాయింట్ మెట్రోపాలిటన్ జాయింట్ కమిషనర్‌గా ఆమ్రపాలి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హెచ్ఎండీఏ ఉద్యోగుల సహకారంతో మరిన్ని కొత్త ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలు చేసే అవకాశం ప్రభుత్వం తనకు కల్పించిందన్నారు. అనంతరం మూసీ రివర్ ఫ్రెంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ)గా ఆమ్రపాలి బాధ్యతలు చేపట్టి కార్పొరేషన్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హెచ్ఎండీఏ కార్యదర్శి చంద్రయ్య, చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎస్ రెడ్డి, అర్బన్ ఫారెస్ట్ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రభాకర్, ఎస్టేట్ ఆఫీసర్ కిషన్ రావు, ప్లానింగ్ డైరెక్టర్లు విద్యాధర్, శ్రీనివాస్, లీగల్ స్పెషలిస్ట్ యశస్వి సింగ్‌తో పాటు హెచ్ఎండీఏ అధికారులు, సిబ్బంది జాయింట్ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి అభినందించారు.

గెలిచినా నిరాశే..!

పార్టీ అధికారంలో లేకపోవడంతో అయోమయం

- అంతర్మథనంలో ఐదుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- పార్టీ మారతారంటూ జోరుగా ప్రచారం
- మాజీ మంత్రి మల్లారెడ్డి వ్యాఖ్యలు ఆసక్తికరం







నవతెలంగాణ-సిటీబ్యూరో

మొదటిసారి అధికార పార్టీ నుంచి గెలుస్తున్నామనే ధీమా కొత్త వారిలో ఉంటే.. అధికారంలోకి వస్తే మంత్రి కావొచ్చు అనే భావనతో బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఎన్నికల బరిలోకి దిగారు. తీరా తాము గెలిచినా.. తమ పార్టీ అధికారంలోకి రాకపోవడంతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో గెలుపొందిన ముగ్గురు సీనియర్లతోపాటు ఇద్దరు కొత్త ఎమ్మెల్యేలకూ నిరాశే మిగిలింది. అనూహ్యంగా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఐదుగురు ఎమ్మెల్యేలూ కంగు తిన్నారు. ఎటూ పాలుపోక అంతర్మథనంలో పడ్డారు.

రాష్ట్రమంతా కాంగ్రెస్ గాలి వీచినా.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మాత్రం కారు జోరే సాగింది. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. మల్కాజిగిరి, ఉప్పల్ నియోజకవర్గాల నుంచి కొత్త వారు తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టగా.. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మేడ్చల్ నియోజవర్గాల నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేలే గెలుపొందినా.. వారి పార్టీ అధికారంలోకి రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ఒక్క మల్కాజిగిరి ఎమ్మెల్యే తప్పా.. మిగిలిన నలుగురూ సైలెంట్ మూడ్‌లోకి వెళ్లారు. అప్పుడప్పుడు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తుంటే.. మిగిలిన వారు నోరు విప్పడం లేదు. ఇక అధికారంలో ఉంటే మంత్రి పదవి దక్కించుకుని జిల్లాపై మరింత పట్టు సాధించాలనుకున్న సీనియర్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, చామకూర మల్లారెడ్డికి దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. అటు అధికారం లేక, ఇటు మంత్రి పదవి దక్కక సమాలోచనలు చేస్తున్నట్టు సమాచారం. తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలుపొందిన ఇద్దరిది సైతం అదే పరిస్థితి ఉన్నట్టు సమాచారం. హైదరాబాద్‌లోని ఒకరిద్దరు ఎమ్మెల్యేలు మౌనంగా ఉన్నారు.

పార్టీ మారుతారంటూ ప్రచారం

ఐదుగురు ఎమ్మెల్యేల్లో ఒకరిద్దరు లేదా పరిస్థితులు అనుకూలిస్తే అందరూ పార్టీ మారుతారంటూ జిల్లాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. అధికార పార్టీలోకి వెళ్తే నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులను రాబట్టడంతోపాటు సర్కార్ సపోర్ట్‌తో మరింత ఉత్సాహంగా పని చేయొచ్చు అని కొందరు ఎమ్మెల్యేలు భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ విషయంపై క్యాడర్ కూడా 'అన్నా.. పార్టీ మారుతున్నారా..?' అని అడుగుతుండటంతో ఏం చెప్పాలో తెలియక ఎమ్మెల్యేలు తలలు పట్టుకుంటున్నారు. పార్టీ మారే ఆలోచన ఉందని చెబితే జనం, క్యాడర్‌లోకి నెగిటివ్ ఫీడ్ బ్యాక్ వెళ్తుందని కొందరు ఆలోచిస్తున్నట్టు చర్చ జరుగుతోంది. లోక్‌సభ ఎన్నికల ముందు పార్టీ మారుతారంటూ కొందరు అంటుంటే, లేదు.. లేదు.. ఎన్నికల తర్వాత పరిస్థితులను చూసి అధికార పార్టీలోకి వెళ్తారని మరికొందరు చర్చించుకుంటున్నారు. ఎమ్మెల్యేలు పార్టీ మారేది లేనిది.. లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ఆధారపడి ఉంటుందని మరికొందరు మాట్లాడుకుంటున్నారు. ఎమ్మెల్యేలు మాత్రం తాము పార్టీ మారడం లేదని, ప్రతిపక్షంలోనే ఉంటూ ప్రజాసమస్యలపై పోరాడుతామని చెప్పుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

మల్లారెడ్డి వ్యాఖ్యలు

'పాలమ్మినా.. పూలమ్మినా.. కాలేజీలు పెట్టినా.. వేల మంది ఇంజినీర్లు, డాక్టర్లను తయారు చేస్తున్నా.. కష్టపడి పైకొచ్చినా.. నా విజయ రహస్యం కష్టం' అంటూ తనదైన స్టైల్‌లో నిత్యం ట్రెండింగ్‌లో ఉండే మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అప్పుడప్పుడూ చేసే వ్యాఖ్యలు ఆసక్తికరంగా ఉంటున్నాయి. కొద్ది రోజుల కిందట 'మీరు మళ్లీ మంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారు' అని మీడియా ప్రతినిధులు అడగ్గా.. ఆ దేవుడి దయ ఉంటే త్వరలో మళ్లీ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయొచ్చు అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పూర్తిగా సహకరిస్తాం అంటూ కూడా చెప్పుకొచ్చారు. ఇక నిన్నటికి నిన్న ఓ కాంగ్రెస్ నేతతో మాట్లాడుతూ.. 'సీఎం రేవంత్‌రెడ్డి తాను మంచి స్నేహితులం' అన్నారు. కాంగ్రెస్‌కు సభ్యులు తక్కువైతే మద్దతిస్తావా అంటూ ఆ కాంగ్రెస్ నేత అడగ్గా.. అవసరమైన సమయంలో ఖచ్చితంగా మద్దతిస్తానని మల్లారెడ్డి సానుకూలంగా స్పందించారు. ఎన్నికల తర్వాత అందరం ఒక్కటే అంటూ సంబోధించారు. ఈ వ్యాఖ్యలతో మల్లారెడ్డి పార్టీ మారడం ఖాయమనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

మల్లారెడ్డి భూములపై సమగ్ర విచారణ జరిపించాలి

ఆయన్ను అరెస్టు చేసి, బాధితులకు న్యాయం చేయాలి : సీపీఐ(ఎం) డిమాండ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

మాజీ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి భూములపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మూడుచింతలపల్లి మండలం కేశవరం గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న అసైన్డ్ భూమి సర్వే నెంబర్ 33, 34, 35లో గల 47 ఎకరాల 18 గుంటల ఎస్టీలకు చెందిన భూమిని మల్లారెడ్డి బెదిరించి తీసుకున్నట్టుగా పత్రికల్లో వార్తలు వస్తున్నాయి. దాంతో సీపీఐ(ఎం) నాయకులు శుక్రవారం ఆ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి పి.సత్యం మాట్లాడుతూ.. గతంలో మంత్రిగా ఉన్న సమయంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని మల్లారెడ్డి కుత్బుల్లాపూర్, మేడ్చల్, శామీర్‌పేట, మూడుచింతపల్లి, ఘట్‌కేసర్ మండలాల్లో చాలా చోట్ల ప్రభుత్వ భూములు, చెరువు శిఖం భూములను కబ్జా చేసినట్టు తెలిపారు. అసైన్డ్ భూములను కొనకూడదు.. అమ్మకూడదు అని చట్టం ఉన్నా కొన్నారని చెప్పారు. ప్రజలను ముంచి ప్రభుత్వ యంత్రాంగాన్ని మోసం చేసి రూ.కోట్లు సంపాదించినట్టు అర్థమవుతుందని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన మల్లారెడ్డిని వెంటనే అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్, పోలీస్ యంత్రాంగం ఇప్పటికైనా కదిలి ఆ భూములపై సమగ్ర విచారణ జరిపి మల్లారెడ్డి ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు. లేనిపక్షంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. భూములను సందర్శించిన వారిలో సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు ఆర్.శ్రీరామ్ నాయక్, ఎం.శోభన్ నాయక్, మేడ్చల్ జిల్లా నాయకులు జె.చంద్రశేఖర్, ఎ.అశోక్, ఎం.శ్రీనివాస్ ఉన్నారు.

దక్షిణ డిస్కం సీఎండీగా ముషారఫ్ ఫరూఖీ బాధ్యతలు

నవతెలంగాణ-సిటీబ్యూరో



దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ముషారఫ్ ఫరూఖీ శుక్రవారం జి.రఘుమారెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఐఐటీ మద్రాస్ నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో పట్టభద్రుడైన ముషారఫ్ ఫరూఖీ 2014లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. గతంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అడిషనల్ కమిషనర్‌గా, నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా, ఎక్సైజ్ డిపార్టుమెంట్‌లో డైరెక్టర్‌గా పని చేశారు. సీఎండీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన సంస్థ డైరెక్టర్లతో విభాగాల వారీగా సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ శాఖకు విశేష ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పని చేస్తూ, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు టి.శ్రీనివాస్, జె.శ్రీనివాస్‌రెడ్డి, కె.రాములు, సిహెచ్.మదన్ మోహన్‌రావు, జి.పర్వతం, ఎస్.స్వామి రెడ్డి, జి.గోపాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు ఆపేయాలి

ధర్నాకు దిగిన రైతులు



నవతెలంగాణ-దిలావర్‌పూర్

ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు ఆపే వరకు తమ పోరాటం ఆగదని దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల ప్రజలు, రైతులు తీర్మానించారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల సరిహద్దు పంట పొలాల్లో ఓ ప్రయివేటు సంస్థ ఏర్పాటు చేయబోయే ఇథనాల్ ఫ్యాక్టరీతో ముప్పు పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. చుట్టుపక్కల భూముల రైతుల అభిప్రాయ సేకరణ చేయకుండా ఫ్యాక్టరీ పనులను మొదలుపెట్టారని శుక్రవారం పోచమ్మ ఆలయం వద్ద రైతులు సమావేశం నిర్వహించి కార్యాచరణ రూపొందించారు. అనంతరం రైతులు, నాయకులు, గ్రామ ప్రజలు బస్టాండ్ సమీపంలో రాస్తారోకో చేశారు. ఫ్యాక్టరీ పనులు ఆపేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ స్థాపనతో చుట్టుపక్కల దిలావర్‌పూర్, గుండంపల్లి తదితర గ్రామాల పంటలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీని స్థాపిస్తే అనేక ఇబ్బందులకు గురవుతామన్నారు. ఫ్యాక్టరీ నుంచి వెలువడే పొగ నుంచి వాయు కాలుష్యం ఏర్పడి ప్రజలు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థపు నీరు గోదావరి నదిలో కలవడంతో నీరు కలుషితమై జీవరాశి మనుగడకు ముప్పు వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆరు నెలల కింద ధర్నా, ఆందోళన చేయడంతో నిలిపివేసిన ఫ్యాక్టరీ పనులు, అసెంబ్లీ ఎన్నికల అనంతరం మళ్లీ ప్రారంభించారని రైతులు తెలిపారు. ఫ్యాక్టరీ పనులు జరుగుతున్నాయనే సమాచారం మేరకు ఆయా గ్రామాల ప్రజలు ఆ ప్రాంతాన్ని సందర్శించి ఉద్యమానికి సిద్ధమయ్యారు. దిలావర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన నాయకులు, రైతులు, యువకులు 66వ జాతీయ రహదారి దిలావర్‌పూర్ బస్టాండ్ వద్ద రాస్తారోకో చేశారు. జిల్లా కలెక్టర్ వచ్చి హామీ ఇచ్చే వరకు కదిలే ప్రసక్తే లేదని రోడ్డుపై కూర్చున్నారు. పోలీసు సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకున్న దిలావర్‌పూర్ ఎస్ఐ యాసిర్ అరాఫత్, నర్సాపూర్(జి) ఎస్ఐ రవీందర్ రైతులకు నచ్చజెప్పడంతో రాస్తారోకో విరమించారు. ఇకనైనా ప్రభుత్వం కల్పించుకొని ఫ్యాక్టరీ పనులు పూర్తిగా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేదంటే వివిధ రూపాల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రైతులు, నాయకులు హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎంపీపీ పాల్దె అక్షర అనిల్, సర్పంచ్ విరేష్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో క్షుద్రపూజలు

- పోలీసులకు సమాచారం ఇచ్చిన గ్రామస్తులు
- వారిని తరలిస్తుండగా.. ఇక్కడే విచారించాలని అడ్డుకున్న స్థానికులు
- పోలీసులపై దాడి చేయడంతో లాఠీచార్జి



నవతెలంగాణ-మాక్లూర్

మహిళకు ఆరోగ్యం బాగు చేసేందుకు శ్మశానంలో క్షుద్రపూజలు చేస్తున్నారని గ్రామస్తులు పలువురుని అర్ధరాత్రి వేళ పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి దుండగులను పట్టుకొని స్టేషన్‌కు తరలిస్తుండగా.. ఉదయం వరకు వారిని ఇక్కడే ఉంచి విచారణ చేపట్టాలని అడ్డుకోవడంతో ఉద్రిక్తత మొదలైంది. ఈ క్రమంలో పలువురు పోలీసులకు గాయాలు కావడంతో లాఠీచార్జి చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం మానిక్‌బండార్ తండాలో గురువారం అర్ధరాత్రి జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మాణిక్ బండార్ తండా శివారులోని శ్మశానవాటికలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేయడాన్ని గమనించిన కొంత మంది.. గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చే వరకు గ్రామస్తులు క్షుద్ర పూజలు చేసే వారిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. 12 మంది దుండగులు ఉన్నారు. నిజామాబాద్‌కు చెందిన 8 మంది, ఆర్మూర్‌కు చెందిన ముగ్గురు, అమ్రాద్‌కు చెందిన ఒక్కరు ఉన్నారు. అయితే పోలీసులు దుండగులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించే సమయంలో గ్రామస్తులు అడ్డుకున్నారు. వారిని పొద్దున వచ్చి తీసుకెళ్లాలని, ఇక్కడే విచారణ చేయాలని పట్టుబట్టారు. అందుకు పోలీసులు ఒప్పుకోకపోవడంతో గ్రామస్తులకు, పోలీసులకు గొడవ చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఏఎస్ఐ గంగాధర్, హెూమ్ గార్డ్ పరుశురామ్‌కు గాయాలయ్యాయి. అక్కడే ఉన్న సీఐ సతీష్, ఎస్ఐ సుదీర్ రావు సిబ్బందితో లాఠీచార్జి చేసి ఆందోళన చేస్తున్న వారిని చెదరగొట్టారు. పోలీసులతో పాటు గ్రామస్తులకు సైతం గాయాలు అయ్యాయి. అనంతరం పోలీసులు నిందితులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మాణిక్‌బండార్ తండాలో నెల రోజుల్లో 8 మంది అనుమానస్పద స్థితిలో మృతిచెందారని, శ్మశానంలో పసుపు, కుంకుమ చల్లిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. ఇలాంటి సమయంలో ఇలాంటి ఘటన జరిగిందని గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇంత జరిగినా మూఢనమ్మకాలపై అధికారులు వెళ్లి తండావాసులకు అవగాహన కల్పించకపోవడం గమనార్హం.

సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఏడేండ్ల బాలుడు

- క్యాన్సర్‌తో పోరాడుతున్న చిన్నారి
- అతని కోరిక తీర్చిన మేక్ ఏ విష్ ఫౌండేషన్, బంజారాహిల్స్ పోలీసులు



నవతెలంగాణ-బంజారాహిల్స్

క్యాన్సర్‌తో బాధపడుతున్న ఏడేండ్ల బాలుడి పోలీసు కావాలనే కోరికను మేకే ఏ విష్ ఫౌండేషన్, బంజారాహిల్స్ పోలీసులు తీర్చారు. వివరాల్లోకెళ్తే.. ఏపీలోని గుంటూరుకు చెందిన అనుపోజు బ్రహ్మం-లక్ష్మి దంపతుల రెండో కుమారుడు మోహన్ సాయి 4వ తరగతి పూర్తి చేశాడు. గతేడాది సెలవుల్లో అతను అనారోగ్యానికి గురవ్వడంతో వైద్య పరీక్షలు చేయించగా అతనికి క్యాన్సర్ అని వైద్యులు నిర్ధారించారు. సంవత్సర కాలంగా హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో బాలుడు చికిత్స పొందుతున్నాడు. అయితే బాలుడికి పోలీసు అధికారి కావాలన్న కోరిక ఉందని తల్లిదండ్రుల ద్వారా తెలుసుకున్న ఆస్పత్రి సిబ్బంది.. మేక్ ఏ విష ఫౌండేషన్ సభ్యులకు చెప్పారు. వారు బాలున్ని శుక్రవారం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి అక్కడి అధికారులకు విషయాన్ని చెప్పారు. దాంతో అక్కడి సిబ్బంది పోలీస్ డ్రెస్‌లో ఉన్న మోహన్‌సాయిని సాదరంగా ఆహ్వానించి సబ్ ఇన్‌స్పెక్టర్ కుర్చీలో కూర్చోబెట్టారు. బంజారాహిల్స్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జాకీర్ హుస్సేన్ చిన్నారికి పోలీసు గౌరవ వందనం చేసి, చిన్నారి నుంచి కూడా గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అడ్మిన్ సబ్ ఇన్‌స్పెక్టర్ శివ శంకర్ చిన్నారికి పోలీస్ స్టేషన్‌లో జరిగే పని విధానం గురించి వివరించారు. అలాగే సబ్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, ఇతర సిబ్బంది బహుమతులను అందజేశారు. బంజారాహిల్స్ పోలీసులు అతని కోరిక నెరవేర్చడంతో బాలుడు ఆనందం వ్యక్తం చేశాడు. తన కోరికలు నెరవేర్చుకోవడానికి అహర్నిశలూ కృషి చేస్తానని తెలిపాడు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఉపాధ్యాయుడు మృతి

- మరో ఉపాధ్యాయుడికి తీవ్ర గాయాలు
- పాఠశాలకు వెళ్తుండగా ప్రమాదం..


(ఫైల్)

నవతెలంగాణ-జోగిపేట

ఇద్దరు ఉపాధ్యాయులు బైక్‌పై పాఠశాలకు వెళ్తుండగా.. ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఉపాధ్యాయుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం తాలెల్మ గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగింది. ప్రత్యక్ష సాక్ష్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జోగిపేట పట్టణానికి చెందిన పిట్ల రాజ్‌కుమార్(38), సంగారెడ్డి పట్టణానికి చెందిన సందీప్ కుమార్.. తాలెల్మాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే శుక్రవారం ఉదయం ఇద్దరు కలిసి ఒకే బైక్‌పై పాఠశాలకు బయలుదేరారు. ఈ క్రమంలో తలెల్మా సమీపంలోని ప్రధాన రహదారి మూలమలుపు వద్ద వట్‌పల్లి నుంచి జోగిపేట వైపు వస్తున్న సంగారెడ్డి డిపో ఆర్టీసీ బస్సు.. వారి బైక్‌ను బలంగా ఢీ కొట్టింది. దాంతో బైక్ నడుపుతున్న రాజ్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనకాల కూర్చున్న సందీప్ కుమార్‌కు కాలు విరిగింది. ఆయన్ను జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేసి.. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఫోన్ మాట్లాడుతూ.. అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నడపడంతోనే ఈ ప్రమాదం జరిగిందని బస్సులో ఉన్న ప్రయాణికులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు జోగిపేట ఎస్ఐ అరుణ్‌కుమార్ తెలిపారు. రాజ్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఆయా టీచర్స్ యూనియన్ నాయకులు, సహా ఉపాధ్యాయులు జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకొని ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

మంత్రి పొన్నంకు అభినందనలు

- తెలంగాణ రాష్ట్ర కల్లుగీత పరిశ్రమల ఉద్యోగులు..



హైదరాబాద్ : మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడుకు తెలంగాణ రాష్ట్ర కల్లుగీత పరిశ్రమల ఉద్యోగులు అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కల్లు గీత పరిశ్రమల ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కామారెడ్డి హన్మాండ్లు గౌడ్ నేతృత్వంలో యూనియన్ కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ... గౌడ కులస్థుల సంక్షేమం కోసం అన్ని విధాలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షులు లింగాల గోవర్ధన్ గౌడ్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వులి లక్ష్మివతి గౌడ్, సయుక్త కార్యదర్శి ప్రదీప్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.శివన్న గౌడ్, కార్యాలయ కార్యదర్శి టి. భిక్షవతి గౌడ్, ఉపాధ్యక్షులు ఎస్. భూమా గౌడ్, డి.పాండు గౌడ్, కోశాధికారి జీ. నర్సింహ్మా గౌడ్, డైరెక్టర్ ఎస్. కృష్ణ గౌడ్, బాలకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాబోయే కాలంలో నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తాం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాబోయే కాలంలో నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తామనీ, తమ పార్టీ ఆ బాధ్యతను నిర్వర్తిస్తుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రివర్గానికి శుభాకాంక్షలు చెప్పారు. ఈనెల 12,13,14 తేదీల్లో మూడురోజులపాటు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గం, రాష్ట్ర కమిటీ సమావేశాలను హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అధ్యక్షతన నిర్వహించారు.

కేంద్ర పరిశీలకులుగా ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, ఎ విజయరాఘవన్ హాజరయ్యారు. శుక్రవారం తనను కలిసిన విలేకర్లతో తమ్మినేని మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలు, పార్టీ అనుసరించిన ఎత్తుగడలు, ఫలితాలపై సమీక్షించామని చెప్పారు. తమ ఎత్తుగడలు సంతృప్తికరంగానే ఉన్నాయని అన్నారు. పోటీచేసిన 19 స్థానాల్లో గెలుస్తామని భావించకపోయినా ఓట్లు తక్కువ రావడం ప్రధాన లోపంగా పార్టీ గుర్తించిందని వివరించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటు నిర్ణయం కాలయాపన కావడం, చివరి నిమిషంలో పొత్తు సాధ్యం కాదని తేలాక ఒంటరిగా పోటీ చేయాల్సి వచ్చిందని చెప్పారు. సన్నద్ధం కావడానికి సమయం సరిపోని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్నాయని వివరించారు. బీఆర్ఎస్ మీద కోపం ఉన్న వారు కాంగ్రెస్‌కు, కాంగ్రెస్ మీద వ్యతిరేకత ఉన్న వారు బీఆర్ఎస్‌కు ఓటేశారని చెప్పారు. సీపీఐ(ఎం) పట్ల అభిమానం ఉన్న వారు కూడా తమకు ఓటేయలేదని అన్నారు. సీపీఐ(ఎం) కుటుంబాలే ఓటేశాయి తప్ప సంప్రదాయంగా వేసే అభిమానులు ఈసారి ఓటేయలేదని వివరించారు. పార్టీ కమిటీలు, శాఖల్లోనూ గణనీయంగా లోపాలు జరిగాయని అన్నారు. ఈ లోపాలను సమీక్షించుకుని భవిష్యత్తులో పార్టీని పటిష్టం చేయడానికి అవసరమైన నిర్ణయాలు చేశామని చెప్పారు.

బీఆర్ఎస్‌ను ఓడించాలనుకున్న ప్రజలు

రాష్ట్రాన్ని అభివృద్ధి చేశామనీ, వివిధ రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దామని చెప్తూ బీఆర్ఎస్ ప్రజల్లోకి వెళ్లిందని తమ్మినేని అన్నారు. అయితే అభివృద్ధి కంటే ఈ పదేండ్ల కాలంలో వారి అహంభావం, అప్రజాస్వామిక ధోరణులను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారని చెప్పారు. ఎట్టిపరిస్థితుల్లోనూ బీఆర్ఎస్‌ను ఓడించాలని భావించారని అన్నారు. బీఆర్ఎస్‌పై వ్యతిరేకత కాంగ్రెస్‌కు దోహదపడిందన్నారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర, రేవంత్‌రెడ్డి నాయకత్వం, కర్నాటకలో విజయం, అధిష్టానం చొరవ, కాంగ్రెస్‌లో గ్రూపులన్నీ ఏకం కావడం వంటి పరిణామాలన్నీ కాంగ్రెస్ గెలుపునకు తోడ్పడ్డాయని వివరించారు.

2 గ్యారంటీలను అమలు చేయడం శుభపరిణామం

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి వారంలోనే రెండు గ్యారంటీలను అమలు చేయడం శుభపరిణామమని తమ్మినేని చెప్పారు. వివిధ శాఖలపై సమీక్షలు, లోపాలను గుర్తించడం, వాటిపై చర్యలు తీసుకుంటామని ప్రకటించడం సానుకూల సంకేతమని అన్నారు. రాష్ట్ర ప్రజానీకానికి చేసిన వాగ్దానాలను అమలు జరపాలని కోరారు. ప్రజాస్వామికంగా పాలన అందించాలని సూచించారు. అలా జరుగుతుందని ఆశిస్తున్నామని చెప్పారు.

కేసీఆర్ గాయపడడం బాధాకరం

ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గాయం కావడం, తుంటి ఎముక విరగడం, ఆస్పత్రిలో చేరడం, ఆపరేషన్ జరగడం బాధాకరమని తమ్మినేని అన్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

రైతాంగాన్ని ఆదుకోవాలి

ఇటీవల సంభవించిన అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారని తమ్మినేని ఆందోళన వ్యక్తం చేశారు. రైతాంగాన్ని ఆదుకునే చర్యలు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలని కోరారు. వాయిదా పడిన పోటీ పరీక్షలను నిర్వహించాలని సూచించారు.

నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనపై ప్రభుత్వం దృష్టిసారించాలని కోరారు. వ్యవసాయ కార్మికులు, గిరిజనులు, గ్రామీణ పేదల విషయంలో కాంగ్రెస్ వాగ్దానాలను అమలు చేయాలని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న పోడు భూముల పట్టాలను పంపిణీ చేయాలని అన్నారు.

ప్రజలకు కృతజ్ఞతలు

ఈ ఎన్నికల్లో పార్టీ కోసం రాష్ట్రవ్యాప్తంగా పనిచేసిన కార్యకర్తలు, నాయకులకు తమ్మినేని ధన్యవాదాలు చెప్పారు. డబ్బు, మద్యం విచ్చలవిడిగా పంపిణీ చేస్తున్న ఈ తరుణంలోనూ పార్టీని ఆదరించి ఓటేసిన ప్రజలకు కృతజ్ఞతలు ప్రకటించారు.

బీజేపీ గెలుపుపై లౌకికశక్తులు అప్రమత్తంగా ఉండాలి

మునుగోడు ఎన్నికల ముందు ప్రదర్శించిన జోరు ఆ ఫలితాల తర్వాత బీజేపీలో కనిపించలేదని తమ్మినేని అన్నారు. గత ఎన్నికలతో పోల్చితే బీజేపీకి ఓట్లు, సీట్లు రెట్టింపయ్యాయనీ, ఇది ఓ ప్రమాదకర సంకేతమని చెప్పారు. రాష్ట్రంలో మతోన్మాద శక్తులు బలపడడానికి ఇది సంకేతంగా ఉందన్నారు. లౌకికశక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాబోయే కాలంలో తమ పార్టీ ఆ దిశగా చొరవ చూపుతుందని అన్నారు.

పెరుగుతున్న చలి

- సంగారెడ్డిలో 8.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత
- కొమ్రంభీమ్, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోనూ 10 డిగ్రీల లోపే

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో చలితీవ్రత రోజురోజుకీ పెరుగుతున్నది. ఉదయం పూట దట్టమైన మంచు ఆవరిస్తున్నది. పొగమంచు కమ్ముకుంటున్నది. తెలంగాణ మీదుగా తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి కిందిస్థాయిలో గాలులు వీస్తున్నవి. దీనివల్ల చలి ఎక్కువవుతున్నది. సంగారెడ్డి జిల్లాలో అత్యల్పంగా 8.9 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. ఈ ఏడాది ఇప్పటిదాకా ఇదే అత్యల్పం. రంగారెడ్డి జిల్లాలో 9.4, కొమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 9.7, వికారాబాద్ జిల్లాలో 9.9 డిగ్రీల చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల లోపునకు పడిపోవడంతో ఆ నాలుగు జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికను జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆస్తమా ఉన్నవాళ్లు, వృద్ధులు, చిన్నారులు ఆరోగ్యరీత్యా జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. సూర్యాపేట మినహా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల లోపే రికార్డయ్యాయి.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

- సీఎం రేవంత్‌రెడ్డికి పీఎంటీఏటీఎస్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ప్రొగ్రెసివ్ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (పీఎంటీఏటీఎస్) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తరాల జగదీశ్ కలిసి వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూళ్ల స్థానంలో మోడల్ స్కూళ్లను అభివృద్ధి చేయాలని కోరారు. అదనపు మండలాల్లో నూతనంగా ఏర్పాటు చేయాలని సూచించారు. పదేండ్లుగా మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీల్లేవని తెలిపారు. వేతనాల కోసం ప్రతినెలా ఎదురుచూడాల్సి వస్తున్నదనీ, 010 పద్దు కింద జీతాలివ్వాలని పేర్కొన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్, హెల్త్ కార్డులు వర్తింపచేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు.

తొమ్మిది మంది ఐఏఎస్‌లకు పోస్టింగ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో తొమ్మిది మంది ఐఏఎస్ లకు రాష్ట్ర ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సిరిసిల్ల అడిషనల్ కలెక్టర్‌గా గౌతమి, హనుమకొండ అడిషనల్ కలెక్టర్‌గా రాధికా గుప్తా, ములుగు అడిషనల్ కలెక్టర్‌గా పి.శ్రీజ, నిర్మల్ అడిషనల్ కలెక్టర్‌గా ఫైజాన్ అహ్మద్, జనగామ అడిషనల్ కలెక్టర్‌గా పర్మర్ పింకేశ్ కుమార్ లలిత్‌కుమార్, మహబూబాబాద్ అడిషనల్ కలెక్టర్‌గా లెనిన్ వత్సల్ తొప్పో, మహబూబ్‌నగర్ అడిషనల్ కలెక్టర్‌గా శివేంద్ర ప్రతాప్, వనపర్తి అడిషనల్ కలెక్టర్‌గా సంచిత్ గంగ్వార్, జయశంకర్ భూపాలపల్లి అడిషనల్ కలెక్టర్‌గా కదిరవన్ నియమితులయ్యారు.

మాకు ఛాంబర్స్ కేటాయించండి

- స్పీకర్ జి.ప్రసాద్ కుమార్‌కు బీజేపీ ఎమ్మెల్యేల వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ లాబీలో, బయట కూడా తమకు ఛాంబర్ కేటాయించాలని బీజేపీ ఎమ్మెల్యేలు స్పీకర్‌ను కోరారు. ఈమేరకు శుక్రవారం అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వారి వినతి మేరకు పలు గదులను వారిని పరిశీలించాల్సిందిగా సూచనలు చేసినట్టు తెలిసింది. గతంలో బీజేపీ ఎమ్మెల్యేలకు ప్రత్యేకంగా గది కేటాయించలేదు. అసెంబ్లీ నియమ, నిబంధనల ప్రకారం ఒక పార్టీ నుంచి కనీసం ఐదుగురు సభ్యులుంటేనే గది కేటాయిస్తారనే నిబంధన ఉండటంతో గతంలో వారికి గది కేటాయించలేదు. ఇప్పుడు బీజేపీ నుంచి 8 మంది ఎమ్మెల్యేలున్న నేపథ్యంలో వారికి లాబీతో పాటు బయట కూడా బీజేపీ ఎల్పీ ఛాంబర్ కేటాయించనున్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ

- స్పష్టం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి
- నెలాఖరులో తెలంగాణకు నడ్డా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జనసేనతో పొత్తుకు బీజేపీ రాంరాం చెప్పేసింది. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేయనున్నది. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఎవరితోనూ పొత్తు ఉండదనీ, ఒంటరిగానే ముందుకెళ్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి స్పష్టంచేశారు. దీనికి పార్టీ క్యాడరంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. శుక్రవారం బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ ముఖ్యనేతలతో కిషన్‌రెడ్డి సమావేశమయ్యారు. అందులో జిల్లాల ఇన్‌చార్జులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో గతం కంటే మెరుగైన ఫలితాలు సాధించామనీ, ఇదే జోష్ కొనసాగిస్తూ లోక్ సభ ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. బీజేపీ-బీఆర్ఎస్ మధ్య పొత్తు కుదరబోతున్నదన్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఇది పూర్తిగా అవాస్తవం కొట్టిపడేశారు. డిసెంబర్ చివరి వారంలో పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా తెలంగాణకు రానున్నట్టు తెలిపారు.

పార్టీ నేతలను కించపరిస్తే వేటే

- పార్టీ ప్రచారం కోసమే సోషల్ మీడియాను వినియోగించాలి :కిషన్ రెడ్డి, చుగ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సోషల్‌మీడియాలో పార్టీ నేతలను కించపరిచేలా పోస్టులు చేస్తే వేటు వేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ హెచ్చరించారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు, ఇన్‌చార్జులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారికి వార్నింగ్ ఇచ్చినట్టు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన తప్పులను పార్లమెంట్ ఎన్నికల్లో చేయకూడదని హెచ్చరించినట్టు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి ఎవరు బాధ్యత వహిస్తారు? అంటూ కొందరు నేతలు సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలోనే సొంత పార్టీ నేతలను కించపరిస్తే ఎవరైనా సరే వేటు తప్పదని హెచ్చరించినట్టు తెలిసింది. నేతలను సోషల్ మీడియాల్లో పొగిడేది ఎవరు? కించపరిచేది ఎవరనేది ఎప్పటికప్పుడు హైకమాండ్ గమనిస్తోందని నేతల దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. ఈ విషయంపై అధిష్టానం సీరియస్‌గా ఉందని వారికి వివరించినట్టు సమాచారం. పార్టీ ప్రచారం కోసమే సోషల్ మీడియాను వినియోగించాలని దిశానిర్దేశం చేసినట్టు వినికిడి.

బీజేపీలో కుంపట్లు

- బండి సంజయ్‌కి వ్యతిరేకంగా సీనియర్ల తిరుగుబావుటా
- నేడు సంజయ్ ఆధ్వర్యంలో పార్లమెంట్‌స్థాయి నాయకుల సమావేశం



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

బీజేపీలో కుంపట్లు కొనసాగుతున్నాయి.. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలువురు సీనియర్లు బండి సంజయ్‌పై తిరుగుబావుటా ఎగరవేశారు. సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఒంటెద్దు పోకడతో పార్టీని 'బండి' బలహీనపరిచారంటూ రెండ్రోజుల కిందట సమావేశమై సంజయ్ పట్ల వ్యతిరేకగళం విప్పారు. దీనికితోడు పార్టీలో వ్యక్తిపూజ ఎక్కువైందని, బీజేపీలో అందరూ సమానమేనంటూ సంజయ్‌నుద్దేశించి ఇటీవల దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు చేసిన వ్యాఖ్యలూ వైరల్‌గా మారాయి. నివురుగప్పిన నిప్పులా ఉన్న సీనియర్లంతా అసెంబ్లీ ఎన్నికల్లో సంజయ్ ఓటమి తరువాత మళ్లీ ఒక్కటై వచ్చే ఎంపీ ఎన్నికల్లో ఆయనకు అవకాశం ఇవ్వొద్దంటూ తీర్మానించి, ఆ పార్టీ అధిష్టానానికి పంపేందుకు సిద్ధమయ్యారు. ఇదే సమయంలో నేడు కరీంనగర్ పార్లమెంట్ స్థాయి శ్రేణులతో సంజయ్ సమావేశం ఏర్పాటు చేయడం ఆ పార్టీలో కలకలం రేపుతోంది.

పొన్నంకు వృత్తిసంఘాల శుభాకాంక్షలు..



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు చేతి వృత్తి సంఘాల సమన్వయ కమిటీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సమన్వయ కమిటీ కన్వీనర్ ఎంవీ రమణ, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యం కృష్ణస్వామి, క్షౌర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లేశం, విశ్వకర్మ వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రాళ్లబండి కుమారస్వామి, వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాయిలు తదితరులు మంత్రిని కలిశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో వృత్తి దారులకిచ్చిన హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

పౌరసరఫరాలపై మంత్రి సమీక్ష



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

త్వరలో మహాలక్ష్మి పథకం కింద రూ.500కు వంట గ్యాస్ సిలెండర్ ఇచ్చే అంశంపై ఉన్నతాధికారులతో పౌరసరఫరాశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షించారు. శుక్రవారం సచివాలయంలో ఆ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, పౌరసరఫరాల కమిషనర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి, రైతుల వద్ద నుంచి ధాన్యం సేకరణ, రేషన్ లబ్దిదారులకు నాణ్యమైన బియ్యం సరఫరా తదితర అంశాలపై చర్చించారు.

1,800 నర్సింగ్ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

- మంత్రి దామోదర తొలి సంతకం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 1,800 నర్సింగ్ పోస్టులను భర్తీ చేసేందుకు వీలుగా వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సంబంధిత ఫైలుపైతొలి సంతకం చేశారు. ఇప్పటికే వైద్య ఆరోగ్య శాఖలో 7 వేలకు పైగా ఉద్యోగాల నియామక ప్రక్రియ వివిధ దశలలో ఉన్న సంగతి తెలిసిందే..గత ప్రభుత్వ హయాంలో విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చెయ్యాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు నియామక ప్రక్రియను చేపట్టిన సంగతి విదితమే.ఇందులో భాగంగా 5,204 మంది స్టాఫ్ నర్సుల నియామకానికి ఉద్యోగ ప్రకటన వెలువడింది. సుమారు 40 వేల మందికిపైగా దరఖాస్తు చేసుకోగా, రాత పరీక్ష నిర్వహించి 'కీ'ని కూడా విడుదల చేసింది. ఆ నియామకాలను వెంటనే చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

ఆత్మహత్యకు అనుమతించండి

సహచరుల లైంగిక వేధింపులతో జీవితంపై విరక్తి : మహిళా జడ్జి లేఖ

- స్పందించిన సుప్రీం, నివేదిక కోసం ఆదేశాలు జారీ



న్యూఢిల్లీ : తన ఆత్మహత్యకు అనుమతి నివ్వాలంటూ ఉత్తరప్రదేశ్‌లోని ఒక మహిళా న్యాయమూర్తి రాసిన బహిరంగ లేఖపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్ శుక్రవారం స్పందించారు. మహిళా జడ్జి చేసిన ఫిర్యాదులపై నివేదిక ఇవ్వాలని సుప్రీంకోర్టు సెక్రటరీ జనరల్ అతుల్ ఎం. కుర్హేకర్ అలహాబాద్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు లేఖ రాస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బహిరంగ లేఖను హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి దృష్టికి కూడా తీసుకువెళ్లినట్లు సెక్రెటరీ జనరల్ పేర్కొన్నారు. "నా జీవితాన్ని గౌరవప్రదంగా ముగించుకోవడానికి నన్ను అనుమతించండి. నా జీవితాన్ని అంతం చేసుకోనివ్వండి " అని బందాకు చెందిన ఓ మహిళా న్యాయమూర్తి చీఫ్ జస్టిస్‌కు రాసిన బహిరంగ లేఖ సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి తెలిసిందే. బారాబంకిలో పనిచేస్తున్న సమయంలో జిల్లా జడ్జి అతని సహచరులు తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆమె పేర్కొన్నారు. " నేను చాలా తీవ్రంగా లైంగిక వేధింపులకు గురయ్యాను. నన్ను పురుగుకంటే హీనంగా చూస్తున్నారు. గౌరవప్రదంగా నా జీవితాన్ని అంతం చేసుకునేందుకు అనుమతించండి " అని ఆ లేఖలో ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఏడాది జులైలో తాను హైకోర్టు అంతర్గత ఫిర్యాదుల కమిటీకి ఫిర్యాదు చేశానని, విచారణకు ఆదేశించారని అయితే ఆ విచారణ ఓ "ప్రహసనం, బూటకం" అని పేర్కొన్నారు. సాక్షులు జిల్లా జడ్జికి సబార్డినేట్‌లని, తమ యజమానికి వ్యతిరేకంగా వారు సాక్ష్యమిస్తారని కమిటీ ఎలా భావించిందో, నా అవగాహనకు కూడా అందడం లేదు " అని పేర్కొన్నారు. విచారణ సక్రమంగా జరిగేలా దర్యాప్తు పూర్తయ్యేంతవరకు అతనిని బదిలీ చేయాలని సుప్రీంకోర్టును కోరానని, అయితే కేవలం ఎనిమిది సెకన్ల వ్యవధిలోనే తన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించిందని తెలిపారు. ఇక తనకు జీవించాలనే కోరిక లేదని, గత ఏడాదిన్నర కాలంగా తనను నడిరోడ్డుపై పడేశారని, ప్రాణం లేని, నిర్జీవమైన ఈ శరీరాన్ని ఇలా మోయడం వల్ల ప్రయోజనం లేదని, తన జీవితానికి ఎలాంటి లక్ష్యం లేదని రెండు పేజీల సుదీర్ఘ లేఖలో ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

తక్షణ చర్యలు తీసుకోవాలి : సీఐటీయూ

లైంగిక వేధింపులకు పాల్పడు తున్నారంటూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై తక్షణమే చర్య తీసుకోవాలని, దోషులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ కోరింది. న్యాయ వ్యవస్థలతో సహా అన్ని వ్యవస్థల్లోనూ పిఓఎస్‌హెచ్ చట్టాన్ని అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎఐసిసిడబ్ల్యుడబ్ల్యు కన్వీనర్ ఎ.ఆర్.సింధూ ఒక ప్రకటనలో కోరారు. ఉన్నత స్థాయిలో వున్న మహిళా న్యాయమూర్తిపైనే ఇటువంటి వేధింపులు జరగడం పట్ల సీఐటీయూ, మహిళా సబ్ కమిటీ, అఖిల భారత వర్కింగ్ వుమెన్ సమన్వయ కమిటీ ఆవేదన వ్యక్తం చేశాయి. లైంగిక వేధింపులతో కలిసి జీవించడమెలాగో భారతదేశంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగినులకు తెలియచేయాలనుకుంటున్నట్టు ఆమె ఆ లేఖలో పేర్కొన్నారు. అసంఘటిత రంగంలో పని ప్రదేశాల్లో పిఓఎస్‌హెచ్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని సీఐటీయూ డిమాండ్ చేస్తూనే వుందని గుర్తు చేశారు. ఈ కేసులో దర్యాప్తుకు చీఫ్ జస్టిస్ ఆదేశించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

నేరుగా వేతనాలివ్వాలి

మంత్రి తుమ్మలకు వినతి

తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో ఔట్ సోర్సింగ్ సెక్యూరిటీ గార్డులకు సంబంధించి ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి, మార్కెట్ కమిటీల ద్వారా నేరుగా వేతనాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్యూరిటీ గార్డ్సు యూనియన్(సీఐటీయూ) నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తుమ్మల నాగేశ్వరరావుకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు.దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి యాటల సోమన్న ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో సుమారు 182 వ్యవసాయ మార్కెట్ యార్డులు, చెక్‌పోస్టుల్లో సుమారు 1,200 సెక్యూరిటీ గార్డులు కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ పద్ధతుల్లో పని చేస్తున్నారని తెలిపారు. మార్కెట్ యార్డుల్లో రైతుల సరుకులను రక్షించడం, చెక్‌పోస్టుల్లో వ్యవసాయ, దినుసుల రవాణా వాహనాలను ఆపి తనిఖీ చేసి స్వయంగా ఆన్‌లైన్ ద్వారా రశీదు జారీ చేసి, మార్కెట్ ఫీజు వసూలు చేసి బ్యాంకుల్లో జమ చేయడంతో పాటు ఆదాయం పెంచడంలో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వారు పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి, నేరుగా మార్కెట్ కమిటీల నుంచే వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా మంత్రికి వారు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల సాంబయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ సారిక రాము, ఉపాధ్యక్షులు జి, లక్ష్మణ్, బలీ సదయ్య, ముస్తాక్ హుస్సేన్, రాష్ట్ర కార్యదర్శులు ఎస్. రమేష్, వై. రామాంజయ్య, బి. మహేందర్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు సిహెచ్, లక్ష్మయ్య, జె. పాండురంగారావు, కె. దీక్షిత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ దుర్మరణం

చెరుకువాడలో రోడ్డు ప్రమాదం

- తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మతి
- ఏపీ రాష్ట్ర క్యాబినెట్, చంద్రబాబు, సీపీఐ(ఎం) సంతాపం



భీమవరం: ప్రజా ఉద్యమాల ముద్దుబిడ్డ ఉభయ గోదావరి జిల్లాల పీడీఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ తుది శ్వాస విడిచారు. ఉండి మండలం చెరుకు వాడ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందారు. ఏలూరు జిల్లా నుంచి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం బయలుదేరిన ఎమ్మెల్సీ సాబ్జీ ఆకివీడులో నాలుగు రోజుల నుంచి జరుగు తున్న అంగన్వాడీల సమ్మెకు సంఘీభావం తెలిపి భీమవరం వస్తుండగా చెరుకువాడ వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో కారు నుజ్జు నుజ్జు అయింది. వ్యాగన్ ఆర్ కార్లో ఎదుర సీట్లో కూర్చున్న సాబ్జీకి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. అక్కడి నుంచి పోలీస్ వాహనంలో భీమవరం ప్రభుత్వాసు పత్రికి తరలించారు. ప్రజానీకం సందర్శనార్థం సాబ్జీ మృత దేహాన్ని భీమవరం ఆస్పత్రిలో ఉంచారు. ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్ రాజు, జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, జిల్లా ఎస్పీ రవి ప్రకాష్, జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి, భీమవరం ఆర్డీవో శ్రీనివాసులు రాజు సాబ్జీకి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బి బలరం, యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి గోపి మూర్తి, సీఐటీయూ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఎన్వి గోపాలన్, కే రాజా రామ్మోహన్ రాయ్, యుటిఎఫ్ నేతలు, కార్మిక వర్గం అంగన్వాడీలు, ఆశ వర్కర్లు, కార్మికులు ఘనంగా నివాళులర్పించారు.

ప్రజాస్వామ్య శక్తులకు బాధాకరమైన అంశం : పీడీఎఫ్ ఎమ్మెల్సీలు

పీడీఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మృతి పట్ల పీడీఎఫ్ ఏపీ ఎమ్మెల్సీల తరపున కేఎస్ లక్ష్మణ్ రావు, ఐ వెంకటేశ్వరరావు సంతాప ప్రకటించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ఉపాధ్యాయుడుగా ఉద్యమ నాయకుడిగా పనిచేస్తూ సాబ్జి యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా అనేక ఉద్యమాలలో భాగస్వామి అయ్యారని తెలిపారు. 2021 మార్చిలో తూర్పు గోదావరి పశ్చిమగోదావరి ఉపాధ్యాయ నియోజక వర్గం నుండి శాసనమండలికి జరిగిన ఎన్నికలలో ఘన విజయం సాధించారని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటు : పీడీఎఫ్ మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మృతికి పీడీఎఫ్ మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ సంతాపం ప్రకటించారు. సాబ్జి మృతి యూటీఎఫ్ ఉద్యమానికి, ఉపాధ్యాయుల ఉద్యమానికి తీరని లోటని తెలిపారు. వారి కుటుంబానికి సానుభూతిని తెలిపారు.

ఎమ్మెల్సీ నర్సిరెడ్డి సంతాపం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, యూటీఎఫ్ మాజీ అధ్యక్షుడు షేక్ సాబ్జీ రోడ్డు ప్రమాదంలో మరణించడం పట్ల ఎమ్మెల్సీ అలుగు బెల్లి నర్సిరెడ్డి సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు శుక్రవారం ఒక ప్రకటనలో ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన మరణం ఉపాధ్యాయ ఉద్యమాలకు తీరనిలోటని పేర్కొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ దిగ్భ్రాంతి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, యూటీఎఫ్ మాజీ అధ్యక్షుడు షేక్ సాబ్జీ శుక్రవారం మధ్యాహ్నం పశ్చిమ గోదావరి జిల్లా ఉండి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించడం పట్ల టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. చురుకైన నాయకుడు, సమరశీల ఉద్యమకారుడు సాబ్జీ మరణం ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య ప్రధాన కార్యదర్శి చావ రవి తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

ప్రజాఉద్యమాలకు తీరని లోటు : బి వెంకట్

ఉపాధ్యాయ ఉద్యమ నేత, యూటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు శాసనమండలి సభ్యులు షేక్ సాబ్జీ మరణం కలచి వేసిందని ఏఐఏడబ్ల్యూయూ జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ అన్నారు. సుదీర్ఘకాలంగా ఆయనతో పరిచయాలు ఉన్నాయనీ, ఆయన అకాల మరణం వారి కుటుంబంతో పాటు ప్రజా ఉద్యమాలకు, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌కు తీరనిలోటన్నారు. విద్యార్థి ఉద్యమం నుంచి ఆయనతో కలిసి పనిచేసిన అనుభవాలు అనేకం ఉన్నాయని గుర్తు చేసుకున్నారు. ఆయన మృతికి తీవ్ర సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు, యూటీఎఫ్ రాష్ట్ర కమిటీకి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

'సహకార సంఘాలు రైతుల అభివృద్ధికి కృషి చేస్తాయి'



నవతెలంగాణ - తుర్కయంజాల్

సహకార సంఘాలు రైతుల అభివృద్ధికి కృషి చేస్తాయని డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. ఈ మేరకు శుక్రవారం తుర్కయంజాల్ రైతు సేవ సహకార సంఘానికి విచ్చేసిన కొత్తకుర్మ సత్తయ్యను సంఘ వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్ సామ సంజీవరెడ్డి లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని అన్ని సహకార బ్యాంకులను సమన్వయం తో ముందుకు నడిపిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సెక్రెటరీ వై.రాందాస్, సభ్యులు కందాడి లక్ష్మారెడ్డి, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలకు శుభాకాంక్షలు



నవతెలంగాణ - చైతన్యపురి

తెలంగాణ రాష్ట్ర మార్కెట్ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి తుమ్మల సచివాలయంలోని వారి ఛాంబర్ లో పదవి స్వీకారం చేస్తున్న సందర్భంగా ఆయనను తెలంగాణ రాష్ట్ర మార్కెట్ ఉద్యోగుల ఫోరం అధ్యక్షుడు చిలుక నరసింహ రెడ్డి, కార్యదర్శి యం.డి ఫసియోద్దీన్ (ముక్రం)లు కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు తమ శాఖలో ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఆయుష్ డైరెక్టర్ హరిచందనపై చర్యలు తీసుకోవాలి



- ఉస్మానియా యూనివర్సిటీలో ఫార్మసిస్టుల ధర్నా

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికల్లో భారీగా అవకతవకలు జరిగాయనీ, రిటర్నింగ్ అధికారిగా వ్యవహరంచిన ఆయుష్ డైరెక్టర్ హరిచందనపై చర్యలు తీసుకోవాలని ఫార్మసిస్టులు ఉస్మానియా యూనివర్సిటీలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్మసిస్టులు ఆకుల సంజయ్‌రెడ్డి, తేజ శివకుమార్, కొలిపాక బాలరాజు, మాడెం ప్రభాకర్, కన్నెబోయిన శ్రీనివాస్, కంభంపాటి శ్రీకాంత్, ఎం.సతీష్ కుమార్, తదితరులు మాట్లాడుతూ పీసీఐ సర్టిఫికెట్ పోస్టు ద్వారా చేరుతుంది.. కానీ పోస్టల్ బ్యాలెట్ మాత్రం చేరదా..? అని ప్రశ్నించారు. 20 వేల పోస్టల్ బ్యాలెట్‌లో 6,500 రిజెక్ట్ చేయడానికి గల కారణాలు ఏంటని ప్రశ్నించారు. ఆయుష్ విభాగం, తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్‌లో అనేక అవకతవకలు జరుగుతున్నాయని, పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఫార్మసీ కౌన్సిల్ నిర్వహించడంలో రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన హరిచందన పూర్తి విఫలమయ్యారన్నారు. కార్యాలయ సిబ్బంది అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని వారు కోరారు.

న్యాయ సలహా కేంద్రాన్ని వినియోగించుకోండి

- మధుయాష్కీ గౌడ్



నవతెలంగాణ - చైతన్యపురి

ఉచిత న్యాయ సలహా కేంద్రం సేవలను వినియోగించుకోవాలని కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్, ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మధు యాష్కీ గౌడ్ కోరారు. ఆర్కేపురం డివిజన్‌లోని శివపురి కాలనీలో మధు యాష్కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు ఈ ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గెలుపు ఓటములతో సంబంధం లేకుండా ఇక్కడి ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా ఉంటామన్నారు. ఈ సలహా కేంద్రం నియోజకవర్గ ప్రజలందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందన్నారు. న్యాయ సలహా కేంద్రం ఫోన్ నంబర్లు అందరికీ అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఈ కేంద్రంలో ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల మధ్య, ప్రతి శనివారం ఉదయం 11 గంటల నుంచి 1 గంటల వరకు న్యాయ నిపుణులు అందుబాటులో ఉంటారని చెప్పారు. కావునా ఈ సదావకాశాన్ని నియోజకవర్గ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

సత్వర న్యాయం కోసం పారా లీగల్ వాలంటీర్లు



- గుంత మురళీ మోహన్

నవతెలంగాణ - చైతన్యపురి

సత్వర న్యాయం కోసం పారా లీగల్ వాలంటీర్లు పనిచేస్తారని రంగారెడ్డి జిల్లా కోర్టు పారాలిగల్ వాలంటీర్ గుంత మురళీమోహన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ పారా లీగల్ వాలంటీర్లు ప్రజలకు, న్యాయస్థానానికి మధ్య వారధిగా ఉంటారని తెలిపారు. ఈ వ్యవస్థ వలన పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత న్యాయం లభిస్తుందని అన్నారు. రాజీ పడదగ్గ ఎన్నో కేసుల విషయంలో పారా లీగల్ వాలంటీర్ సేవలు ఉపయోగపడతాయని, ఇందుకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని అన్నారు. సామాన్యులు ఎవరైనా తమ సమస్యలపై ఎప్పుడైనా తనని సంప్రదించవచ్చని సూచించారు. సమస్యలను న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లడంలో ఎల్లవేళలో ప్రజలకు అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. రంగారెడ్డి జిల్లా కోర్టుకు సంబంధించి పారా లీగల్ వాలంటీర్‌గా అవకాశం ఇచ్చిన రంగారెడ్డి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఇందిరాకు కృతజ్ఞతలు తెలిపారు. న్యాయస్థానానికి తమ సమస్యలను తెలుసుకోవాలనుకునేవారు 81848 48498 నెంబర్ ద్వారా తనను సంప్రదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 30న 5వ శనివారం నిర్వహించే మెగా లోక్ అదాలత్‌ను ప్రజలందరూ ఉపయోగించుకుని, పెండింగ్‌లో ఉన్న తమ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని, దాని వలన ఇరు వర్గాలు గెలిచినట్టు అవుతోందని అన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



నవతెలంగాణ- బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 25వ డివిజన్ రాజీవ్ గృహకల్పలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం కార్పొరేటర్ ముత్యాల లలిత కృష్ణతో కలిసి మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి..త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అన్ని డివిజన్లలోని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఎంతో కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఈ జ్యోతి రెడ్డి, ఏఈఈ వినీల్ గౌడ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

మిగిలిపోయిన పనులను పూర్తి చేస్తాం



- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ- నాగోల్

ఎల్బీనగర్ నియోజకవర్గంలో మిగిలిపోయిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసి.. నియోజకవర్గం ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని జైపూరి కాలనీ సమీపంలో ఉన్న ఎస్.టీ.పీ.ప్లాంట్ నందు జరుగుతున్న మురుగునీటి శుద్ధి కేంద్రంలోని పనులను శుక్రవారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పహాడిషరీఫ్ నుంచి ఉస్మానియా హాస్పిటల్ అక్కడ నుంచి ఇక్కడ వరకు సేవరేజ్ తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇక్కడ ఉత్పత్తి అయ్యే సేవరేజ్ మూసీలో కలవకుండా ట్రీట్మెంట్ ప్లాంట్ కు డైవర్ట్ చేసి, అక్కడ ట్రీట్మెంట్ చేసి స్వచ్ఛమైన నీటిని మూసీలోకి వదలడం జరుగుతుందని పేర్కొన్నారు. మూసీనది ప్రక్షాళనలో భాగంగా పనులు చేయడం జరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో మురుగు కాలువల్లో సేవరేజ్ కలవకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే నియోజకవర్గ పరిధిలో మిగిలిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేస్తామని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తానని అన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

- కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్



నవతెలంగాణ -నాగోల్

నాగోలు డివిజన్‌లోని పలు కాలనీలలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం సంబంధిత ఉన్నతాధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను గుర్తించి, వాటిని తొలగించి నూతన స్తంభాలను ఏర్పాటు చేయాలన్నారు. కొత్తగా ఏర్పడిన కాలనీలలో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా వెంకట్ రెడ్డి నగర్ కాలనీలో నూతన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్, సెవెన్ హిల్స్ కాలనీలో నూతన విద్యుత్ స్తంభాలను, మన్సూరాబాద్ వీకర్ సెక్షన్లో ఐరన్ పోల్స్‌ను ఏర్పాటు చేయాలని వినతిపత్రం ద్వారా పవర్ డిస్ట్రిబ్యూషన్ ఎస్సీ కర్ణాకర్ బాబును కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి చింతల సురేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడ జీఎస్ఐ కార్యాలయంలో వైద్య శిబిరం



నవతెలంగాణ -నాగోల్

నాగోలు డివిజన్‌లోని బండ్లగూడ జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయంలో శుక్రవారం హైదరాబాద్ అపోలో స్పెక్టర్ ఆసుపత్రి వారి సహకారంతో తెలంగాణ, ఏపీ జిఎస్ఐ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, కాన్ఫరేషన్ అనిల్ కుమార్, సాయిబాబాల పర్యవేక్షణలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిఎస్ఐ అదనపు డైరెక్టర్ జనరల్, హెడ్ సిహెచ్. వెంకటేశ్వర మాట్లాడుతూ ఈ శిబిరంలో 250 మంది పాల్గొని..వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు ఎంఎల్ దొర, హర్మోహన్ మిశ్రా, తారకేశ్వర్ రావు, ఆదార్ల మహేష్, మదిర సత్యనారాయణ, ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సాయిబాబా, కె. అనిల్ కుమార్, అమీర్ ఖాన్, మహ్మద్ ఆజం, నితీష్ సింగ్ పాల్గొన్నారు.

పాతబస్తీలో
మెట్రో విస్తరణ పనులు వెంటనే ప్రారంభించాలి



- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి అబ్బాస్

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ పాతబస్తీలో మెట్రో రైలు ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటించడాన్ని ఆహ్వానిస్తున్నామని, పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి ఎం.డి అబ్బాస్ అన్నారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ పాతబస్తీ అభివద్ధికి రూ. పదివేల కోట్లు కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పించాలని, చారిత్రక వారసత్వ కట్టడాలను పరిరక్షించి, అభివద్ధి చేయాలని కోరారు. పాతబస్తీలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికను రూపొందించాలని అన్నారు. రోడ్లు, మంచినీరు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ హాస్పిటల్స్ అభివద్ధి చేయాలని కోరారు. సమావేశంలో హైదరా బాద్ సౌత్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి. విఠల్, ఎం.మీనా, జిల్లా కమిటీ సభ్యులు శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధి చేయడానికే అంతర్జాతీయ సదస్సులు'



నవతెలంగాణ - బడంగ్‌పేట్

శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చేయడానికే అంతర్జాతీయ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఇస్రో అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ వి.అశోక్ తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్‌లోని యంవీయస్సార్ ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో "అడ్వాన్సెస్ ఇన్ కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్' ఐసిఏసిఐపై మొదటి అంతర్జాతీయ సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా డా.వి.అశోక్, ఆర్‌సిఐ డైరెక్టర్ గౌతమ్ మహాపాత్ర, కీ.నోట్ స్పీకర్ డా.పరాగ్ కులకర్ణిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణన మేధస్సులో ప్రస్తుత పోకడలను చర్చించడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న గ్లోబల్ ఐటీ నిపుణులు, విద్యావేత్తలు, పరిశోధకులు, మేధావులు, విద్యార్థులను ఒకచోట చేర్చిందని, అంతర్జాతీయ సదస్సు పరిశ్రమ పరిజ్ఞానాన్ని పెంచుతుందని నెట్‌వర్కింగ్, సాంస్కృతిక మార్పిడిని ప్రోత్సహిస్తుందన్నారు. జీ.పి.టి3 వంటి ఎల్ ఎల్ ఎంలు స్టార్టప్‌లకు ఐడియా జనరేషన్, మార్కెట్ రీసెర్చ్, ప్రోటోటైప్, ప్రాసెస్ డెవలప్‌మెంట్, రిపీటీటివ్ టాస్క్‌లను ఆటోమేట్ చేయడం జరిగిందన్నారు. అంతర్జాతీయ విశ్వవిద్యాలయం, జపాన్ డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎంఎల్, ఐఓటి వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను హైలైట్ చేయడానికి ప్రయత్నిస్తుందన్నారు. ఇది ముఖ్యమైన అంతర్దృష్టులను ఇస్తుందని, సంక్లిష్టమైన ప్రపంచ సమస్యలను పరిష్కరించడానికి మార్గం సుగమం చేస్తుందన్నారు. సదస్సులో పాల్గొనే వారి ఆలోచనలను రేకెత్తించి, చర్చలలో పాల్గొనడానికి, ఒకే ఆలోచన ఉన్న వ్యక్తులతో నెట్‌వర్క్ చేయడానికి, ఐటీ రంగంలో అభివృద్ధి చెందుతున్న దోరణులపై గ్లోబల్ ప్రసంగాలకు సహకరించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మాతృశ్రీ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కె. పి. శ్రీనివాసరావు ప్రారంభించారు. సదస్సుకు డాక్టర్ కె. వేణుగోపాల్ రావు, ఐటి హెచ్ఓడి, డా.ఎ.వి.క్రిష్ణ ప్రసాద్ కన్వీనర్ గా, విజయ భాస్కర్ కో కన్వీనర్‌గా ఉన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పీ.వీ.కశ్యప్, సెక్రటరీ యం. కృష్ణ కుమార్, సహ కార్యదర్శి వాసుదేవరావు, కళాశాల ప్రిన్సిపాల్ డా.జి. కనకదుర్గ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ.యస్జీయస్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు పీపీఈ కిట్ల పంపిణీ



నవతెలంగాణ - హయత్‌నగర్

డివిజన్‌లోని కమల నగర్‌లో పారిశుద్ధ్య కార్మికులకు పీపీఈ కిట్స్(పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్మెంట్స్)ను శుక్రవారం కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల నిర్వహణలో ఎలాంటి అలసత్వం వహించకుండా హయత్ నగర్‌లోని కాలనీల పరిసరాల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొనిరావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ జవాన్ లక్ష్మయ్య, సూపర్వైజర్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

సంరక్షణ కిట్లు పంపిణీ చేసిన కొప్పుల నర్సింహా రెడ్డి..

మన్సూరాబాద్ డివిజన్ శ్రీరామ్‌నగర్ కాలనీలోని కార్పొరేటర్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులకు వ్యక్తిగత సంరక్షణ పరికరాల కిట్లను శుక్రవారం జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సీజనల్ వ్యాధులు రాకుండా, మన ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచే విషయంలో ప్రధాన భూమికను పారిశుద్ధ్య కార్మికులు పోషిస్తారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జవాన్ శ్రీనివాస్ రావు, నాయకులు పాతూరి శ్రీధర్ గౌడ్, మునగాల హరీష్ రెడ్డి, సౌరాల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మధుయాష్కీ గౌడ్ జన్మదిన వేడుకలు





నవతెలంగాణ - హస్తినాపురం

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న హస్తినాపురండివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు.

నవతెలంగాణ - చైతన్యపురి

కాంగ్రెస్ పార్టీ ఎల్బీనగర్ ఇంచార్జి మధు యాష్కీ గౌడ్ జన్మదినం సందర్భంగా చైతన్యపురి డివిజన్‌లో తెలంగాణ ఉద్యమకారుడు దాము మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌతమ్‌రెడ్డి, శ్రీనివాస్, విజయ్ కుమార్, రామ్ బాబు, కుమార్, సతీష్, సాయి, కిరణ్, చంద్ర శేఖర్, శివ, నాగార్జున రెడ్డి, సుధాకర్ రాజు, అశోక్ రెడ్డి, మహేష్, ఆదిత్య, సందీప్, ఉషాన్, వినోద్, నరేష్, విక్రమ్, శేషగిరి రావు తదితరులు పాల్గొని రక్తదానం చేశారు.

నవతెలంగాణ - హయత్ నగర్



కాంగ్రెస్ పార్టీ ఎల్బీనగర్ ఇంచార్జి మధుయాష్కీ గౌడ్ జన్మదినం సందర్భంగా ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ ప్రెసిడెంట్ గుర్రం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సుధీర్ ఫౌండేషన్‌లో విద్యార్థులకు పండ్లు, భోజన సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ ప్రెసిడెంట్ ధనావత్ శ్రీనివాస్ నాయక్, కళ్యాణ్, ఎస్సీ సెల్ చిన్న, సంతోష్, వెంకటేష్, హన్మంతు, గోపి, బాబూలాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



నవతెలంగాణ- బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 29వ డివిజన్ పరిధిలో ఉన్న వెంకటాద్రి కాలనీలో శుక్రవారం అయ్యప్ప స్వామి మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పారిజాత నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్ రెడ్డి, రాళ్లగుడం సంతోషి శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గట్టు బాలకృష్ణ, అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - నాగోల్



నాగోల్ డివిజన్‌లోని సాయి నగర్‌లో శుక్రవారం నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజకు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, ఇంటర్నేషనల్ ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహణ అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస గుప్త హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఇలాయిపల్లి కిరణ్, పిల్లాయిపల్లి నర్సింగరావు, దళిత సంఘం నాయకులు, అయ్యప్ప స్వామి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
8
మేడ్చల్-ఉప్పల్
శనివారం | డిసెంబర్ 16, 2023 | www.navatelangana.com



తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌ను సోమాజిగూడలోని యశోద ఆస్పత్రిలో కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డిలు శుక్రవారం కలిసి పరామర్శించారు. అనంతరం కేటీఆర్, కవిత కలిసి కేసీఆర్ ఆరోగ్యంపై ఆరా తీశారు.
-నవతెలంగాణ, కాప్రా

మాజీ మంత్రి మల్లారెడ్డి భూ కబ్జాలకు పాల్పడలేదు

- బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల అధ్యక్షుడు మేకల బాలు



నవతెలంగాణ-మేడ్చల్
మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మూడుచింతలపల్లి మండలం కేశవరం గ్రామంలో ఎలాంటి భూకబ్జాలకు పాల్పడలేదని బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల అధ్యక్షుడు మేకల బాలు అన్నారు. శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి మల్లారెడ్డి పై వస్తున్న భూకబ్జా ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. అది ఒక గ్రామానికి సంబంధించిన భూ వ్యవహారం మాత్రమేనని అందులో మల్లారెడ్డికి ఎలాంటి ప్రమేయం లేదని తెలిపారు. ఏమైనా తప్పుడు ఆరోపణలు వచ్చినా న్యాయపరంగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్న దమ్మున్న నాయకుడు మల్లారెడ్డిని కొనియాడారు.

మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లకు శుభాకాంక్షలు తెలిపిన పలువురు నేతలు



నవతెలంగాణ-శామీర్‌పేట
రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఇండస్ట్రీ అండ్ కామర్స్, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను తూంకుంట మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు భీమిడి జైపాల్‌రెడ్డి, అల్వాల్ సొసైటీ మాజీ చైర్మెన్ తోట దేశమంత్‌రెడ్డి, తూంకుంట మున్సిపల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తూంకుంట జగదీష్ గౌడ్, సీనియర్ నాయకులు బొరంపేట్ మధుసూదన్‌రెడ్డి, వీరన్నగారి భోజిరెడ్డి, చింతల మల్లారెడ్డిలు శుక్రవారం వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీశైలం నుంచి తెచ్చిన ప్రసాదాన్ని అందజేశారు.

నూతన బ్రిడ్జిని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి



నవతెలంగాణ-కాప్రా
నాచారం డివిజన్‌లోని కార్తికేయ నగర్ ప్రధాన రోడ్డుపై ఉన్న నాలాపై రూ.80లక్షల వ్యయంతో నిర్మించిన బ్రిడ్జిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేద్కర్ విగ్రహం వద్ద ఉన్న బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణానికి రూ.94లక్షలు మంజూరయ్యాయి పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ లింగారావు వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, నాచారం డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కార్తికేయ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు లక్ష్మారెడ్డి శంకుస్థాపన



నవతెలంగాణ-కాప్రా
చర్లపల్లి డివిజన్‌లోని సాయి నగర్‌లో 120 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, ఏఈ స్వరూప, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, డివిజన్ నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశి దర్శనానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



నవతెలంగాణ-కాప్రా
మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ మంగాపురం శ్రీశ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 23వ తేదీన నిర్వహించే ముక్కోటి ఏకాదశి ఉత్తర ద్వారం దర్శనానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని ఆలయ ఈవో రవీందర్‌రెడ్డి,కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సముద్రాల కృష్ణమూర్తి, పి.మల్లేష్ గౌడ్, సుధాకర్ గుప్తా, అశోక్ రెడ్డి, సుధాకర్, మురళీచారి, బ్రహ్మచారి, బాలరాజు, రాజశేఖర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీకి నూతన పైపులైన్ ఏర్పాటుకు చర్యలు



నవతెలంగాణ-కాప్రా
మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని మంగాపురం కాలనీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వెనకాల ఉన్న డ్రయినేజీ లైన్ ఓవర్ ఫ్లో వల్ల వాటర్ పైకి పొంగుతూ కాలనీ రోడ్లపైకి వస్తున్నదని కాలనీ వాసుల ఫిర్యాదుతో కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ అధికారులతో కలిసి నూతన పైప్‌లైన్ ఏర్పాటు పనులకు చర్యలు చేపట్టారు. పాత పైప్‌లైన్‌లో నిల్వ ఉన్న నీటిని క్లీనింగ్ వాహనం (ఎయిర్ టెక్)తో తొలిగించారు. జేసీబీ సహాయంతో పాత పైపులను తొలగించి నూతన పైపులను ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులతో పాటు స్థానిక నాయకులు కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుడికి ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అభినందన



నవతెలంగాణ-ఘట్కేసర్
మహిళ చేతిలో నుంచి బంగారం, నగదును లాక్కొనిపారిపోతున్న దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగించిన ఘట్కేసర్ ప్రాంత పాత్రికేయుడు గుర్రం రమేష్‌ను ఘట్కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి శుక్రవారం తన ఛాంబర్‌లో సన్మానించి, అభినందించారు. ఘట్కేసర్ పట్టణంలోని సౌత్ ఇండియన్ బ్యాంకులో మౌలాలి హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన ఆవుల విజయలక్ష్మి(35) ఇటీవల కుదువ పెట్టిన తన పది తులాల బంగారాన్ని గురువారం సాయంత్రం విడిపించుకోని బయటకు వస్తుండగా ఓ దొంగ ఆమె చేతిలోని బ్యాగును లాక్కొనిపారిపోతుండగా అటుగా బైక్‌పై వెళ్తున్న పాత్రికేయుడు గుర్రం రమేష్ గమనించి దొంగను పట్టుకొని బంగారం, నగదును బాధిత మహిళకు అప్పగించాడు. అనంతరం దొంగను పోలీసులకు అప్పజెప్పాడు. ఈ సందర్భంగా పాత్రికేయుడు గుర్రం రమేష్‌ను ఎంపీపీ అభినందించారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మహిళా సాధికారత కేంద్రం డిస్ట్రిక్ కో-ఆర్డినేటర్ ప్రియాంక
- బాలికలకు 'భేటీ బచావో.. భేటీ పడావో'పై అవగాహన



నవతెలంగాణ-సిటీబ్యూరో
మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మహిళా సాధికారత కేంద్రం డిస్ట్రిక్ కో-ఆర్డినేటర్ ప్రియాంక అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి ఎం.కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు మహిళా సాధికారత కేంద్రం మల్కాజిగిరిలోని మండల ప్రజా పరిషత్ బాలికల ప్రాథమిక పాఠశాలలో 'భేటీ బచావో.. భేటీ పడావో' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ బాలికలపై జరుగుతున్న హింసను అరికట్టాలన్నారు. బాలికలు తమ హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణ బాధ్య అందరిది అన్నారు. పిల్లలు మంచి పోషకాహారం తీసుకుని భవిష్యత్‌లో గొప్పగా ఎదగాలన్నారు. అమ్మాయిలను కూడా అబ్బాయిలతో సమానంగా చూడాలన్నారు. ఈ సందర్భంగా సుకన్య సమృద్ధి యోజన, ప్రభుత్వ స్కీమ్స్, బాలికలకు మెన్స్ట్రువల్ హైజీన్ గురించి వివరించారు. బాల్యవివాహాలు, బాల కార్మిక చట్టాలు, పొక్సో చట్టం, చైల్డ్‌లైన్, హెల్ప్ లైన్ నెంబర్ 100, 181, 1098, 14567, 155326 పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ వాసవి, సవిత, ఫైనాన్షియల్ లిటరసీ శ్రావణి, మహిళా సాధికారత బృందం, పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిసిన విశ్వబ్రాహ్మణులు



నవతెలంగాణ- నేరేడ్‌మెట్
మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని శుక్రవారం విశ్వబ్రాహ్మణులు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పూల బొకే, శాలువాతో ఘనంగా సన్మానించారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీరపల్లి శంకర్‌కు సన్మానం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ
కూకట్‌పల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం కార్యాలయానికి వచ్చిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీరపల్లి శంకర్‌ను శాలువాతో సత్కరించారు.

క్రీడలతోనే ఉద్యోగుల్లో స్నేహాభావం



- థియేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు
- హకీంపేట బస్ డిపోలో డివిజన్ స్థాయి ఆటల పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-శామీర్‌పేట
ఆటల పోటీల నిర్వహించడం వల్ల ఉద్యోగుల్లో స్నేహాభావంతో పాటు మనసిక ఉల్లాసం పెంపొందుతుందని థియేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని టీఎస్ఆర్టీసీ హకీంపేట్ డిపోలో డిపో మేనేజర్ భవభూతి ఆధ్వర్యంలో శుక్రవారం సికింద్రాబాద్ డివిజన్ స్థాయి (ఆరు డిపోల) స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా థియేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు హాజరై ఖోఖో, కబడ్డీ, షటిల్ ఆటల పోటీల ప్రారంభించారు. ఈ పోటీలలో మహిళా కండక్టర్లకు ఖోఖో, పురుషులకు కబడ్డీ, షటిల్ ఆటల పోటీలలో పాల్గొనగా చెంగిచెర్ల, రాణిగంజ్, కంటోన్మెంట్, ఉప్పల్, కుషాయిగూడ, హకీంపేట్ డిపోల జట్లు తలపడ్డాయి. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాటాడుతూ.. అప్పుడప్పుడు ఆటల పోటీలు నిర్వహించడం వల్ల ఉద్యోగుల్లో స్నేహాభావంతో పాటు మనసిక ఉల్లాసం పెంపొందుతుందని పేర్కొన్నారు. ఈ ఆటల పోటీలలో అన్ని డిపోలకు సంబంధించిన జట్టు పాల్గొనాలని సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన వారిని ఎంపిక చేసి రీజియన్ స్థాయిలో ఆడిపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా డిపోల మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు, సూపర్వైజర్లు, హకీంపేట డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.



స్కూల్ బస్సు కింద పడి మూడేండ్ల బాలుడు మృతి

- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



నవతెలంగాణ-కాప్రా
బస్సు చక్రాల కింద పడి మూడేండ్ల బాలుడు చనిపోయిన ఘటన చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బీ.ఎన్.రెడ్డి నగర్ కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికంగా నివసించే మంగ అనే మహిళలకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆమె భర్త తాగుడుకు బానిసై భార్యను వదిలేయడంతో తన ముగ్గురు పిల్లలతో కలిసి తల్లిదండ్రుల వద్ద ఉంటూ ఇండ్లల్లో పాచిపని చేసుకుంటూ పిల్లలను పోషించుకుంటోంది. పెద్ద పిల్లలు ఇద్దరూ శ్రీ సాయి మోడల్ స్కూల్ చదివిస్తుంది. రోజూ మాదిరిగానే శుక్రవారం ఉదయం ప్రణయ్(3) తన అక్క, అన్నను బస్సు ఎక్కించేందుకు వాళ్ల అమ్మమ్మ ఇంటికి సమీపంలో ఉన్న కూడలి వద్దకు వచ్చారు. మంగ పక్కనే ఉన్న అరుగుపై ప్రణయ్‌ను కూర్చోబెట్టి ఇద్దరు పిల్లలు ఇద్దరినీ బస్సు ఎక్కించింది. ఈలోగా ప్రణయ్ అరుగు దిగి రోడ్డు పైకి పరుగెత్తుకుంటూ రావడం ఎవరూ గమనించలేదు. డ్రైవర్ బస్సును ముందుకు కదిలించడంతో ప్రణయ్ బస్సు చక్రాల కింద పడడంతో చనిపోయాడు. విషయం గమనించిన స్థానికులు బస్సు డ్రైవర్‌ను పట్టుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహాన్ని స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వై.మల్లికార్జున రావు తెలిపారు.

5జీ హ్యాండ్సెట్ రియల్‌మీ సీ-67 ఆవిష్కరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో
తెలంగాణలో అత్యంత వేగవంతంగా విస్తరిస్తున్న సంస్థ సెల్ బే శుక్రవారం తమ గచ్చిబౌలి షో రూంలో రియల్‌మీ వారి సరికొత్త 5జీ హ్యాండ్సెట్ రియల్ మీ సీ-67ను నటి శుభశ్రీ రాయగురు చేతుల మీదుగా లాంచ్ చేశారు. ఈ సందర్భంగా శుభశ్రీ మాట్లాడుతూ సెల్ బేతో తన అసోసియేషన్ చాలా కాలంగా ఉందన్నారు. నేటి లాంచింగ్ కార్యక్రమం చాలా ఆనందంగా ఉందన్నారు. ఉత్తమమైన ప్రొడక్ట్స్, సర్వీసెస్ అందిస్తున్న సెల్‌బే మేనేజ్‌మెంట్‌కు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. సెల్‌బే వ్యవస్థాపక, మేనేజింగ్ డైరెక్టర్ సోమా నాగరాజు మాట్లాడుతూ తమ సంస్థ ఎల్లప్పుడూ తమ కస్టమర్స్‌కు సరికొత్త ప్రొడక్ట్స్ అందిస్తుందని, అందులో భాగంగానే ఈ లాంచింగ్ కార్యక్రమం అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రియల్‌మీ ప్రతినిధులైన ఏఐఓటీ అండ్ ఎల్ఎఫ్టీ డైరెక్టర్ తరిణి ప్రసాద్, ఎల్ఎఫ్ఆర్ హెడ్ పునీత్ చతుర్వేది, సౌత్ కీ అకౌంటు మేనేజర్ నరసింహలకు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెటింగ్ డైరెక్టర్ సుదీప్ నల్లచెరు మాట్లాడుతూ నిరంతరం మారుతున్న కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా తమ మార్కెటింగ్ స్ట్రాటజీలను మలుచుకుంటూ వారికి సరికొత్త షాపింగ్ అనుభవం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సెల్‌బే సిబ్బంది పాల్గొని సందడి చేశారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి



నవతెలంగాణ-మేడ్చల్
ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని శుక్రవారం మేడ్చల్ మున్సిపాలిటీలో నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని కిష్టాపూర్ 4వ వార్డులోని అర్చన కాలనీలోని వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పలు పార్టీల నాయకులు పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ.. పటేల్ జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. పలు సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసేందుకు వారు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తుడుం గణేష్, మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి ఏనుగు సుదర్శన్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు ఆంజనేయులు ముదిరాజ్, అర్చన కాలనీ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ చారి, ఉపాధ్యక్షుడు బుచ్చి రాములు, మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ మున్సిపల్ మాజీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సుదర్శన్‌రెడ్డి, మంత్రి కుమార్, శ్రీనివాస్ గౌడ్, రామచంద్రారెడ్డి, రాఘవరెడ్డి, జాకట ప్రేమదాస్, వంశీ, రాగం అర్జున్, అర్జున్, కాలనీవాసులు సత్యనారాయణ, సురేందర్ రెడ్డి, మోహన్ గౌడ్, గంగయ్య, మల్లారెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, కమలాకర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలను కలిసిన డీఎంఅండ్‌హెచ్ఓ రామ్‌కుమార్





నవతెలంగాణ-సిటీబ్యూరో
కూకట్‌పల్లి జోన్ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రామ్‌కుమార్ శుక్రవారం కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానందను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పూల బొకే అందజేసి అభినందనలు తెలిపి, శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఆటో డ్రైవర్ల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలి



- బీఆర్టీయూ మున్సిపల్ అధ్యక్షుడు ఎర్ర విజయ్ రావు

నవతెలంగాణ-మేడ్చల్
ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని ఆటో స్టాండ్ వద్ద డ్రైవర్లు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.
ఆటోనే జీవనోపాధిగా భావిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న తమకు మహిళలు ఆటోలో ప్రయాణించకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

వెబ్‌సైట్‌లో ప్రిలిమినరీ జవాబు 'కీ'

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యాధికారి విజయకుమారి



నవతెలంగాణ-సిటీబ్యూరో
ఈ నెల 10వ తేదీన జరిగిన నేషనల్-మీన్స్-కమ్-మెరిట్ (ఎన్ఎంఎస్ఎస్) స్కాలర్షిప్ స్కీం పరీక్షల ప్రిలిమినరీ జవాబు 'కీ' లను http//bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యాధికారి విజయకుమారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయంపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే వాటి వివరాలు, సరైన జవాబులను నేరుగా డైరెక్టర్ ప్రభుత్వ పరీక్షలు హైదరాబాద్ వారికి లేదా dirgovexams.tg@gmail.com నకు ఈ నెల 22వ తేదీ లోపు సమర్పించాలని తెలిపారు. గడువు దాటిన తర్వాత వచ్చిన అభ్యంతరాలను స్వీకరించబోమని పేర్కొన్నారు.

కేపీ. వివేకానంద్‌కు శుభాకాంక్షల వెల్లువ



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు, సంక్షేమ సంఘం సభ్యులు, కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ని కలిసి శాలువా కప్పి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని అన్ని వర్గాల ప్రజల ఆశీర్వాదాలు, సంపూర్ణ మద్దతుతో ఇంతటి అఖండ విజయం లభించిందన్నారు. రానున్న ఐదేండ్లలో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే కుత్బుల్లాపూర్‌ను ప్రత్యేక అభివృద్ధి చెందిన నియోజకవర్గంగా ప్రథమ స్థానంలో నిలుపుతామన్నారు.

గిరిజన బిల్లుకు ఆమోదం తెలిపిన కేంద్ర ప్రభుత్వం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

తెలంగాణలోని ములుగు జిల్లాలో సమ్మక్క, సారక్క గిరిజన విశ్వవిద్యాలయం బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ బంజారా విద్యార్థి సంఘం అధ్యక్షులు ధరావత్ వినోద్ నాయక్, ఉపాధ్యక్షులు పరమేష్, శ్రీకాంత్, ఆకాష్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్, యాకూబ్, సురేష్, శశి, లాకవత్ లైలా, బానోత్, అనూష, తదితరులు విద్యార్థులు పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు.

ప్రజాదర్బార్‌లో సీపీఐ నాయకుల వినతి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

శుక్రవారం సీఎం క్యాంప్ ఆఫీస్‌లో జరిగిన ప్రజాదర్బారులో కుత్బుల్లాపూర్ మండల నాయకులు పాల్గొని గత ప్రభుత్వ హయాంలో కుత్బుల్లాపూర్ మండలంలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూమిని బీఆర్ఎస్ నాయకులు కబ్జాచేశారన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కూడా కొనసాగుతున్నాయని, కావున కాంగ్రెస్ ప్రభుత్వం అట్టి భూ కబ్జాదారుల పై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని తమ ప్రభుత్వం కబ్జాదారులపై కఠినంగా వ్యవహరిస్తోందనే సంకేతాలు పంపాల్సిన అవసరం ఉందని అన్నారు. గతంలో 2022 అక్టోబర్ నెలలో సర్వే నెంబర్ 329 లో పేద ప్రజలు గుడిసె వేసుకుందాం అంటే ఒకేసారి 4 పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలీస్ బలగాలతో కాపలా కాసి నాయకులను అరెస్టు చేసిన అధికారులు అదే భూమిలో కబ్జాదారులు ఇండ్లు కడితే మాత్రం ఏమి అనలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయం పై అధికారులను ప్రశ్నిస్తే సమాధానం లేదన్నారు. కావున ఎన్నికల ప్రచారంలో భూకబ్జాలను అరికడతామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలుపుకొని పేద ప్రజల ప్రభుత్వం అని చాటుకోవలని అన్నారు. అధికారులకు ఇచ్చిన వినత పత్రంలో గాజులరామారం సర్వే నెంబర్... 329, 342, 326, 307,12, ఎస్ఎఫ్‌పీ భూములు, జగద్గిరిగుట్ట డివిజన్ 348/1 దేవాదాయ భూమి, భూదేవి హిల్స్, పరికిచేరువు కబ్జా, మహాదేవపురంలో గుట్టపై వెలుస్తున్న ఇండ్లు, సురారం డివిజన్ విశ్వకర్మ కాలనీ, సురారం కట్టమైసమ్మ చెరువు కబ్జా, ఇతర అంశాలను కూడా పొందుపర్చి తక్షణమే పై సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు హరినాథ్ రావ్, ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాస్, మండల సహాయ కార్యదర్శి రాము, కూకట్‌పల్లి మండల కార్యదర్శి కృష్ణ, నాయకులు సహదేవ్ రెడ్డి, ఇమామ్, సుంకిరెడ్డి, అక్రం తదితరులు పాల్గొన్నారు.

నియమ, నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు

- పట్టించుకోని అధికారులు
- రెచ్చిపోతున్న బిల్డర్లు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని వినాయక్ నగర్, నేరేడ్ మెట్ డివిజన్‌లలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. అక్రమ నిర్మాణాలపై ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు వాపోతున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపట్ల తీవ్ర అసంతృప్తి, ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నియమ నిబంధనలను అతిక్రమించి అక్రమ నిర్మాణాలు జరగడం టౌన్ ప్లానింగ్ అధికారులకు అది ఓ వరంగా మారిందని స్థానికులు విమర్శిస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు సంబంధించి స్థానికులు ఎవరైనా ఫిర్యాదులు చేసినా, టౌన్ ప్లానింగ్ అధికారులకే లాభం చేకూరుతుందని ఫిర్యాదు దారులు వాపోతున్నారు. ఈ విషయమై ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకు వెళ్లిన ఎవరు స్పందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పలు కాలనీలు చిన్నపాటి వర్షాలకే ముంపునకు గురవుతున్నాయంటే ఇందుకు అక్రమ నిర్మాణాలే కారణమని స్థానికులు చెబుతున్నారు. గత కొద్ది సంవత్సరాలుగా ఆయా డివిజన్‌లలో అనేక కాలనీలు ముంపునకు గురై స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. చిన్నపాటి గల్లీలలో కూడా బహుళ అంతస్తుల భవనాలు నిర్మించడం వల్లే, చిన్న పాటి వర్షం వస్తే వరద నీరు కాలనీలలో చేరి అనేక కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. పేద,మధ్య తరగతి ప్రజలు కట్టుకునే చిన్నపాటి నిర్మాణదారులను, నిబంధనల పేరిట అనేక ఇబ్బందులకు గురి చేసే టౌన్ ప్లానింగ్ అధికారులకు ఇవన్నీ కనిపించడం లేదా..? అని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కనీసం 20 ఫీట్ల రోడ్డు కూడా లేని ప్రాంతంలో ఏకంగా ఐదు అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారంటే, టౌన్ ప్లానింగ్ అధికారులు, నిర్మాణదారులకు ఎంతగా సహకరిస్తున్నారో తెలుస్తోంది. గల్లీలో కనీసం ఒక కారు కూడా లోపలికి వెళ్లడానికి వీలు లేని ఇబ్బందికర పరిస్థితులు ఉన్న ప్రాంతాల్లో గల్లీలో బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయంటే టౌన్ ప్లానింగ్ అధికారులు, అక్రమ నిర్మాణదారులకు ఎంత మద్దతు ఇస్తున్నారో అర్థమవుతోందని స్థానికులు, అధికారుల పని తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై కొరడా చూపించాల్సిన అధికారులే పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలను ఆసరాగా చేసుకుని అక్రమార్జనకు పాల్పడుతూ కాలనీల ముంపునకు కారకులవు తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదులపై స్పందించడం మరచి పోయిన అధికారులు, అక్రమనిర్మాణ దారులకు కొమ్ము కాయడం ఏమిటని ఫిర్యాదు దారులు ప్రశ్నిస్తున్నారు. ఆరంభంలోనే అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయడంలో అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారని కాలనీ వాసులు విమర్శిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది కొందరు బ్రోకర్లతో కుమ్మక్కై చేస్తున్న నిర్వాకం వల్ల జీహెచ్ఎంసీకి వచ్చే వందల కోట్ల రూపాయల ఆదాయానికి గండి పడుతోంది. ఇప్పటి కైనా ప్రభుత్వ ఉన్నతాధి కారులు దృష్టి సారించి అక్రమ నిర్మాణాలపై తగు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

దీనిపై టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్‌ను వివరణ కోరగా తాను ఒక నెల లీవ్‌లో ఉన్నానని, అవి అక్రమమైతే తక్షణమే చర్యలు తీసుకుంటానని తెలిపారు.



నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో క్రిస్మస్ వేడుకలు



నవతెలంగాణ-దుండిగల్

మైసమ్మ గుడిలోని నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో క్రిస్మస్ వేడుకలు సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల చైర్మెన్ జై.నర్సింహారెడ్డి హాజరై మాట్లాడుతూ క్రీస్తు జన్మదిన సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవులందరూ పవిత్రంగా జరుపుకునే పండుగ క్రిస్మస్ అని తెలిపారు. కళాశాల కార్యదర్శి జై త్రిశూల్ రెడ్డి మాట్లాడుతూ ప్రేమ శాంతి సమాజానికి ప్రతీక క్రిస్మస్ అని క్రైస్తవులతోపాటు ప్రపంచ శాంతి సమాధానాన్ని పెంపొందించేందుకే ఆయన భూలోకంలో జన్మించారన్నారు.క్రీస్తు జన్మదినాన్ని ప్రపంచవ్యాప్తంగా జన్మదినాన్ని జరుపుకుంటారని తెలిపారు. ప్రపంచ శాంతి పెంపొందించడానికి ఏసుక్రీస్తు ఈ లోకానికి వచ్చారని కళాశాల ప్రిన్సిపల్ ఆర్.లోకనాథం తెలిపారు. క్రీస్తు జన్మదిన పండుగ వల్ల ప్రజలు శాంతి కరుణ సమాధానం పెంపొందించుకోవాలని తెలిపేదే క్రీస్తు జన్మదిన క్రిస్మస్ పండుగ అని సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి టియల్ రామదాసు తెలిపారు. అనంతరం కళాశాల విద్యార్థులు క్రిస్మస్ తాత వేషధారణలో కళాశాలలో సందడి చేశారు. అందరూ కలిసి క్రీస్తు పుట్టుక గురించి నాట్య, నిత్య రూపకం ద్వారా క్రీస్తు యొక్క గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ జె.నర్సింహారెడ్డి, కోశాధికారి జే.త్రిలోక్ రెడ్డి, డైరెక్టర్ డా.మోహన్ బాబు, ప్రిన్సిపాల్ డాఆర్ లోకనాథం, ఎస్ఎసి డీన్, విభాగాధిపతి సుజిత్, పలు విభాగాధిపతులు, డీన్ అకాడమిక్ డా. వెంకట్రావు అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్ విజేతలకు అభినందనలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

వరంగల్‌లోని ఇండోర్ స్టేడియంలో జరిగిన తెలంగాణ స్టేట్ ఓపెన్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో నాగారం మున్సిపల్ Destroyersclan కిక్ బాక్సింగ్ అకాడమీలో మేడ్చల్ డిస్ట్రిక్ట్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వై.రాజు, బాక్సింగ్ అకాడమీ కోచ్ గుండె అరుణ్ ఆధ్వర్యంలో అకాడమీ విద్యార్థులు 11 గోల్డ్ మెడల్స్, 9 సిల్వర్ మెడల్స్, రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. వారిని మేడ్చల్ కంటెస్టెంట్ ఎమ్మెల్యే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఘట్కేసర్ ఎంపీఈవ ఏనుగు సుదర్శన్ రెడ్డి కలిసి కోచ్ గుండె అరుణ్, విజేతలను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చావ భాస్కర్, భూపాల్ రెడ్డి, చీర వినోద్, కష్టప్రియ, బాలు యాదవ్, సత్యనారాయణ రెడ్డి, వేణుగోపాల్, కిరణ్, అఖిల్, మహేష్, సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రక్తదాన శిబిరం



నవతెలంగాణ-దుండిగల్

మేడ్చల్ మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని మహావీర్ ఇంటర్నేషనల్, సిక్లీ సెల్ సొసైటీ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ మేడ్చల్ - హైదరాబాద్ వారి సహకారంతో కళాశాల సెమినార్ హాల్‌లో,"రక్త దాన" శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో కళాశాల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ రక్తదానాన్ని తల సేమియా వ్యాధిగ్రస్తుల కోసం ఉపయోగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల సెక్రటరీ టివి రెడ్డి, డైరెక్టర్ సరోజ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీలత, పిఆర్వఓ రవి సుధాకర్, ప్రారంభించారు. కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డా. అసం రాజేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హైదరాబాద్ షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్ 2023



నవతెలంగాణ-దుండిగల్

యూట్యూబ్ ఛానెల్ గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్‌ను నిర్వహిస్తోంది. 14-12-2023 గురువారం నాడు తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ TFCC చైర్మెన్ శ్రీ ప్రతాని రామకృష్ణ గౌడ్‌ని PIN TV ఛానెల్ డైరెక్టర్ అఖిల్ రెడ్డి ఆర్గనైజర్ మధుకర్ కలిశారు. ఈ సంవత్సరం నిర్వహిస్తున్న కాంటెస్ట్ గురించి వివరించారు. ఇలాంటి కాంటెస్టులు చిన్న సినిమాలు తీసేవాళ్లకు చాల ప్రోత్సాహకరంగా ఉంటుందని ఈ కాంటెస్ట్ విజయవంతం కావటానికి నా సహకారం ఉంటుందని రామకృష్ణ గౌడ్ చెప్పారు. Short films చిత్రీకరణ కై PINTV వారు ఇచ్చిన అంశాలు. 1. ప్రేమలు-పెళ్లిళ్లు, 2. లింగ వివక్షత, 3. పర్యావరణం, 4. ప్రజాస్వామ్యం-రాజకీయాలు, 5. యువజనులు-సంస్కృతి, 6. విద్య-వైద్యం, 7. మూఢ నమ్మకాలు, 8. సోషల్ అవేర్నెస్.

ఈ 8 అంశాల మీద మొదటి 5 ర్యాంకులు వచ్చిన ఫిలిమ్స్‌కి నగదు బహుమతులు, 6 నుంచి 15వ ర్యాంక్ పొందిన చిత్రాలకు ప్రత్యేక మెమెంటోలు ఇస్తారు. Short film సమయం/వ్యవధి: 30 నిమిషాల వరకు, భాష: తెలుగు మాత్రమే. నమోదు/ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ 25 డిసెంబర్ 2023, నిర్వాహక వేదిక: సుందరయ్య భవన్, ప్రగతి నగర్, రిజిస్ట్రేషన్ కోసం సంప్రదించాల్సిన వారు - డైరెక్టర్ : అఖిల్ రెడ్డి, Contact no-7416500946.

ఎమ్మెల్యే మర్రికి అభినందనలు



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి ఎమ్మెల్యేగా గెలుపొందిన మర్రి రాజశేఖర్ రెడ్డిని శుక్రవారం బోయిన్ పల్లి సౌజన్య కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారుడు జేఏసీ వెంకన్నతో పాటు అల్తాఫ్‌లు మర్రిని కలిసి బొకే అందజేసి, శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ మల్కాజిగిరి నియోజకవర్గంలో అసాధారణ విజయాన్ని అందించడానికి అహర్నిశలు కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తల శ్రమను ఎప్పటికీ మర్చిపోనని, నిత్యం ప్రజల్లో ఉంటూ, మల్కాజిగిరిని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిస్తానని తెలిపారు.

సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న గాంధీ



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని గోదాకృష్ణ ఫంక్షన్ హాల్‌లో జరిగిన క్రిస్టమస్ వేడుకల సందర్భంగా జరిగిన సెమి క్రిస్టమస్ వేడుకలలో, ఎమ్మెల్సీ రాజేశ్వరరావు, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగరావులతో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ క్రిస్టమస్ కేక్ కట్ చేసి, క్రిస్టియన్ సోదర సోదరమణులకు ముందస్తు క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రిస్టమస్ వేడుకలలో పాల్గొనడం, చాలా సంతోష కరంగాఉందన్నారు. ఆ దేవుడి కృప వలన ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. క్రిస్మస్ సంబరాలను ఘనంగా నిర్వహించుకోవలని, ప్రతి ఒక్కరుసంతోషంగా పండుగను జరుపుకోవాలని తెలిపారు. ఎంతో పవిత్రంగా భావించే క్రిస్మస్ పండుగను అంగరంగ వైభవంగా జరుపుకోవాలని తెలిపారు. అర్హులైన ప్రతి పేద వారికీ అనేక సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే గాంధీ తెలియచేసారు. ఆల్విన్ కాలనీ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సమ్మారెడ్డి, ఆల్విన్ కాలనీ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ గౌరవ అధ్యక్షులు అనిల్ రెడ్డి, పాస్టర్లు, క్రిస్టియన్ సోదరి సోదరమణులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి శరగడం నర్సింగ్‌రావు రాజీనామా



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకులు, మేడ్చల్ జిల్లా కార్మిక విభాగం జాయింట్ కన్వీనర్ శరగడం నర్సింగరావు బీజేపీకి సభ్యత్వానికి, కార్మిక విభాగం జాయింట్ కన్వీనర్ పదవికి శుక్రవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన గాజులరామారంలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా బీజేపీలో క్రియాశీలకంగా అంకితభావంతో పనిచేస్తున్నానని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌తో పాటు ఆయన సమక్షంలో పార్టీలో చేరడం జరిగిందన్నారు. నా వ్యక్తిగత కారణాలవల్ల పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

నేటి విద్యార్థులే భావితరాల దిశా నిర్దేశకులు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి
- ఉల్లాసంగా, ఉత్సాహంగా సెయింట్ మార్టిన్ పాఠశాల 25వ వార్షికోత్సవ వేడుకలు సిల్వర్ జూబ్లీ



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

నేటి విద్యార్థులే భావితరాల దిశా నిర్దేశకులని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం చింతల్ డివిజన్ పరిధి శ్రీ సాయి కాలనీలోని సెయింట్ మార్టిన్స్ హై స్కూల్‌లో నిర్వహించిన 25 వ వార్షికోత్సవ" సెలెస్టియల్ క్రెసెండో "కార్యక్రమానికి ఆయనతోపాటు స్థానిక ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్, ఆర్టిస్ట్ పరోడి గురుస్వామి, పాఠశాల బోర్డు సభ్యుల బృందం ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ కష్టపడి చదివితేనే కలలు తప్పక సాకారం అవుతాయని తెలిపారు. చదువుతోపాటు, క్రీడలు, శాస్త్ర, సాంకేతిక రంగాలలో రాణించి దేశ ప్రతిష్టను ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. స్థానిక ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద ్దడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమన్నారు. వారి మనోభావాల కనుగుణంగా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో శిక్షణ పొందినట్లయితే మానసిక దృఢత్వంతో పాటు శారీరక ఉల్లాసం పొందవచ్చన్నారు. అనంతరం విద్యలో, సాంస్కృతిక, విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతు లను వారు ప్రధానం చేశారు. విద్యార్థులు చేసిన సంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో బోర్డు వైస్ ప్రెసిడెంట్ జి.చంద్రశేఖర్ యాదవ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు జి.రాజశేఖర్ యాదవ్, జి. జై కిషన్ యాదవ్, ప్రిన్సిపల్ అనితరావు చెప్యాల, బీఆర్ఎస్ డివిజన్ మాజీ అధ్యక్షులు మొహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

దేశ ఐక్యతను చాటిన సర్దార్ వల్లభాయ్ పటేల్



కార్పొరేటర్ శ్రావణ్

నవతెలంగాణ-మల్కాజిగిరి

స్వాతంత్ర్య సమరయోధులు, నవభారత నిర్మాణ రూపకర్త, భారత తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం మల్కాజిగిరి పటేల్ నగర్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దేశ ఐక్యతను చాటిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని, దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సోమా శ్రీనివాస్, రామకృష్ణ, వికే మహేష్, నరసింహ గౌడ్, డిఎస్ వెంకటేష్, నందు యాదవ్, సునీల్ యాదవ్, ఆర్ కె శ్రీనివాస్, రమేష్ గౌడ్, బాలచందర్, శ్రీకాంత్, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని వడ్డేపల్లి రాజేశ్వర్ రావు క్యాంపు కార్యాలయంలో, ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు పాల్గొని చిత్రపటానికి పూలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భారత స్వాతంత్ర్య సమరంలో సర్దార్ పటేల్ చేసిన కృషి అపూర్వమని అన్నారు. ఆయన ఆశయాల సాధనకై కృషి చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ గౌడ్, బీజేవైఎం స్టేట్ సోషల్ మీడియా కన్వీనర్ అక్కినపల్లి సాయి, శంకర్ రెడ్డి, వినయ్, ఫణీంద్ర, సంతోష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సహకారంతోనే అభివృద్ధి సాధ్యం



కార్పొరేటర్ రావుల శేషగిరి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రజల సహకారాలతోనే గాజులరామారం డివిజన్‌లో అభివృద్ధి సాధ్యపడుతుందని గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ పరిధి రావి నారాయణరెడ్డి నగర్ ఫేస్(2) పరిధిలో డ్రయినేజీ పనులను స్థానికులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు ఇబ్బందులు పడకుండా డ్రయినేజీ పనులు వేగవంతంగా చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మురళీకృష్ణ, రాజేందర్, చెట్ల వెంకటేష్, బుల్లెట్ శ్రీనివాస్, టెంపుల్స్ శ్రీనివాస్, గోవింద్, తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



చెన్నూరు అసెంబ్లీలో నియోజకవర్గం ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షులు పి నాగిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు చంద్రి కొండల్ రెడ్డిలు కలసి శుభాకాంక్షలు తెలియజేశారు.
నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

వీసీపై విచారణ జరిపించాలని ఆమరణ నిరాహార దీక్ష



నవతెలంగాణ-ఓయూ

ఓయు వీసీ ప్రొ.రవీందర్‌పై విచారణ జరిపించాలని శుక్రవారం ఓయూలో విద్యార్థి నాయకుడు మోతిలాల్ ఆమరణ నిరాహారదీక్షను ప్రారంభించారు. ఓయూ వీసీ రవీందర్ పాల్పడిన అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఓయూ వీసీ రాజీనామా చేసేంతవరకు దీక్ష కొనసాగిస్తామని హెచ్చరించారు.

స్పోర్ట్స్ కోటాను భర్తీ చేయాలి : సతీష్ గౌడ్



నవతెలంగాణ-ఓయూ

2019లో నిర్వహించిన పంచాయతీ కార్యదర్శి పోస్టులను స్పోర్ట్స్ కోటాలో 172 పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిందని, కానీ గత నాలుగు సంవత్సరాల నుంచి క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటాలో 172 పోస్టులను కేటాయించలేదని తెలంగాణ క్రీడా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మట్టపల్లి సతీష్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. పలుమార్లు పంచాయతీరాజ్ శాఖ వారిని కలి సిన ఎటువంటి లాభం లేకుండా పోయిందని, ప్రస్తుత పంచాయతీరాజ్ మినిస్టర్ ధనసరి సీతక్క చొరవ తీసుకొని స్పోర్ట్స్ కోటాలో పంచాయతీ కార్యదర్శులను నియామకం జరిపించాలని వారు ఈ సందర్భంగా కోరుతున్నారు.

ఓయూ వీసీ రవీందర్ అవినీతి అక్రమాలపై సిట్టింగ్ జడ్జి చేత విచారణ చేపట్టాలి

- ఓయూ బహుజన విద్యార్థి సంఘాలు, బహుజన జేఏసీ డిమాండ్



నవతెలంగాణ-ఓయూ

ఓయూ వీసీ ప్రొ.రవీందర్‌పై అవినీతి అక్రమాలపై సిట్టింగ్ జడ్జ్ చేత విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని ఓయూ బహుజన విద్యార్థి సంఘాలు, బహుజన జేఏసీ డిమాండ్ చేశా రు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మొత్తం యూనివర్సిటీలను ఉన్నత విద్యను సర్వనాశనం చేసిందని, జీవో నెంబర్ 45ను రద్దు చేయాలని, యూనివర్సిటీల అటానమస్‌ను కాపాడాలని, యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగాల భర్తీని వెంటనే చేపట్టాలని శుక్రవారం ఓయూలో మెయిన్ లైబ్రరీ నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వ ర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల సంజయ్ మాట్లాడుతూ కొత్త ప్రభుత్వ ఏర్పాటు నిరుద్యోగుల విజయమని, ప్రభుత్వ ఉద్యోగుల వయోపరిమితిని 58 సంవత్సరాల నుంచి 61 సంవత్సరాలకు పెంచడంతో విద్యార్థి నిరుద్యోగులకు, ప్రభుత్వ ఖజానాకు విపరీతంగా నష్టం వాటిల్లుతుందన్నారు. టీఎస్పీఎస్సీ గ్రూప్ 4 ఉద్యోగాలను ఆటానమస్ బాడీ కలిగిన యూనివర్సిటీలకి అప్పగించాలని కోరారు. ప్రభుత్వ వర్సిటీలలో చదివేవారు అంతా పేద దిగువ మధ్యతరగతి విద్యార్థులు వీరికి నాణ్యమైన విద్య అందని ద్రాక్షగా మారిందని, అంతేకాకుండా గత ప్రభుత్వం విద్యార్థులకు స్కాలర్‌షిపులు, ఫెల్లో షిప్‌లు ఇవ్వకపోవడం వలన అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఓయూ వీసీ పై అవినీతి అక్రమాలకు అంతేలేకుండా పోయిందని, సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని ఓయూ వీసీ రవీందర్ అవినీతి అక్రమాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి తగు చర్యలు తీసువాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన విద్యార్థి సంఘాల నాయకులు జంగిలి దర్శన్ స్టేట్ కోఆర్డినేటర్, బీఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షులు అంబేద్కర్, బీఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పులిగంటి వేణుగోపాల్, భాస్కర్, కృష్ణ, విజయ్, సంతోష్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

లైంగికదాడి కేసులో నిందితుడికి 20 ఏండ్ల జైలు

- రూ. 30 వేల జరిమానా విధించిన కోర్టు
- అధికారులను ఘనంగా సన్మానించిన సీపీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రేమపేరుతో మాయమాటలు చెప్పి బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డ నిందితుడికి న్యాయస్థానం 20ఏండ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.30వేల జరిమానా విధించింది. శుక్రవారం రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కొంగర రావిర్యాల గ్రామానికి చెందిన పందుల నాగరాజు ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ కర్మన్‌ఘాట్‌లో నివాసముండేవాడు. తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికపై కన్నేసిన నిందితుడు మాయమాటలతో దగ్గరయ్యాడు. 2019లో ప్రేమ పేరుతో బాలికను ఇబ్రహీంపట్నం సాగర్ రహదారి పక్కన ఓ నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. జరిగిన ఆఘాయిత్యాన్ని మైనర్ ఇంట్లో చెప్పింది. బాధితుల ఫిర్యాదుతో (ప్రస్తుతం ఏసీపీ) ఇన్‌స్పెక్టర్ ఇ.శ్రీనివాస్ రెడ్డి నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. కేసును విచారించిన రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి పద్మావతి గురువారం తుది తీర్పు వెల్లడించారు. కోర్టులో నిందితుడికి శిక్షపడేవిధంగా అన్ని సాక్ష్యాలను సేకరించిన ఏసీపీ ఇ.శ్రీనివాస్ రెడ్డితోపాటు హెడ్‌కానిస్టేబుల్ జే.చందర్‌రావు, కానిస్టేబుల్ రవి, అదనపు పీపీ సునితాను సీపీ ప్రత్యేకంగా అభినందించారు. శుక్రవారం నేరేడ్ మెట్‌లోని రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో శాలువాతో వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ ఎస్‌హెచ్‌ఓ, ఎల్బీనగర్ ఏసీపీ తోపాటు డీసీపీ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ల పదోన్నతులలో జరిగిన అవకతవకలపై
సమగ్ర విచారణ జరిపించాలి



నవతెలంగాణ-ఓయూ

ఓయూలో సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతులలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి అవకతవకలకు పాల్పడిన వారిపైన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఓయూ అధ్యక్ష కార్యదర్శులు లెనిన్, నెల్లి సత్య డిమాండ్ చేశారు. అనంతరం శుక్రవారం ఆర్ట్స్ కళాశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ ఓయూ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమంగా సీనియర్ ప్రొఫెసరైన వాళ్ళను వెంటనే తొలగించి అర్హత కలిగిన వాళ్లకు సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇప్పటి వరకు 53 మంది సీనియర్ ప్రొఫెసర్ల కోసం దరఖాస్తు చేసుకోగా 51 మంది ప్రొఫెసర్లకు సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించారన్నారు. కొంత మంది ప్రొఫెసర్లు తమవి కానీ రీసెర్చ్ ఆర్టికల్స్ ను తమవి అని చెప్పుకొని సీనియర్ ప్రొఫెసర్లు గా పదోన్నతులు పొం దారన్నారు. యూనివర్సిటీలోని ఈ నిబంధనలు పాటించకుండా పదోన్నతలు కల్పించినవారిపై సమగ్ర విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల విద్యార్థులతో ఉద్యమాలు చేస్తామని వారు తెలియజేశారు.

స్టార్టప్ ఫెస్ట్ 2024-పోస్టర్స్ విడుదల చేసిన వీసీ



నవతెలంగాణ-ఓయూ

ఓయూ వేదికగా ఉస్మానియా-ఇండియా స్టార్టప్ ఫెస్ట్ 2024" నిర్వహించనున్నట్లు ఓయూ వీసీ ప్రొ. రవిందర్ తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య పి. లక్ష్మినారాయణ, ఓయూ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ విజయ్ కుమార్ దేవరకొండ, టై గ్రాడ్ ఛైర్మన్ భానుప్రకాశ్, సాఫ్ట్ వేర్ టెక్నాలజీస్ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్.టి.పి.ఐ) వ్యవస్థాపకుడు డాక్టర్ జె. ఎ చౌదరి ఆధ్వర్యంలో శుక్రవారం పోస్టర్ విడుదల చేశారు. బలమైన స్టార్టప్ వాతావరణాన్ని పెంపొందించడానికి, ఈ ప్రాంతంలో నిధులు, మార్గదర్శకత్వాన్ని సులభతరం చేయడానికి, ఇండియా స్టార్ట్-అప్ ఫౌండేషన్, ఉస్మానియా ఫౌండేషన్ కలిసి పనిచేయాలన్నారు. స్టార్టప్ కంపెనీలు, పారిశ్రామికవేత్తలు, వక్తలు, సలహాదారులు, పెట్టు బడిదారులు ఒకే వేదికను పంచుకునే విధంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణతో పాటు భారత నలుమూలల నుంచి స్టార్టప్ కంపెనీలు పాల్గొనే విధంగా ప్రణాళిక సిద్ధం చేశారు. ఉస్మానియా ఫౌండేషన్, ఇండియా స్టార్టప్ ఫౌండేషన్ సంబంధాలు మరింత మెరుగుపడేందుకు ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు. డాక్టర్ జేఏ చౌదరి భాగస్వామ్యం పట్ల ఓయూ ఆనందం వ్యక్తం చేశారు. డాక్టర్ జేఏ చౌదర్ బెంగుళూరు, హైదరాబాద్, చెన్నైలో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ పార్క్స్ ఆఫ్ ఇండియాని స్థాపించారు. హైదరాబాద్, సైబరాబాద్ ఐటి పర్యావరణ వ్యవస్థల అభివృద్ధిలో ఆయన ప్రధాన పాత్ర పోషించారన్నారు.

సమష్టి కృషితోనే భారీ మెజారిటీతో గెలిచాను

- బీఆర్ఎస్ సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

నియోజకవర్గంలో ప్రతి ఒక్కరి సహకారం, సమష్టి కృషితోనే తాను సనత్‌నగర్ నియో జకవర్గం నుంచి భారీ మెజార్టీతో శాసనసభ్యుడిగా గెలుపొందానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తల సాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం అమీర్‌పేటలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాల యంలో టిల్లుబాయ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ఏర్పాటు చేసిన గెట్ టు గెదర్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ తన గెలుపు కోసం ఎంతో శ్రమించిన ప్రతిఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలియ జేశారు. మీకు ఎల్లప్పుడు అండగా ఉం టానన్నారు. పలువురు ఆశావర్కర్ మహిళ లకు చీరలు, పలువురుయువకులకు రెయిన్ కోట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషు కుమారి, నాయకులు మధు, బాగిందర్ సింగ్, సుమిత్ సింగ్, కూతురు నర్సింహ, ప్రవీణ్ రెడ్డి, కర్ణాకర్ రెడ్డి, హరిసింగ్, రాజేశ్వరి, అనిత, లక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ పరిధిలో ప్రారంభించిన పనులను వెంటనే పూర్తి చేయాలి



నవతెలంగాణ-కంటోన్మెంట్

డివిజన్ పరిధిలో ప్రారంభించిన పనులను, శంకుస్థాపన చేసిన పనులను వెంటనే పూర్తి చేయాలని, దానికి సంబంధించిన అధికారులపై ఒత్తిడి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. ఓల్డ్ బోయినపల్లి డివిజన్‌లో కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పలు అభివృద్ధి పను లపై చర్చించారు. వారు మాట్లాడుతూ ఎన్నికలలో నాయకులు మహిళా నాయ కురా లు, కార్యకర్తలు కష్టపడి పని చేశారని, ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు నరేందర్‌గౌడ్, కర్రే జంగయ్య, కర్రే లావణ్య, మాక్కలా నర్సింగరావు, బల్వంత్‌రెడ్డి, సయ్యద్ ఇజాజ్, హరినాథ్, లలిత కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

'మహాలక్ష్మి'కోసం ప్రత్యేక అధికారులను నియమిస్తాం

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

మహాలక్ష్మి పథకం కోసం ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేక అధికారులను నియమిస్తామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆర్డీవోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తాసిల్దారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహించే ప్రజా దర్బార్ కార్యక్రమాలకు అధికారుల టీంలను నియమించాలని సూచించారు. ల్యాండ్ బ్యాంక్ జాబితాలను సిద్ధం చేయా లని తహసీల్దారులను కలెక్టర్ ఆదేశించారు. కోర్టు కేసులను త్వరగా పూర్తి చేయాలని, ల్యాండ్ బ్యాంక్, కోర్టు కేసులకు సంబంధించి ఇంటిగ్రేటెడ్ కోర్టు కేసు మేనేజ్ మెంట్ సిస్టంను అభివృద్ధి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఎలినేషన్ ప్రతిపాదనలు తయారు చేయాలని, మీ సేవలో మిగిలి వున్న పనులను త్వరగా పూర్తిచేయా లన్నారు. ఆసరా పింఛన్లకు ఫోన్ నెంబర్, ఆధార్ నెంబర్, బ్యాంక్ ఖాతా లను అనుసంధానం చేయాలని, కల్యాణ లక్ష్మి, షాదీ ముబా రక్‌లను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్, డీఆర్వో వెంకటాచారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే
సమస్యలు పరిష్కారమయ్యాయి



- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

తెలంగాణ ప్రభుత్వ హయాంలోనే సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిం చామని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ గుర్తుచేశారు. సనత్ నగర్ నియోజకవర్గం నుండి మూడవసారి భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్‌లకు చెందిన పార్టీ నాయకులు, వివిధ కాలనీల ప్రతినిధులు వెస్ట్ మారేడ్ పల్లిలోని తన నివాసంలో కలిసి పుష్పగుచ్చాలను అందజేసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పీజీ రోడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు పీజీ రోడ్డులో సరైన రోడ్లు, డ్రయినేజీలు లేక వర్షాకాలంలో స్థానిక ప్రజలే కాకుండా వాహనదారులు కూడా తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, తాను వచ్చిన తర్వాతనే సుమారు రూ.40 కోట్ల వ్యయంతో డ్రయి నేజీ వ్యవస్థను మెరుగుపర్చామన్నారు. వైట్ టాపింగ్ రోడ్లను నిర్మించి అద్భుతంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. అదేవిధంగా నాలాలో పూడిక తొలగింపు, నూతనంగా వంతెనలను నిర్మించి వర్షాకా లంలో వరద ముంపు సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపినట్లు వివరించారు. పీజీరోడ్‌వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్, సంజయ్ పత్తిపాక, గోపాల్, రోచా బాయ్, నవీన్ షా, బర్కత్ బాయ్, దీపక్, శృతి పత్తిపాక, జగదీశ్ ప్రసాద్ వర్మ తదితరులు తలసాని శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించి శుభాభినందనలు తెలిపారు.

పటేల్‌కు ఘన నివాళులు



నవతెలంగాణ-ఓయూ

ఉక్కుమనిషి, మాజీ ఉపప్రధాని, దేశ తొలి హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి నిర్వహించారు. శుక్రవారం హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ రామంతపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణీ వెంకట్‌రావులు శుక్రవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

గృహకార్మికులకు గుర్తింపు కార్డుల జారీ తప్పనిసరి



నవతెలంగాణ-బంజారాహిల్స్

తెలంగాణలోని పదకొండు లక్షల మంది గృహ కార్మికుల హక్కులను పరిరక్షించడానికి సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని డొమెస్టిక్ వర్కర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు వర్గీస్ తెకనాథ్, పిఓడబ్ల్యుఎల్‌యూ సంధ్యతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు ఆరు లక్షల మంది గృహ కార్మికులు ఉండగా కేవలం హైదరాబాద్‌లోనే ఐదు లక్షలు ఉన్నారని , కార్మి కులను కార్మికులుగా గుర్తించడానికి లేదా వారి హక్కులను రక్షించడానికి ఎటువంటి చట్టం లేదన్నారు. గృహ కార్మికుల పని పరిస్థితులు, యజమానుల నమోదు,గుర్తింపు కార్డుల జారీ, తప్ప నిసరిగా చేయాలని సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి తదితర అంశాలను చట్టంలో పొందు పర్చాలని డిమాండ్ చేశారు. సన్నిహిత డైరెక్టర్ ఉష జయప్రద మాట్లాడుతూ మహిళా ఉద్యమంలో గృహ కార్మికుల ఉద్యమం ముఖ్యమైన భాగమని తెలియజేసారు. రాష్ట్రంలో 8 గం టల పనికి కనీస వేత నాన్ని నెలకు రూ. 12 వేలకు సవరించాలని యూనియన్ డిమాండ్ చేసింది. గృహ కార్మికులకు జీవిత, ఆరోగ్య బీమా కల్పించాలని యూనియన్ డిమాండ్ చేస్తూ, ఇంటి పనివారితో సహా అసంఘటిత కార్మికులకు ఈఎస్ఐని వర్తింపజేయడానికి ఈఎస్ఐ చట్టాన్ని సవరించే తీర్మానాన్ని తీసుకురావడానికి రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేయాలి అని తెలిపారు. పీఓడబ్ల్యు సంధ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుండి మైగ్రేట్ అయ్యి పట్టణ, నగర ప్రాంతాలకు వస్తున్న గృహకార్మికులకు కష్టమైన పని ప్రదేశాలు ఎదురవుతున్నాయని తెలి యజేశారు. ఇతర దేశాలకు గృహ కార్మికులను అత్యధికంగా పంపే దేశం కూడా భారతదేశమేనని, దురదృష్టవశాత్తూ అంతర్జా తీయ కార్మిక సంస్థ (ఐఎల్ వో) కన్వెన్షన్ 189ను 2011లో ఆమోదించి 12 ఏండ్లు గడుస్తున్నా భారత్ ఇంకా ఆమోదించలేదన్నారు. పార్లమెంటు ఆమోదించిన నాలుగు లేబర్ కోడ్‌లలో కూడా డొమెస్టిక్ వర్కర్స్‌ను స్పష్టంగా చేర్చలేదన్నారు. కొత్త రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన సమస్యలు చాలా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సన్నిహిత ఉష జయప్రద, గృహ కార్మికుల యూనియన్ నాయకులు మంజుల, సిస్టర్ లుర్దు మేరీ,సంధ్య, మాధురి, రమ్య శోభ తదితరులు పాల్గొన్నారు.

18న కొరివి వీర భద్రస్వామి కల్యాణ మహోత్సవం



నవతెలంగాణ-బంజారాహిల్స్

కొరివి వీరభద్ర స్వామి కళ్యాణ మహోత్సవం కర్మన్‌ఘాట్, ఏపీ ఆర్ గార్డెన్స్‌లో నిర్వహి స్తున్నట్లు సేవా సమితి వ్యవస్థాపకులు కాసుల అనసూయ, అధ్యక్షులు షాబాద్ వెంకటేశంలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి కాసుల వినోద్, వారసు స్టేషన్ అధ్యక్షులు బురం శంకర్‌లతో కలిసి బ్రోచర్‌ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి డోర్నకల్ ఎమ్మెల్యే రామ చంద్ర నాయక్ హాజరవుతారని, అలాగే మంత్రి కొండా సురేఖను ఆహ్వానించామని తెలిపారు.

టాయిలెట్స్ పనులు ప్రారంభం



నవతెలంగాణ-బేగంపేట

సనత్ నగర్ డివిజన్ బికెగూడ పార్కులో టాయిలెట్స్ లేకపోవడం వలన వయోవృద్ధులు చాలా ఇబ్బంది గురవుతున్నారని, సీనియర్ సిటిజన్ కౌన్సిల్స్ సభ్యులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ దృష్టి తీసుకెళ్లారు. ఎన్నికల ముందు స్థానిక కార్పొరేటర్ కొలను లక్ష్మీ బాల్‌రెడ్డితో కలిసి శుక్రవారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసంలో వెళ్లి బీకేపార్కులో మాకు టాయిలెట్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే కార్పొరేటర్ కి పనులు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు. బికే గుడా పార్కులో టాయిలెట్స్ ఫౌండేషన్ పనులు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే తలసానికి వయోవృద్ధులు అందరు కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కోలను బాల్‌రెడ్డి, ఇంజనీరింగ్ సెక్షన్ అధికారులు జెఈ సందీప్, సూపర్వైజర్ అన్వర్, సీనియర్ సిటిజన్ కౌన్సిల్స్ అధ్యక్షులు మాణిక్‌రావు పాటిల్ , సహదేవ్ గౌడ్, మాధవరావు, కుమార్, యాదగిరి, లింగమయ్య, బాలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధనకు 21న చలో ఢిల్లీ



- మోడీ ప్రభుత్వం పై మాదిగల తిరుగుబాటు
- చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఓయూ

ఎస్సీ వర్గీకరణ సాధనకై ఈనెల 21న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించి బీజేపీ మెడలు వంచి ఎస్సీ వర్గీకరణ సాధించే దిశగా మాదిగలంతా సిద్ధపడాలని యంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొల్లూరి వెంకట్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రభుత్వంపై తిరుగుబాటుకై ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద లక్షలాదిగా తరలివచ్చి మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలకు శుక్రవారం ఆర్ట్స్ కళాశాల ఎదుట చలోఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు కొల్లూరి వెంకట్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వరిగడ్డి చందు మాట్లాడుతూ మాదిగల చిరకాల స్వప్నమైన ఎస్సీ వర్గీకరణ విషయంలో వంద రోజుల్లో వర్గీకరణ చేస్తానని మాట తప్పిన బిజెపి పార్టీకి మోడీ ప్రభుత్వం కమిటీల పేరుతో ఎస్సీ వర్గీకరణ విషయంలో కాలయాపన చేస్తుందన్నారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ద కల్పించి నిజంగా మోడీ ప్రభుత్వానికి మాదిగలపై ఉన్న చిత్తశుద్ధితో నిరూపించుకోవాలని సవాలు విసిరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు అల్ యూనివర్శిటీ ప్రెసిడెంట్ జన్నారపు జీవన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మారం శ్రీకాంత్,హైదరాబాద్ అధ్యక్షులు కానుగాంటి సురేష్,వర్కింగ్ ప్రెసిడెంట్ వెంపటి శ్రీకాంత్,ఓయు కార్యదర్శి రఘు,నాయకులు మని,మహేష్,సత్యం, కిషోర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్ ఎండీ అరెస్ట్..



నవతెలంగాణ-సిటీబ్యూరో

వీఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్ ఎండీ నగునూరి రాజేష్ అరెస్ట్ అయ్యాడు. వందల మంది నుంచి 24 కోట్ల రూపాయల వసూలు చేసి ఎగ్గొట్టినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయనపై సీసీఎస్‌లో ఫిర్యాదు నమోదైంది. ప్లాట్లు, డిపాజిట్ల పేరుతో రాజేష్ డబ్బులు వసూలు చేసినట్టు బాధితులు చెబుతున్నారు. అధిక మొత్తంలో వడ్డీలు ఇస్తానంటూ రాజేష్ మోసాలకు పాల్పడ్డాడని వారు ఆరోపిస్తున్నారు. గత కొంతకాలం నుంచి పరారీలో ఉన్న రాజేష్‌ను సీసీఎస్ పోలీసులు పట్టుకున్న అరెస్టు చేశారు. .

కన్నా రావు గళం సుస్వర లయ బద్ధం



నవతెలంగాణ-కల్చరల్

కన్నా రావు గళం సుస్వర లయ బద్ధం అని, ఆయన గానం ఘంటసాల పాటను మరిపిస్తుందని ప్రముఖులు ప్రశంసించారు. ప్రముఖ మహిళా సాంస్కృతిక సంస్థ రాగ రాగిణి నిర్వహణ లో శ్రీ త్యాగరాయ గాన సభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై ప్రముఖ గాయకుడు డాక్టర్ అమలాపురం కన్నారావుకు సత్కారం, ఘనా ఘన గాయక పేరిట ఘంటసాల సినీ యుగళ గీత విభావరి జరిగింది. వర్ధమాన గాయని రమణ కుమారి అంబా దాస్,ఎాహన కష్ణ,చంద్ర శేఖర్, వేణుగోపాల్ కనక శైలజ,లలిత,రాజశ్రీ తదితరులు ఘంటసాల సుశీల లీల జిక్కి జానకిలతో కలసి పాడిన గీతాలు మధురంగా ఆలపించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా దూరదర్శన్ పూర్వ సంచాలకుడు డాక్టర్ పాలకుర్తి మధుసూదన్‌రావు పాల్గొని కన్నా రావు ను సత్కరించి మాట్లాడారు. ఆకాశ వాణి దూరదర్శన్‌లలో ఏ గ్రేడ్ కళాకారునిగా విఖ్యాత నాట్య గురువు శోభా నాయుడు నత్య రూపకాలుకు గాన సహకారం అందించి రూపకాలను రక్తి కట్టించారని వివరించారు.దక్షిణ మధ్య రైల్వే విశ్రాంత జనరల్ మేనేజర్ సీ రామ కష్ణ మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా కన్నారావు వివిధ వేదిక లపై ఘంటసాల పాటలు పాడి తెలుగు వారిని అలరిస్తున్నారని అన్నారు. సంగీత కళా కారుడు పాలగుమ్మి రాజ గోపాల్ పాల్గొన్నారు

ఎట్టకేలకు కదలిన కమిటీ

- ఓయూలో సీనియర్ ప్రొఫెసర్స్ పదోన్నతులపై కమిటీ తొలి భేటీ..!
- ఓయూ సీనియర్ ప్రొఫెసర్స్ పదోన్నతుల దర్యాప్తునకు సిట్టింగ్ జడ్జి లేదా సీనియర్ ఐఏఎస్‌తో విచారణతోనే నిజానిజాలు బహిర్గతం...
- ఇప్పుడు ఉన్న కమిటీ కంటి తుడుపునకేనా..?



నవతెలంగాణ-ఓయూ

ఓయూలో సీనియర్ ప్రొఫెసర్స్ పదోన్నతులపై గత ప్రభుత్వం ఉన్నత విద్యా శాఖ ఆధ్వర్యంలో నవంబర్ 15న కమిటీ ప్రో.లింబాద్రి చైర్మెన్‌గా 293 జీఓ ద్వారా ఏర్పాటు చేసి మరలా నవంబర్ 28న, మాజీ వీసీ ప్రో.తిరుపతి రావు చైర్మెన్‌గా 294 జీఓ ద్వారా మళ్ళీ కమిటీ ఏర్పాటు చేసిన కమిటీ తెలిసిందే. అయితే ఇన్నాళ్లకు ఈ కమిటీ గురువారం భేటీ అయినట్టు సమాచారం. అయితే ఓయూలో విద్యార్థులు, ప్రొఫెసర్స్ మాత్రం మొత్తం ఈ వీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ కేటగిరీల ఐదు సీఎఎస్ ప్రమోషన్స్ దరఖాస్తులు,యూజీసీ 2018 నిబంధనల ప్రకారం పునఃపరిశీలిస్తే నిజా నిజాలు మరిన్ని నిగ్గు తెలిస్తే వివిధ కేటగిరీల్లో అర్హతలు లేకున్నా పదోన్నతులు పొందిన వారిలో 15 నుంచి 20 మంది పై వేటు పడే అవకాశం ఉందనే అభిప్రా యాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ పదోన్నతుల్లో "అయిన వాడికి అందలం పగోనికి కానివాడికి పాతాళంకు " అనే సామెత మాదిరిగా ప్రతీకార చర్యల్లో భాగంగా ఉన్నాయి అని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఇది నామమాత్రల కమిటేనా.. ?

కమిటీ ఏర్పాటు, ఇక్కడ ఉన్న సభ్యులపై పెదవి విరుస్తున్నారు కారణం వీరు కూడా సహచర ఆచార్యులే, అలాగే సాన్నిహిత్యం గల వారు. దాంతో విచారణ నామమాత్రంగా జరిగే అవకాశం ఉందని అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇందులో ఒకరు గత వీసీల ఎంపిక కమిటీలో ఉండి ప్రభుత్వం చెప్పినట్టు ఫైల్స్ పరిశీలించకుండా అమెదముద్ర వేయడంతో నాడు కొందరు అనర్హులైన ఆచార్యులు వీసీలుగా వచ్చారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నిజానిజాలు నిగ్గు తేల్చాలంటే సిట్టింగ్ జడ్జి లేదా ఐఏఎస్ తో విచారణ కమిటీ

నిజా నిజాలు నిగ్గు తేల్చాలంటే సిట్టింగ్ జడ్జి లేదా సీనియర్ ఐఏఎస్ అధికారితో కమిటీ ఏర్పాటు చేసి నూతన రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని పలువురు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఇలా చేస్తే సమగ్రంగా విచారణ జరిగి అసలు విషయాలు, వ్యక్తుల ప్రమేయాలు, వ్యక్తిగత కక్షపూరిత చర్యలు, ఆశ్రిత పక్షపాతం, ఫేక్ పేపర్స్ ,యూజీసీ కేర్ లిస్ట్‌లో లేని పరిశోధన పత్రాలు బహిర్గతం అవుతాయి.

అనర్హులకు పదోన్నతులతో పరువు గాలికి, వర్సిటీకి ఆర్థిక భారం..

అనర్హులకు పదోన్నతులు ఇవ్వడంతో పదోన్నతుల వలన పెరిగే ఆర్థిక భారం ప్రస్తుత పరిస్థితుల్లో వర్సిటీ భరించలేని పరిస్థితి ఉందని, పరువు ప్రతిష్టాతలు దిగజార్చటమే అని ఇది కొంత ఆర్థిక లావాదేవీలతో ముడిపడి ఉన్న వ్యహారం కాబట్టి దీనిని అవినీతి కేసు కోణంలో పరిగణించి రెగ్యులర్ ఏసీబీతో విచారణ జరిపిస్తే అది ఆర్థిక క్రమశిక్షణకు, ఇకపై పొరపాట్లు జరగకుండా ఉండడానికి దోహదపడుతుందని మేధావి వర్గం అభిప్రాయం వ్యక్తం చేస్తోంది.

దరఖాస్తులు అన్ని లోతుగా పరిశీలించాలి..

పదోన్నతులు పొందిన అధ్యాపకుల దరఖాస్తులను ఒక నిపుణుల కమిటీ పరిశీలించగా ఈ పరిశీలనకు అవసరమైన నిపుణులను చైర్మెన్‌గా ఉన్నవారు ఎంపిక చేస్తారు. అయితే ఒక అధికారి తానే స్వయంగా దరఖాస్తుదారుడు అయినప్పుడు సదరు వ్యక్తి దరఖాస్తు ను ఎవరు పరిశీలించారు?... ఇతని దరఖాస్తు పరిశీలనకు పంపడానికి ఎవర్ని నియమించారు. దానికి ఒక పాలక మండలి అనుమతి ఉందా ? లేక తన దరఖాస్తును తానే అందరితో పాటుగా నిపుణులకు పంపించారా ? అనే సందేహాలు ఓయూలో వ్యక్తమవుతున్నాయి.దీనిపై ఒక ఆచార్యుడు ఆర్టీఐ వేసినా కూడా సమాచారం కరువైందని తెలిసింది.

నామమాత్రంగా ఓయూ పాలక మండలి..!

ఓయూ పాలక మండలి మరొక టీఎస్‌పీఎస్సీలా మారిందని.. అనేక అంశాలపై వీరికి స్పష్టత లేక అవగాహన రాహిత్యంతో నిబంధనలు తుంగలో తొక్కి, అమెదముద్ర వేయడంతో వర్సిటీ అధికారులు ఆడిందే ఆట పాడిందే పాట అయిన చందాన మారిందని విమర్శలు వస్తున్నాయి. వర్సిటీ ప్రతిష్టాత్మక కాస్త గంగలో కలిపారంటున్నారు విద్యార్థులు.అన్ని విషయాలు దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని, చిత్తశుద్ధి ఉండి వర్సిటీ అస్థిత్వం ప్రతిష్ట సంరక్షణ కోసం పాటుపడాలని అధ్యాపకులు, ఉద్యోగులు,విద్యార్థులు కోరుతున్నారు.

ఒక సైన్సు సీనియర్ ప్రొఫెసర్ తాను పొందిన పదోన్నతి నిబంధనల ప్రకారం అర్హతలు లేవు కాబట్టి తన పదోన్నతి రద్దు చేయాలని కోరాగా వర్సిటీ సదరు ప్రొఫెసర్ పదోన్నతిని రద్దు చేసినట్టు తెలిసింది. అంటే ఈ వ్యహారం బయటకు పొక్కి బల మైన సాక్ష్యాధారలు ఉండటంతో దీనిపై ఎలాంటి విచారణ లేకుండా పదోన్నతిని ఆఘమేఘాల మీద రద్దు చేయడం ద్వారా అక్రమాలు జరిగాయడానికి ఈ ఘటన సాక్ష్యంగా నిలిచిందని పలువురు చెబుతున్నారు.

కమిటీకి విధివిధానాలు కరువు..?

ఇక ఏర్పాటు చేసి దర్యాప్తు కమిటీకి స్పష్టమైన విధివిధానాలు లేవని ఇక ఇది కంటి తుడుపు కమిటీ అన్న అభిప్రాయాలూ వ్యక్తం అవుతున్నాయి. గురువారం మొదటిసారి భేటీ అయిన కమిటీలో ఒక సభ్యుడు ఆన్‌లైన్‌లో హాజరు అయినట్టు తెలిసింది. అనేక పత్రాలు పరిశీలించడం అభిప్రాయాలను తీసుకోవడం ఆన్‌లైన్ హాజరుతో ఎలా సాధ్యం అవుతుందని కొందరు విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. కొందరు ఓయూ ప్రొపెసర్స్ కమిటీ ఎదుట అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు, పలు అంశాలపై నివత్తి చేసేందుకు తమ వాంగ్మూలం కూడా తీసుకోవాలని కోరుతున్నారు. నిబంధనలు విరుద్ధంగా సీఏఎస్ ప్రమోషన్స్ పొందిన వారికి ఎరియర్స్ కూడా కొన్ని లక్షల రూపాయల ఎరియర్స్ చెల్లించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సైన్స్‌లో6, ఇంజనీరింగ్ కళాశాలలో 3, మేనేజ్మెంట్‌లో 2, న్యాయ కళాశాలలో 1, ఆచార్యులకు ఎరియర్స్ చెల్లించినట్టు తెలిసింది.

పదోన్నతులలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలి



ఉస్మానియా యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతులలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి అవకతవకలకు పాల్పడినవా వారి పైన చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా అర్హత ఉన్న ప్రొఫెసర్లకి పరిశీలన చేసి సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించాలి. లేకపోతే విద్యార్థులను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తాం.

- ఏఐఎస్ఎఫ్ ఉస్మానియా యూనివర్సిటీ కార్యదర్శి నెల్లి సత్య



ఎల్.బి.నగర్ నియోజకవర్గంలో దివ్యాంగుల మధ్య కాంగ్రెస్ పార్టీ ప్రచారకమిటీ చైర్మెన్ మధు యాష్కీ గౌడ్ జన్మదిన వేడుకలు శుక్రవారం జరుపుకున్నారు.

సామాజిక న్యాయ సాధనకు అసెంబ్లీ సాక్షి భూతమవ్వాలి

- బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్
- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను సత్కరించిన బీసీ రాజ్యాధికార సమితి

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ శాసన సభకు మూడోసభాపతిగా ఎన్నికైన గడ్డం ప్రసాద్ కుమార్‌ను శుక్రవారం బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్ తమ కేంద్ర కమిటీ సభ్యులతో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి ఘనంగా సత్కరించారు.. విద్య ఉద్యోగ పారిశ్రామిక రాజకీయ రంగాలలో పేద అట్టడుగు వర్గాలు ఎదుర్కుంటున్న పలు సవాళ్ళను ఈ సందర్భంగా దాసు సురేష్ స్పీకర్ దష్టికి తీసుకెళ్లారు. సామాజిక సమస్యల పరిష్కారాలకు అసెంబ్లీ సాక్షీభూతం అవ్వాలని, అసెంబ్లీ వేదికగా అట్టడుగు వర్గాల ఆకాంక్షలు నెరవేర్చడానికి వెల్లువయ్యే చర్చల లో పూర్తిస్థాయిలో సహకరించవలసిందిగా స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు.

తదనంతరం దాసు సురేష్ మీడియాతో మాట్లాడుతూ మారుమూల ప్రాంతం, కడు పేదరికం నుంచి స్వశక్తితో రాజకీయంగా ఎదిగి నేడు తెలంగాణ సభాపతిగా గడ్డం ప్రసాద్ కుమార్ నియమితులవ్వడం అట్టడుగు బలహీన వర్గాల నాయకత్వానికి స్ఫూర్తిదాయకమన్నారు. పేదల సమస్యలు తెలిసిన వ్యక్తిగా, విద్య, రాజ్యాధికారంపై అవగాహన ఉన్న వ్యక్తిగా అసెంబ్లీలో చర్చకు వచ్చే అట్టడుగు బలహీన వర్గాల సమస్యల పట్ల స్పీకర్ సానుకూలంగా వ్యవహరించడంతోపాటు అట్టి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత కల్పిస్తారన్న సంపూర్ణ విశ్వాసం తమకున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి గ్రేటర్ హైదరాబాద్ మహిళా అధ్యక్షురాలు బండారు పద్మావతి, మహిళా యువజన కన్వీనర్ స్రవంతి , పెండెం ఉపేందర్ ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాంగ్రెస్ నేత మధుయాష్కీ గౌడ్ జన్మదినోత్సవాలు

- దివ్యాంగుల హాస్టల్లో వేడుకలు
- హాస్టల్‌కు ఆర్. ఓ ప్లాంట్ అందజేత



నవతెలంగాణ -ఎల్‌బీనగర్

కాంగ్రెస్ పార్టీ ప్రచారకమిటీ చైర్మెన్ మధు యాష్కీ గౌడ్ జన్మదినవేడుకలు ఎల్.బి.నగర్ నియోజకవర్గంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గం వ్యాప్తంగా జరిగిన వివిధ సేవా కార్యక్రమాల్లో పార్టీ నేతలు, మధు యాష్కీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చంపాపేట డివిజన్‌లోని బాలుర దివ్యాంగుల హాస్టల్‌కు మంచినీటి సౌకర్యం కోసం మధుయాష్కీ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన ఆర్ ఓ ప్లాంట్ ను పుట్టినరోజు సందర్భంగా మధుయాష్కీ ప్రారంభించారు. ఇక పై బాలుర దివ్యాంగుల హాస్టల్‌లో మంచి నీరు కొనుగోలు చేసే పనిలే కుండా నిరంతరం సురక్షితమైన మంచినీటి సదు పాయం అందుబాటులోకి రానున్నది.

మధుయాష్కీ ఇటీవల ఎల్‌బీనగర్ నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయారు. తాను ఎన్నికల ప్రచారంలో భాగంగా హాస్టల్‌ను సందర్శించానని, వారికి మంచి నీటి సౌకర్యం లేదని చెప్పిన వెంటనే ఎన్నికల తర్వాత ఆర్. ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తానని తాను చెప్పానని, ఇచ్చిన మాట ప్రకారం తాను ఓడిపోయినప్పటికీ నియోజవర్గంలో తాను ఇచ్చిన హామీలను మర్చిపోలేదన్నారు. అలాగే బాలికల దివ్యాంగుల వసతి గృహంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా తన సతీమణి బాలిక గృహానికి వచ్చినప్పుడు ఇక్కడి బాలికలు సమస్యలు చెప్పారని, వాటిని ఖచ్చితంగా తీరుస్తామని హామీ ఇచ్చామన్నారు. తన భార్య సుజీ ఇచ్చిన హామీ ప్రకారం వసతి గృహంలో సీలింగ్ ఫ్యాన్లు, ఛార్జింగ్ లైట్లు, వాషింగ్ మిషిన్, మిక్సీ అందజేయడం జరిగిందన్నారు.

ఈ సందర్భంగా దివ్యాంగులు తమ సమస్యలను మధుయాష్కీకి చెప్పుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది కాబట్టి ఎంతో కాలంగా పెండింగ్ లో ఉన్న సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పేదలు, బడుగు, బలహీను పక్షాన తప్పక ఉంటుందని, రెండు వసతి గృహాల్లో సమస్యలను తాను దగ్గరుండి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే తాను ఈ నియోజకవర్గంలో ఓడిపోయినప్పటికీ నియోజవర్గ సమస్యలను మాత్రం మర్చిపోనని, ఎల్. బి నగర్ నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని మధు యాష్కీ పేర్కొన్నారు. కొత్తపేటలో ఉచిత న్యాయ సేవ సలహాసమితి ని ఏర్పాటు చేసిన ప్రముఖ న్యాయవాది వెంకటేష్‌ను అభినందించారు. తన పుట్టిన రోజు నాడు తనకు బొకేలు, కేకులు కాకుండా తాను చెప్పినట్లు సేవాకార్యక్రమాలు నిర్వహించిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పుట్టినరోజు నాడు ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం చాలా ఆనందాన్ని ఇచ్చిందని మధుయాష్కీ చెప్పారు. ఈ వేడుకల్లో పార్టీ సీనియర్ నేతలు వజీర్ ప్రకాష్ గౌడ్, శ్రీపాల్ రెడ్డి, గోపాల్ ముదిరాజ్, నరేందర్, కొత్త పేట డివిజన్ అధ్యక్షుడు లింగాల కిషోర్ గౌడ్, వనస్థలీపురం డివిజన్ అధ్యక్షుడు కుంట్ల నరసింహ, హాస్టల్ విద్యార్థులు సుమన్, జిల్ల నాగరాజు, వార్డెన్ నాగలక్ష్మి , లక్ష్మీకాంత్, స్వప్న, విజయ, మనీ, యువ సేన అధ్యక్షుడు బత్తుల మల్లేష్ గౌడ్, బొగు వెంకటేష్ గౌడ్, పాలసా రేణు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు పాల్గొన్నారు

'ఉప ముఖ్యమంత్రికి మాల మహానాడు అభినందనలు'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్ర మార్కను మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకృష్ణ శుక్రవారం కలిసి పుష్పగుచ్చం అందజేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. దళితులు, నిరుద్యోగులు, వెనుకబడిన వర్గాలకు సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లగా పరిష్కారానికి సానుకూలంగా స్పందించారని శ్రీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు సంకి ప్రసాద్, ఎనమాల సుధాకర్ వర్మ, జె. హరిభూషన్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ముజీబ్ ఆధ్వర్యంలో ఎంఎన్‌జేలో అన్నదానం



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్ యూని యన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ సయ్యద్ మాజీదుల్లా హుస్సేని (ముజీబ్) ఆధ్వర్యంలో మెహదీ నవాజ్ జంగ్ క్యాన్సర్ ఆస్పత్రి ఆవరణలో సుమారు 500 నిరుపేద రోగులు, వారి సహాయకులకు నాణ్యమైన మాంసాహార ఆహారాన్ని పంపిణీ చేశారు. డా.ముజీబ్ మాట్లాడుతూ తన తల్లిదండ్రుల పేరుమీద ట్రస్ట్ నిర్వహిస్తూ.. వారి ఆశీర్వాదంతో తన కుటుంబ సభ్యుల సంపూర్ణ మద్దతుతో పలు సేవా, సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్, సభ్యులు కుర్రాడి శ్రీనివాస్, ఖాలీద్ అహ్మద్, వైదిక్ శస్త్ర, బొలిగిద్ద శంకర్, శ్రీధర్ నాయుడు, ముఖీం ఖురేషి, ఆస్ప త్రి యూనిట్ కోశాధికారి చంద్రశేఖర్, ఈఎస్ఐ రాజ్ కుమార్, జిల్లా ఏపీఆర్వో మహమ్మద్ వహీద్, ముస్తఫా షరీఫ్, హబీబ్ చావుష్ పాల్గొన్నారు.

ప్రజలు ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా నిరసనలు తెలపవచ్చు



- నగర పోలీస్ కమీషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి
- రాత్రి సమయంలో ఎన్టీఆర్ స్టేడియం, ధర్నా చౌక్ పరిశీలన

నవతెలంగాణ - ముషీరాబాద్

ప్రజలు ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా నిరసనలు తెలుపవచ్చునని నగర పోలీస్ కమీషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నగర పోలీస్ కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పోలీస్ అధికారులతో కలిసి ఇందిరా పార్కు ధర్నా చౌక్‌ను, ఎన్టీఆర్ స్టేడియంను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపేందుకు ఒక వేదిక అవసరమని ధర్నా చౌక్ అందుకు ఉపయోగపడుతుందన్నారు. తాను సీపీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ధర్నా చౌక్ పరిసరాలు ఎలా ఉన్నాయని చూసేందుకు ఇక్కడికి వచ్చానని ఆయన వివరించారు. గతంలో ధర్నా చౌక్ విషయంలో కోర్టులో కేసు వేశారని ఆ అంశం కూడా ప్రజాస్వామ్యబద్ధంగా తీర్పు వస్తుందని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఇక్కడ ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండేదని కొత్తగా నిర్మించిన స్టీల్ బిట్స్ కారణంగా ఆ సమస్య కొంత మేర తీరిందన్నారు. ప్రజలు ఏదైనా నిరసన చేపట్టాలనుకుంటే ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇచ్చి అనుమతితో వారి వారి ధర్నాలు నిర్వహించుకోవచ్చని ఆయన సూచించారు. ప్రజలు ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా నిరసనలు తెలుపవచ్చునని ఆయన తెలిపారు. ఇటీవల నగరంలో అక్కడక్కడ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నట్టు చూస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు తరచుగా సెక్రటేరియట్ రావడం వల్ల కొంతమేర ట్రాఫిక్ సమస్య ఏర్పడిందని వాటిని ఎప్పటికప్పుడు తమ ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పరిష్కరిస్తుందని తెలిపారు.

కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి

- కేంద్రం బడ్జెట్‌లో బీసీల అభివృద్ధికి రూ. 2 లక్షల కోట్లకు పెంచాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య
- జాతీయ బీసీ కమిషన్ చైర్మెన్‌కు వినతి పత్రం



నవతెలంగాణ-ముషీరాబాద్

కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, కేంద్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి రెండు లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించి ఆర్థిక, విద్య, ఉద్యోగ, శిక్షణ, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు జాతీయ బీసీ కమిషన్ చైర్మెన్ హంసరాజ్ గంగారాంను తన కార్యాలయంలో కలిసి చర్చలు జరిపారు. ఈ చర్చలలో ఆర్.కృష్ణయ్యకి జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ స్వాతంత్ర వచ్చి 75 సంవత్సరాలు గడిచిన 56% జనాభా గల బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకపోవడం ఈ కులాల అభివృద్ధి జరగడం లేదని తెలిపారు. అని సామాజిక వర్గాలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం దేశంలోని 75 కోట్ల మంది బీసీలకు 2 వేల కోట్లు కేటాయించి 56 శాతం జనాభాను అవమానించారన్నారు.. ఇది ఏ మూలకు సరిపోతుందని ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధమైన మండల్ కమిషన్ బీసీ అభివృద్ధికి 40 సిఫార్సులు చేస్తే అందులో ఆర్థికాభివృద్ధికి 16 సిఫార్సులు చేశారు. కానీ ఇంతవరకు ఒక్క సిఫార్సు కూడా అమలు చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీలకు విద్యా ఉద్యోగ రంగాలలో 27 శాతం రిజర్వేషన్లు పెట్టారు. వీటికి అనుబంధంగా ఆర్థికపరమైన రాయితీలు స్కాలర్ షిప్‌లు, ఫీజు మంజూరు, హాస్టల్స్, గురుకుల పాఠశాలలు, నవోదయ పాఠశాలలు, మంజూరుకు బడ్జెట్ కేటాయించడం లేదు. ప్రత్యేక హాస్టళ్ళు - విద్యా సంస్థలు లేకపోతే బీసీలు ఎలా చదువుకుంటారని ప్రశ్నించారు. పరిశ్రమలు రావడం, యాంత్రీకరణ చెందడం మూలంగా కులవృత్తులు - చేతివృత్తులు దెబ్బతిన్నాయి. దీనితో ఈ కుల వృత్తుల వారు వృత్తులు కోల్పోయి ఆకలి చావులకు గురవుతున్నారు. వీరికి ఆర్థికంగా చేయూతనిచ్చి ప్రతి కుటుంబానికి 10 లక్షల నుండి 50 లక్షల వరకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు అమలు చేసే బీసీ పథకాలకు 60 శాతం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలన్నారు. బీసీల డిమాండ్లు న్యాయమైనవని ఈ డిమాండ్లు పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని చైర్మెన్ హంసరాజ్ గంగారాం హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో డా. మరేష్, మహేందర్, కర్రీ వేణుమాధవ్, నీలా వెంకటేష్, అనంతయ్య, భూ అంగిరేకుల వరప్రసాద్, పేసాగర్, వేముల రామకృష్ణ, పృథ్వీ గౌడ్, డా. పద్మలత, కృష్ణ మూర్తి, ఉదయ్ నేత, రవీందర్, శివ, కిరణ్ భాషయ్య తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో బీసీల ధర్నా విజయవంతం



బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు నిరుద్యోగ జేఏసీ చైర్మెన్ నీలా వెంకటేష్

నవతెలంగాణ-ముషీరాబాద్

పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రంలో మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో తలపెట్టిన ఢిల్లీ జంతర్‌మంతర్‌లో ధర్నా విజయవంతం చేసుకొని వందలాది మందితో ఢిల్లీ నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. బీసీ సంఘాలు కులసంఘాల నేతలు ఇందులో ముఖ్య నాయకులు బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు నిరుద్యోగ జేఏసీ చైర్మెన్ నీలా వెంకటేష్ ముదిరాజ్ ఐక్యవేదిక అధ్యక్షులు జి.అనంతయ్య , విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ శివ కృష్ణ ముదిరాజ్, యాదవ సంఘం అధ్యక్షులు మల్లేష్ యాదవ్, రజక సంఘం రాష్ట్ర నాయకులు గణేష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలా వెంకటేష్ మాట్లాడుతూ బీసీల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఢిల్లీలో తలపెట్టిన ధర్నా విజయవంతమైందన్నారు. గౌడ సంఘం రాష్ట్ర నాయకులు కోనూరు గణేష్ గౌడ్, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నల్గొండ సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

'డీబీఎస్ఎఫ్ రాష్ట్ర జాయింట్ కో-ఆర్డినేటర్‌గా సిహెచ్.శివ సాయి తేజ'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

దళిత బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (డిబిఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర జాయింట్ కో-ఆర్డినేటర్‌గా సిహెచ్.శివ సాయి తేజను నియమించడం జరిగింది. ఈ మేరకు శుక్రవారం హిమాయత్ నగర్ లోని కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ సిహెచ్.శివ సాయి తేజను నియమిస్తూ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక అవగాహనతో ఉండాలని, పోటీ ప్రపంచంలో విజ్ఞానంతో కూడిన చైతన్యం కలిగి ఉండాలని సూచించారు. నేటి విద్యార్థి, యువత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పోరాట జీవితం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల సాధన కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ విద్యార్థి, యువజన నిరుద్యోగులను నిర్లక్ష్యం చేయడం వల్లనే బీఆర్ఎస్ సర్కార్‌ను కూల్చారని అలాంటి పరిస్థితులే కొనసాగితే సీఎం ఎ.రేవంత్ రెడ్డి సర్కార్‌కు అదే పతనం తప్పదన్నారు. విద్యార్థులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు అమలు పరచాలని కోరారు.స్కాలర్ షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ నిధులు విడుదల, సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కారం చేయాలని, వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించి రాష్ట్రంలోని 25 వేల టీచర్ పోస్టులు, 5 వేల కళాశాల లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని, టీఎస్పీఎస్సీ ద్వారా నోటిఫికేషన్ వెంటనే విడుదల చేసి ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలని, ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులు, యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని ఆయన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెంచిన కళాశాలల ఫీజులు తగ్గించాలని, విద్యా సంస్థల్లో కుల వివక్షతను నిర్మూలించాలని, ప్రభుత్వ అన్ని స్థాయిల ప్రభుత్వ పాఠశాలల్లోని మౌలిక సమస్యలు పరిష్కారం చేయాలని, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జీవిత చరిత్రను బోధన పాఠ్యాంశంగా చేర్చాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఓయూలోని విద్యార్థిని, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో డిబిఎస్ఎఫ్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఇటికాల గణేష్, విద్యార్థి, పార్టీ నాయకులు రాంచందర్, కరుణాకర్, నిహార్, విజయ్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

'దళితున్ని రాష్ట్ర స్పీకర్‌గా ఎన్నుకోవడం అభినందనీయం'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

దళితున్ని తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గా ఎన్నుకోవడంలో కాంగ్రెస్ పార్టీని అభినందిస్తున్నామని బీజేపీ సీనియర్ నాయకులు, ఉమ్మడి ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర మాజీ కన్వీనర్, అరుంధతియ అనాథ వృద్ధుల సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మాతంగి హనుమయ్య అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హనుమయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో ఘర్షణాత్మకమైన వైఖరిని వీడనాడాలని, తెలంగాణ ప్రజల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆ పార్టీ నడుచుకుంటుందని ఆశిస్తున్నామన్నారు. ప్రధానంగా కేంద్రంలోని ప్రధాని మోడీ పాలనపై అన్ని వర్గాల్లో అభినందనలు వ్యక్తం అవుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితం హర్షనీయమైన కేవలం విద్యార్థులకు మాత్రమే వర్తింపజేస్తే బాగుండేదని ఆయన సూచించారు. ఈ నిర్ణయం కారణంగా సుమారు రెండున్నర లక్షలకు పైగా ఉన్న ఆటో డ్రైవర్ల జీవనం అతలాకుతలం అయిందని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుబంధు మొదటి పంపిణీ మొదలు పెట్టడం హర్షనీయమన్నారు. ఇంత కొద్ది సమయంలో ప్రభుత్వం అన్ని హామీలు ప్రజలకు నెరవేర్చలేకపోయినా కాలయాపన లేకుండా సత్వర చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో నాయకులు కాంపల్లి రాజేష్, బోళ్ల లింగయ్య, కాంపెల్లి బాబు, మాతంగి రమేష్, ఉల్లెందుల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలకు అండగా ఉంటా

- అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట:

పద్మశాలీలకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఎమ్మెల్యేగా రెండోసారి భారీ మెజార్టీతో విజయం సాధించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం అధ్యక్షుడు వర్కాల కృష్ణ నేతృత్వంలో ప్రధాన కార్యదర్శి చిలక శివకుమార్, కోశాధికారి భీమనపల్లి అశోక్, గౌరవ అధ్యక్షుడు ఎనుగంటి నరేందర్, ఉపాధ్యక్షులు ఎ. అంజయ్య, కుందెన సత్య నారాయణ, గంగిశెట్టి సత్తయ్య, సంయుక్త కార్యదర్శులు గంధమల్ల శ్రీనివాస్, గంగిశెట్టి మల్లేష్, కార్యనిర్వాహక కార్యదర్శి తీగల నరేందర్, సభ్యులు ఆవుల రాములు, సలహాదారులు నక్క రమేష్, గోల్నాక డివిజన్ అధ్యక్షుడు పెద్దబొమ్మ దామోదర్ తదితరులు శుభాకాంక్షలు తెలి పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో తమకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన పద్మశాలీ కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

ఇంటింటికీ వెళ్లి ఎన్‌సీడీ సర్వే నిర్వహించాలి



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ఇంటింటికి వెళ్లి ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికబుల్ డీసీస్) సర్వే నిర్వ హించాలని ఆశ వర్కర్లకు, ఏఎన్ఎంలకు హైదరాబాద్ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటి సూచించారు. శుక్రవారం సుల్తాన్ బజార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎన్‌సీడీ సర్వే ఎలా నిర్వహించాలనే అంశంపై ఆశ వర్కర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రతి ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించాలన్నారు. బీపీ (అధిక రక్తపోటు) షుగర్, థైరాయిడ్ లాంటి సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ సర్వే నిర్వహించాలన్నారు. బీపీ, షుగర్, థైరాయిడ్‌లకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించాలని సూచించారు. ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కింగ్ కోఠి క్లస్టర్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ పద్మజ, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆశ్రిత, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వసంత్ కుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్నేహక, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

హ్యామ్ స్టెక్‌లో ఉత్సాహంగా ఫోటో ఎగ్జిబిషన్



నవతెలంగాణ-బంజారా హిల్స్

హ్యామ్ స్టెక్ కాలేజీలో ఫోటో ఎగ్జిబిషన్ ఉత్సాహంగా సాగింది. కాలేజీలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థిని, విద్యార్థులు తీసిన ఫోటోలను ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఒక అద్భుతమైన చిత్రాన్ని కెమెరాల బంధించడం మరింత అద్భుతమైన కళ అని కాలేజీ సీఈవో అనిత రెడ్డి అన్నారు. సుమారు 50 మంది విద్యార్థిని, విద్యార్థులు నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాలలో ప్రత్యేకంగా పర్యటించి తీసిన చిత్రాలను ప్రదర్శించారు. ప్రకృతి అందాలతో పాటు కర్షక కార్మికుల కష్టాలను వివరించేలా తీసిన చిత్రాలకు విద్యార్థి, విద్యార్థులకు అతిథిగా హాజరైన డైరెక్టర్ ఆఫ్ ఇండియన్ ఫోటోగ్రఫీ ఫెస్ట్ వ్యవస్థాపకులు ఆక్విన్ మెథ్యూస్,సంస్థ సీఈవో అజిత రెడ్డిలు బహుమతులు అందజేశారు. ఈ మేరకు శుక్రవారం పంజాగుట్టలోని హ్యామ్ స్టెక్ కాలేజీలో నిర్వహించిన ఈ ప్రదర్శనలో చిత్రాలను పరిశీలించి ఉత్తమ ఫోటోగ్రాఫర్లకు సర్టిఫికెట్లతో పాటు బహుమతులు అందజేసి మాట్లాడారు. ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది సైతం పిక్సెల్ పర్ఫెక్ట్ 2023 పేరిట ఎగ్జిబిషన్ నిర్వహించినట్లు సీఈఓ అజిత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కోమల్ రాయ్ జేఎన్ఎఫ్ఏయు, సప్న విజయ్ సీబిట, రవీందర్ రెడ్డి ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

కె.వి.రమణాచార్యులకు ఘన సన్మానం



నవతెలంగాణ - ముషీరాబాద్

తెలంగాణ బాలోత్సవం పిల్లల జాతర విజయవంతమైన సందర్భంగా బాలోత్సవం ఆహ్వాన సంఘం అధ్యక్షులు కెవి రమణాచార్యులకి ధన్యవాదాలు అభినందనలు తెలియజేశారు. తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎన్ సోమయ్య, ఉపాధ్య క్షురాలు కె.సుజావతి, కోశాధి కారి జి.బుచ్చిరెడ్డి, తెలంగాణ బాలోత్సవం పిల్లల జాతర 6వేల మంది పిల్లలు 112 పాఠశాలలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా సహకారం అందించిన పెద్దలు, పాఠశాల అధ్యాపకులు తల్లిదండ్రులకు ధన్యవాదాలు అభినందనలు తెలియజేశారు. 2024న జరగబోయే పిల్లల జాతరకు ఇదే విధంగా సహకారం అందించాలని కోరారు.

ప్రజా ఎవెన్యూ అపార్టుమెంటును సందర్శించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

బాగ్ అంబర్‌పేట డివిజన్‌లోని ప్రజా ఎవెన్యూ ఫేజ్ త్రీ అపార్టుమెంటును ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ శుక్రవారం డివిజన్ కార్పొరేటర్ బి. పద్మవెంకటరెడ్డితో కలిసి సందర్శించారు. అపార్టుమెంటులో గల సమస్యలను వారిని అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు అక్కడి నుంచే ఫోన్ చేసి సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్, నాయకులు కెంచె మహేష్, దిలీప్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు ఆకృతి శుభాభినందనలు



నవతెలంగాణ-కల్చరల్

డిప్యూటీ సీఎంగా భట్టి విక్రమార్క పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనను జంట నగరాల్లోనీ ప్రముఖ సాంస్కృతిక సంస్థ ఆకృతి అధ్యక్షుడు సుధాకర్ డిప్యూటీ సీఎం అధికారిక నివాసంలో కలిసి శుభాభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో, జ్ఞాపికతో సుధాకర్ సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాల సరళిని ఆయన అడిగి తెలుసుకున్నారు. సాహితీ , సాంస్కృతిక పరంగా తెలంగాణ రాష్ట్రం పరిఢవిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాకారుడు మోహన కృష్ణ తో పాటు పలువురు ఆకృతి సభ్యులు డిప్యూటీ సీఎంకు అభినందనలు తెలిపారు.

కార్మికుల పక్షానే ఎర్రజండా



సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు

నవతెలంగాణ - ముషీరాబాద్

కార్మికుల పక్షానే ఎర్రజండా ఉంటుందని వారి హక్కుల సాధనకై పోరాడుతుందని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు పేర్కొన్నారు. నూతనంగా ఎమ్మెల్యే గా ఎన్నికైన సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు సన్మాన సభ హైదరాబాద్, విఎస్టి క్రాస్ రోడ్స్ టిఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో యూనియన్ కార్యాలయం మఖ్దూమ్ హాల్ లో శుక్రవారం యూనియన్ అధ్యక్షులు ఎస్. బాబు అధ్యక్షతన జరిగింది. తొలుత విద్యానగర్ చౌరస్తా లో కూనంనేని సాంబశివ రావు కు ఘన స్వాగతం పలికి వందలాదిమంది ఆర్టీసీ కార్మికులు యూనియన్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో యూనియన్ అధ్యక్షులు ఎస్. బాబు, కార్య నిర్వాహక అధ్యక్షులు ఏం. వెంకట్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఈ. వెంకన్న, ఉప ప్రధాన కార్యదర్శి ఎండి. అహ్మద్ అలీ తదితరులు కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గం నుండి సీపీఐ ఎమ్మెల్యేగా విజయం సాధించిన కూనంనేని సాంబశివరావుకు శాలువా, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ సమ్మెలు, ధర్నాలు, ర్యాలీ లు నిషేధించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని కార్మికుల హక్కులను హరించివేసిందని మండిపడ్డారు. నియంతృత్వంతో కార్మికుల హక్కులను కాలరాసి ఏ ప్రభుత్వం మనుగడ కొనసాగించదని, అందుకే బీఆర్ఎస్‌ను కార్మికవర్గం, ప్రజలు ఈ అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తుగా ఓడించి తగిన బుద్ధి చెప్పారన్నారు. సీపీఐ కార్మికవర్గం యొక్క విప్లవాత్మక అగ్రగామి అని, సీపీఐ, ఏఐటీయూసీ అనేక పోరాటాలు చేసి దేశంలోని కార్మికులకు తమ హక్కులను సాధించిపెట్టిందని ఆయన గుర్తు చేసారు. ఆర్టీసీ కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తనకు తెలుసునని, అసెంబ్లీ సమావేశాల్లో ఆర్టీసీ కార్మికుల సమస్యలను లేవనెత్తి పరిష్కారానికి కృషి చేస్తానని కూనంనేని సాంబశివ రావు భరోసా ఇచ్చారు. ఈ సభలో ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఉప ప్రధాన కార్యదర్శి కె. పద్మాకర్, ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు వి.ఎస్. బోస్, ఉపాధ్యక్షులు అరుణ కుమారి, కార్యదర్శులు కె.ఎస్. రెడ్డి, మంగ జ్యోతి, బి.జ్యోతి, నేతలు ఎంఎ. మజీద్, రమేష్, శ్రీనివాస్ పాపయ్య గౌడ్, బి. వెంకటయ్య, జిడి. ప్రసాద్ రెడ్డి, చంద్రమౌళి, తెలంగాణ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బి. వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

అసంతృప్తి వద్దు

ప్రతిఒక్కరి జీవితంలో టీనేజ్ దశ ఎంతో కీలకమైంది. ఈ దశలోనే ఎన్నో రకాల ఆకర్షణలు కలుగుతాయి. శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. ఇవి ప్రతి ఒక్కరిలో సర్వసాధారణం. అయితే, కొంత మంది టీనేజర్లు తమ శరీరంలో వస్తున్న మార్పులపై నెగెటివ్‌గా ఆలోచిస్తూ, ఇతరులతో పోల్చుకుంటూ ఆందోళన చెందుతుంటారని ఓ అధ్యయనంలో వెల్లడైంది. ఇది క్రమంగా వారి మానసిక ఆరోగ్యానికి ముప్పు తెస్తుందట. ఈ అధ్యయన ఫలితాలు ఎపిడెమియాలజీ కమ్యూనిటీ అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.



యూకేలో టీనేజీర్లపై చేసిన ఈ సర్వేలో 61 శాతం మంది తమ శరీరంపై అసంతృప్తితో ఉన్నారని తేలింది. వారి శరీరం పట్ల అసంతృప్తికి ప్రమాదకర ఆరోగ్య ప్రవర్తనలు, మానసిక ఆందోళనలు వంటివి ప్రధాన కారణాలుగా అధ్యయన రచయితలు పేర్కొన్నారు. ఈ సర్వేలో పాల్గొన్న వారందరూ 14 సంవత్సరాల వయసు ఉన్న వారే. ఇందులో భాగంగా వారి బరువు, ఫిగర్, బాడీ బిల్డ్ లేదా రొమ్ములు, కడుపు, నడుము, తొడలు, పళ్ళు, కాళ్ళు, ముఖం, జుట్టు వంటి భాగాలపై ఐదు పాయింట్లలో అభిప్రాయా లను సేకరించారు. ఆసక్తికర విషయమేమంటే, అబ్బాయిలకంటే అమ్మాయిలే తమ శరీరంపై ఎక్కువ అసంతృప్తితో ఉన్నారని తేలింది. తమ తొడలు, కడుపు, బరువు పట్ల ఎక్కువ అసంతృప్తితో ఉన్నారని సర్వేలో వెల్లడైంది. అయితే అమ్మాయిలు తమ జుట్టు, పళ్లతో సంతృప్తికరంగా ఉన్నామని చెప్పగా, అబ్బాయిలు మాత్రం కడుపు, పళ్ల భాగాలపై ఎక్కువ అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు.

బరువుపైనే ఎక్కువ అసంతృప్తి.. : సర్వేలో 32 శాతం మంది అమ్మాయిలు, 14 శాతం మంది అబ్బాయిలు వారి బరువుపై ఎక్కువ అసంతృప్తితో ఉన్నారట. "వారు టీనేజీలో ఉండాల్సిన బరువుకు మించి ఎక్కువ బరువు ఉండటం వల్ల వారిలో ఆందోళన అధికంగా ఉంది" అని అధ్యయనం మొదటి రచయిత అభిప్రాయపడ్డారు. అయితే టీనేజీ యువకులు సాధారణంగా సన్నగా ఉండటానికి ఇష్టపడరని, వారు బలమైన ఖండలను కలిగి ఉండాలని కోరుకుంటారని చెప్పారు. అయితే ఈ అసంతృప్తి నుంచి బయటపడటానికి కొన్ని ఆలోచనలు మార్చుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అవేంటంటే...

ఇతరులతో పోలిక.. : చాలా మంది తమను తాము ఇతరులతో పోల్చుకొని బాధపడుతుంటారు. ఈ ధోరణి ముఖ్యంగా అమ్మాయిల్లోతో కన్పిస్తుంది. సినిమాల్లో నటీనటులు ఉన్న విధంగా తమ శరీర ఆకృతి లేదని ఆందోళన చెందుతుంటారు. ఈ ధోరణి మంచిది కాదని నిపుణులు అంటున్నారు.

పాజిటివ్‌గా ఆలోచనలు.. : ఎవరెలా ఉన్నా, వారు వారి శరీరాలను ముందుగా ప్రేమించుకోవాలి. అప్పుడే నెగిటివ్ ఆలోచనలను పక్కకు పోతాయి. ఎలాంటి అసంతృప్తి ఉండదు.

నచ్చిన దుస్తులు : నచ్చిన బట్టలను, శరీరానికి అనుకూలంగా ఉండే వాటిని ధరించాలి. ఇలా చేయడం వల్ల శరీరం పట్ల ఇష్టం పెరుగుతుంది.


ప్రతికూల ఆలోచనలు : మనసులోకి ఏదొక సందర్భంలో ప్రతికూల ఆలోచనలు వస్తూనే ఉంటాయి. వాటి గురించి తీవ్రంగా ఆలోచిస్తుంటే మరింత కుంగిపోతారు. అందుకే అలాంటి ఆలోచననలు మీలో కలిగినప్పుడు వాటికి అక్కడే ఫుల్‌స్టాప్ పెట్టేయాలి.

సోషల్ మీడియా వాడకాన్ని తగ్గించాలి : ప్రస్తుతం సోషల్ మీడియా వాడకం బాగా పెరిగిపోయింది. ఫేస్‌బుక్, వాట్సాప్, ఎక్స్ వంటివి లేకుండా ఒక్క గంట గడపడం కష్టంగా మారిపోయింది. అయితే సోషల్ మీడియాలో చూసే ప్రతిదీ నిజం కాదని ముందుగా గమనించాలి. వాటిలో ఇతరులు పోస్ట్ చేసే ఫోటోలను చూసి పోలిక పెట్టుకోవడంతోనే సమస్య మొదలవుతుంది. మనసు పాడవడం తప్ప ఏమీ ఉండదు. కాబట్టి వీలైనంత వరకు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి.

ఆహారంపై నియంత్రణ : సాధారణంగా టీనేజ్‌లో ఫాస్ట్‌ఫుడ్స్ ఎక్కువగా ఇష్టపడుతుంటారు. అది అనారోగ్యకరం. చెడు ఆహారపు అలవాట్లకు దూరంగా ఉంటూ, ప్రతి రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడానికి ప్రాధానత ఇస్తుంటే... శరీరాన్ని మీకు నచ్చినట్టు తీర్చిదిద్దుకునే అవకాశం కూడా ఉంటుంది.

ఆమె బాధ్యతగా ఆలోచించాలి

ఆ మధ్య కాలంలో ఒకరినొకరు ఇష్టపడటం, సంబంధాలు పెట్టుకోవడం సర్వసాధారణ విషయంగా మారిపోయింది. సంబంధం పెట్టుకున్నప్పుడు ఎలాంటి విషయాల గురించి ఆలోచించరు. ఆకర్షణలో పడిపోయి అన్నీ మర్చిపోతుంటారు. తీరా పరిస్థితి ఇబ్బంది కరంగా మారినప్పుడు బంధాలు, బాధ్యతలు గుర్తుకు వస్తుంటాయి. ఇలాంటి సంబంధాల వల్ల ఎక్కువగా ఇబ్బంది పడుతున్నది, బాధ పడుతున్నది మహిళలే కావడం బాధాకరం. ఇలాంటి సమస్యే ఈ వారం ఐద్వా అదాలత్...



ఐద్వా అదాలత్

అమృతకు సుమారు 40 ఏండ్లు ఉంటాయి. ముగ్గురు పిల్లలు. భర్త నవీన్ చనిపోయి దాదాపు ఏడాది అవుతుంది. అమృత ఒక ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. అక్కడే ఆమెకు సునీల్‌తో పరిచయం. దాదాపు ఐదేండ్ల నుండి వారి మధ్య స్నేహం ఉంది. తర్వాత కాలంలో స్నేహం మరింత ముందుకు వెళ్ళింది. భర్త అనారోగ్యంలో ఉండడంతో ఆమె సునీల్‌కు దగ్గరయింది. సునీల్ అప్పడప్పుడు వాళ్ళ ఇంటికి వచ్చి వెళ్ళేవాడు. వాళ్ళ కుటుంబ సభ్యులందరితో ఎంతో అభిమానంగా ఉండేవాడు. అమృతకు తనకు తెలియకుండానే సునీల్‌కు బాగా దగ్గరయింది. అమృతకంటే అతను వయసులో చిన్నవాడు. అయినా వారి మధ్య చనువు శారీరక సంబంధం పెట్టుకునే వరకు వెళ్ళింది.

భర్త చనిపోయినప్పటి నుండి ఆమెకు తాను ఒంటరినైపోయాను అనే భావన వచ్చింది. పిల్లలు కాలేజీకి, స్కూల్‌కి వెళ్ళిపోయేవారు. ఇంటికి వచ్చిన తర్వాత కూడా ఎవరి పనుల్లో వారు బిజీగా ఉండేవారు. దాంతో సునీల్‌ని పెండ్లి చేసుకుంటే బాగుండనిపించింది. కానీ అన్నీ మనం అనుకున్నట్టుగా జరుగుతాయా? సునీల్ ముందు పెండ్లి ప్రస్తావన తీసుకురావాలనుకుంది. అయితే అప్పుడే ఆమెకు ఓ విషయం తెలిసింది. సునీల్ వేరే అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. ఆ విషయం తెలిసి అమృత, సునీల్‌తో గొడవ పడింది. 'నన్ను ఎందుకు మోసం చేశావు, నన్ను పెండ్లి చేసుకోకపోతే పోలీస్ స్టేషన్లో కేసు పెతడాను' అంటూ బెదిరించింది.

దానికి అతను 'నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో' అంటూ వెళ్ళిపోయాడు. ఆ తర్వాత ఏమీ చేయాలో అర్థం కాక ఐద్వా అదాలత్ దగ్గరకు వచ్చింది. మేము సునీల్‌కు ఫోన్ చేసి పిలిపించి 'అమృతతో ఇన్ని రోజులు చనువుగా ఉన్నావు. ఇప్పుడు ఎందుకు దూరం పెడుతున్నావు. ఆమె నిన్ను పెండ్లి చేసుకోవాలనుకుంటుంది. గత ఐదేండ్ల నుండి మీ ఇద్దరి మధ్య సంబంధం ఉంది. ఇప్పుడు ఆమెను కాదు అని వేరే అమ్మాయిని ప్రేమిస్తున్నావు, ఇది సరైనది కాదు' అన్నాము.

దానికి అతను 'నేనూ అమృత ఒకే కంపెనీలో ఉద్యోగం చేసే వాళ్ళం. ఆమె అంటే నాకు ఇష్టమే. కానీ ఆమె నాకంటే వయసులో పెద్దది. ముగ్గురు పిల్లలు కూడా ఉన్నారు. వాళ్ళు కూడా చిన్న పిల్లలు కాదు. ఆమె భర్త చనిపోయి ఏడాది కూడా కాలేదు. ఇలాంటి పరిస్థితుల్లో నేను అమృతను పెండ్లి చేసుకోలేను. ఈ విషయం ఆమెకు ఎంత చెప్పినా అర్థం కావడం లేదు. నాకు పెండ్లి కావల్సిన ఇద్దరు చెల్లెళ్ల ఉన్నారు. నేను ఆమెను పెండ్లి చేసుకుంటే వాళ్ళకు పెళ్ళి ఎలా అవుతుంది? జీవితం మొత్తం అమృతకు మంచి స్నేహితునిగా ఉంటాను. అంతాగానీ పెండ్లి మాత్రం చేసుకోలేను. ఆమెకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆర్థికంగా సహాయం చేస్తాను. అలా కాదని ఆమెను పెండ్లి చేసుకుంటే నాతో పాటు నా చెల్లెళ్ళ జీవితం కూడా పాడైపోతుంది. ఈ విషయం ఆమెకు చెబితే పోలీస్ స్టేషన్లో కేసు పెడతానంటుంది. మీరే ఆమెకు ఎలాగైనా నచ్చజెప్పండి' అన్నాడు.

'నీకు ఇద్దరు చెల్లెళ్ల ఉన్నారన్న విషయం నీకు ఇప్పుడే గుర్తుకొచ్చిందా? అమృతతో సంబంధం పెట్టుకునేటపుడు ఈ విషయం తెలియదా? నీ కుటుంబం గురించి ఇంత బాధ్యతగా ఆలోచించే వాడివి మీ పరిచయాన్ని స్నేహంతోనే ఆపేయకుండా శారీరక సంబంధం వరకు ఎందుకు తీసుకెళ్ళావు. అప్పుడు ఆమె అవసరాలను, బలహీనతను వాడుకున్నావు. ఇప్పుడు నీ కుటుంబం కోసం పెండ్లి చేసుకోనంటు న్నావు. ఇది సరైన పద్ధతి కాదు' అని గట్టిగా చెప్పాము.

దానికి అతను 'మేడమ్ మీరు చెప్పినట్టు నేను చేసింది తప్పే. అప్పుడు ఆమె కూడా నాతో సంబంధానికి ఒప్పుకుంది. కాబట్టే ముందుకు వెళ్లాము. ఇప్పుడు మీరే ఆమెకు ఎలాగో చెప్పి ఒప్పించండి' అంటూ బతిమాలుకున్నాడు.

మేము అమృతను పిలిచి 'సునీల్ నీకంటే వయసులో ఎనిమిదేండ్లు చిన్నవాడు. నీ భర్త అనారోగ్యంలో ఉన్నప్పుడు అతనికి శారీరకంగా దగ్గరయ్యావు. ఇలాంటి సంబంధాలు మంచిది కాదు. ఎప్పటికైనా సమస్యలనే తెచ్చిపెడతాయి. నువ్వు ఇప్పుడు చాలా బాధ్యతగా ఆలోచించాలి. కేవలం నీ గురించి మాత్రమే కాదు నీ పిల్లల భవిష్యత్ గురించి కూడా ఆలోచించాలి. నీకు ఇప్పుడు కావల్సింది జీవిత భాగస్వామి మాత్రమే కాదు. నీ పిల్లల బాధ్యత చూసుకునే ఒక మంచి వ్యక్తి. సునీల్ కూడా నీకు జీవితాంతం ఓ మంచి స్నేహితునిగా ఉంటానంటున్నాడు. కానీ అతను ఎన్ని రోజులు అలా ఉంటాడో చెప్పలేం. తర్వాత అతని మనసు మారిపోవచ్చు. వయసులో ఇంత తేడా ఉన్న వ్యక్తిని పెండ్లి చేసుకుంటే రేపు రేపు అనేక సమస్యలు వస్తాయి. నీకూ పెద్దగా వయసేమీ లేదు. కాబట్టి నీ వయసుకు తగ్గట్టు ఓ మంచి వ్యక్తిని చూసి పెండ్లి చేసుకో. నీకూ, నీ పిల్లలకు మంచి భవిష్యత్ ఉంటుంది. పెండ్లి చేసుకోవడం ఇష్టం లేని వ్యక్తి కోసం ఎందుకు అనవసరంగా ఆరాట పడటం' అని సర్ది చెప్పాము.

> నీకు ఇప్పుడు కావల్సింది జీవిత భాగస్వామి మాత్రమే కాదు. నీ పిల్లల బాధ్యత చూసుకునే ఒక మంచి వ్యక్తి. సునీల్ కూడా నీకు జీవితాంతం ఓ మంచి స్నేహితునిగా ఉంటానంటున్నాడు. కానీ అతను ఎన్ని రోజులు అలా ఉంటాడో చెప్పలేం. తర్వాత అతని మనసు మారిపోవచ్చు. వయసులో ఇంత తేడా ఉన్న వ్యక్తిని పెండ్లి చేసుకుంటే రేపు రేపు అనేక సమస్యలు వస్తాయి. నీకూ పెద్దగా వయసేమీ లేదు. కాబట్టి నీ వయసుకు తగ్గట్టు ఓ మంచి వ్యక్తిని చూసి పెండ్లి చేసుకో. నీకూ, నీ పిల్లలకు మంచి భవిష్యత్ ఉంటుంది. పెండ్లి చేసుకోవడం ఇష్టం లేని వ్యక్తి కోసం ఎందుకు అనవసరంగా ఆరాట పడటం



ఆమె కుటుంబ సభ్యులను కూడా పిలిపించి మాట్లాడాము. అమృతకు ఓ మంచి వ్యక్తిని చూసి పెండ్లి చేయమని చెప్పాము. ఏడాది తర్వాత వాళ్ళు ఓ వ్యక్తిని చూపి ఆమెకు పెండ్లి చేశారు. అతని భార్య చనిపోయింది. అతనితో పెండ్లి తర్వాత అమృతకు మరో బిడ్డ పుట్టింది. ఇప్పుడు ఆమెకు నలుగురు పిల్లలు. అతను కూడా ఆమెను, పిల్లల్ని ప్రేమగా చూసుకుంటున్నాడు. ఆమె కూడా చాలా సంతోషంగా ఉంది.

- వై. వరలక్ష్మి, 9948794051

దద్దరిల్లిన పార్లమెంట్

(మొదటిపేజీ తరువాయి)

సస్పెన్షన్‌కు గురైన ఎంపీలతో సహా ప్రతిపక్ష ఎంపీలు నిరసనకు దిగారు. మోడీ సర్కార్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు చేబూని మౌన నిరసన చేపట్టారు. అనంతరం పార్లమెంట్ ప్రధాన గేటు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనలో సోనియా గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఉభయ సభల ప్రారంభానికి ముందు ఇండియా ఫోరం ఎంపీలు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కార్యాలయంలో భేటీ అయ్యారు. ఉభయ సభల్లో ఉమ్మడి వ్యూహంపై చర్చించారు. ఉభయ సభల్లో ఆందోళనలు కొనసాగించాలని తీర్మానం చేస్తూ ముందుకు వెళ్లాలని ప్రతిపక్షాలు నిర్ణయించుకున్నాయి.

హౌంమంత్రి పార్లమెంట్‌లో ప్రకటన చేయకుండా టీవీలో ఇంటర్వ్యూ ఇస్తున్నారు: మల్లికార్జున్ ఖర్గే

భద్రతా ఉల్లంఘన అంశంపై కేంద్ర హౌంమంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రకటన ఇవ్వకుండా టీవీ ఛానళ్లకు ఎందుకు ఇంటర్వ్యూలు ఇస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రశ్నించారు. పార్లమెంట్ ఉల్లంఘనపై ప్రశ్నలు అడిగిన ఎంపీలను చట్టవిరుద్ధంగా సస్పెండ్ చేయడం న్యాయమా? అని అడిగారు. "పార్లమెంట్, దాని ఎంపీల భద్రతలో భారీ లోపానికి కారణమైన ప్రతిపక్ష ఎంపీలను అక్రమంగా సస్పెండ్ చేయడం ఏం న్యాయం" అని ఖర్గే ప్రశ్నించారు. "అమిత్ షా పార్లమెంట్‌లో ప్రకటన ఇవ్వాలని, ఆపై ఉభయ సభలలో చర్చించాలని ఇండియా ఫోరం పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి" అని అన్నారు. జాతీయ భద్రతకు సంబంధించిన ఈ తీవ్రమైన సమస్యపై స్వరం పెంచడం తమ కర్తవ్యమని, ఇది తమ పార్లమెంటరీ బాధ్యతని ఖర్గే పేర్కొన్నారు.

డీఎంకె నేత టిఆర్ బాలు మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఉభయ సభలలో నిరసనలను కొనసాగించాలని, సస్పెన్షన్‌కు గురైన ఎంపీలకు సంఘీభావంగా ఆందోళనలు చేయాలని అన్నారు. అలాగే వారికి మద్దతుగా చేసే ఆందోళనల్లో మనల్ని కూడా సస్పెండ్ చేసినా వెనక్కి తగ్గకూడదని, ఎంత మందిని సస్పెండ్ చేసినా ఆందోళనలు కొనసాగించాలి అన్నారు.

శివసేన (యుబిటి) ఎంపీ అరవింద్ సావంత్ పార్లమెంటు భద్రతా ఉల్లంఘనపై మాట్లాడుతూ "పాస్‌లు ఇచ్చిన ఎంపీ ప్రతిపక్షానికి చెందిన వారైతే బీజేపీ అదే స్థాయిలో సామరస్యాన్ని ప్రదర్శించి ఉండేదా? వారికి ఈ చరిత్ర ఉంది. గుట్టల కొండను తయారు చేయడంలో నైపుణ్యం ఉంది. వాస్తవమేమిటంటే సభకు వచ్చి మాట్లాడాల్సిన బాధ్యత హౌంమంత్రిపై ఉంది. ఆయన రారు, ప్రధాని కూడా రారు" అని విమర్శించారు.

లోక్‌సభ నుంచి సస్పెన్షన్‌పై డీఎంకె ఎంపీ కె. కనిమొళి మాట్లాడుతూ.. 'దేశాన్ని కాపాడేది తామేనని బీజేపీ పదేపదే చెబుతోంది. కానీ పార్లమెంట్‌ను కూడా రక్షించలేరని రుజువైంది. ప్రధాని లోపల ఉండి ఉంటే... పార్లమెంటును..., తమ సొంత ప్రధానిని కాపాడుకోలేని వారు సమస్యను రాజకీయం చేస్తున్నామని మమ్మల్ని అంటున్నారు. దేశంలో ఎక్కడైనా భద్రతకు విఘాతం కలిగితే దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది" అని అన్నారు.

సస్పెన్షన్‌కు గురైన కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ మాట్లాడుతూ.. ' ఇండియా ఫోరానికి చెందిన ఎంపీలంతా ఒక్కటయ్యాం' గురువారం మమ్మల్ని అప్రజాస్వామికంగా సస్పెండ్ చేశారు. గాంధీ విగ్రహం ముందు మౌన దీక్ష చేస్తున్నాం. నిరసన కొనసాగిస్తాం. సమస్యను పార్లమెంట్‌లో ఇండియా ఫోరం నేతలు లేవనెత్తుతూనే ఉంటారు" అని అన్నారు.

పార్లమెంటరీ భద్రతా ఉల్లంఘన ఘటనపై పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ "స్పీకర్ ఏ ఆదేశాలు ఇచ్చినా, ప్రభుత్వం వాటిని అక్షరాలా పాటిస్తోంది. ఈ అంశం కోర్టులో కూడా ఉంది. ఉన్నత స్థాయి విచారణ జరుగుతోంది. వారు (ప్రతిపక్షం) బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి" అని అన్నారు.

అన్నీ అసత్యాలే..కొత్తదనం లేదు

(మొదటిపేజీ తరువాయి)

గుర్తు చేశారు. హర్యానా, పంజాబ్ రాష్ట్రాలను తలదన్నే విధంగా వరి ఉత్పత్తిలో రాష్ట్రం ముందు నిలిచిందన్నారు. తలసరి ఆదాయం గణనీయంగా పెరిగింది నిజం కాదా? అని ప్రశ్నించారు. ఐటీ ఉత్పత్తులు, ఎగుమతుల్లో హైదరాబాద్ ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. గవర్నర్ గతంలో మాట్లాడింది, ఇప్పుడు మాట్లాడింది సమీక్ష చేసుకోవాలన్నారు. ప్రజలందరూ ఇప్పుడు సంతోషపడుతున్నట్టు మాట్లాడడం సరైంది కాదని చెప్పారు. తెలంగాణ ప్రజలు స్వేచ్ఛా వాయువులు పిలుస్తున్నారని చెప్పడం సముచితం కాదన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలకు ఎటువంటి ప్రణాళికా తన ప్రసంగంలో లేదని చెప్పారు. అభివృద్ధి సంక్షేమ పథకాలకు సంబంధించిన రూట్ మ్యాప్ గవర్నర్ ప్రసంగంలో ఉంటే బాగుండేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నీ అసత్యాలే చెప్పించిందని తెలిపారు. దళిత బంధు ప్రస్తావన లేదన్నారు. మద్దతు ధరకు రూ. 500 కలిపి ధాన్యం కొనుగోలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసింది కదా! గవర్నర్ ప్రసంగంలో ఆ ప్రస్తావన ఎందుకు లేదని ప్రశ్నించారు. దీన్ని బట్టే ఆ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేసే పరిస్థితి లేదని విమర్శించారు.

10 వేల ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ?

(మొదటిపేజీ తరువాయి)

ఉభయసభలనుద్దేశించి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శుక్రవారం ప్రకటించడమే అందుకు నిదర్శనం.

పదోన్నతులతో మరిన్ని ఖాళీలు

రాష్ట్రంలో 9,370 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పాఠశాల విద్యాశాఖ గతంలోనే గుర్తించింది. వాటిలో 5,089 పోస్టుల భర్తీకే బీఆర్ఎస్ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. 1,523 ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులను గత ప్రభుత్వమే మంజూరు చేసింది. దీంతో 5,089 ఉపాధ్యాయ పోస్టులకు అదనంగా 1,523 ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులు జత కావడంతో డీఎస్సీ ద్వారా భర్తీ చేసే ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య 6,612కు చేరింది. అయితే ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి సాంకేతిక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. దీంతో 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకే ప్రభుత్వ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. అయితే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాఠశాల విద్యాశాఖలో 13,086 పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. వాటిలో 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకే నోటిఫికేషన్ వచ్చింది. కొన్ని జిల్లాల్లో చాలా సబ్జెక్టులకు రిజర్వేషన్ల వారీగా పోస్టులే లేని పరిస్థితి ఉన్నది. దీంతో నిరుద్యోగులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఉపాధ్యాయ పోస్టుల సంఖ్యను పెంచే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. అందులో భాగంగానే ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తే వాటి ద్వారా వచ్చే ఖాళీలను గుర్తించాలని అధికారులను కోరినట్టు తెలిసింది. వాటిని కలిపి పది వేల ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీకి కసరత్తు చేయాలని సూచించినట్టు సమాచారం. ఈ దిశగా విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించినట్టు తెలిసింది.

భార్యా పిల్లల్ని కడతేర్చి..

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహిస్తున్నాడు. ఆన్‌లైన్ ద్వారా సులువుగా డబ్బు సంపాదించవచ్చని నమ్మి లక్షల రూపాయలు పెట్టి ఆన్‌లైన్‌లో బెట్టింగులు పెట్టి మోసపోయాడు. తన వ్యవసాయ భూమి అమ్మినా తీరని అప్పులతో కృంగిపోయి ఇబ్బందులు పడుతూ, ఓ వైపు తోటి ఉద్యోగులు ఆర్థికంగా స్థిరపడటం, మరో వైపు బంధువులు చులకన భావంతో చూడటం ఒకింత తీవ్ర మనోవేదనకి గురయ్యాడు. ఇదే విషయమై భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. అది తారాస్థాయికి చేరుకోవడంతో ఆగ్రహానికి గురైన నరేశ్ పాఠశాలకు వెళ్లి పిల్లలను ఇంటికి తీసుకువచ్చాడు. ఆపై కుమారుడు రేవంత్(6), కుమార్తె రిషిత(5)తో సహా భార్య చైతన్య(30)ను తుపాకీతో కాల్చి.. తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై సీపీ శ్వేత మీడియాతో మాట్లాడుతూ.. సర్వీస్ రివాల్వర్‌తో కుటుంబ సభ్యులను నరేశ్ కాల్చి చంపారని వెల్లడించారు. నరేశ్‌కు అప్పులు ఉన్నట్టు ప్రాథమికంగా తెలిసిందని, ఆన్‌డ్యూటీలో ఉండగానే ఈ ఘటనకు పాల్పడినట్టు తెలిపారు. నరేశ్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు సీపీ వెల్లడించారు.

ఇనుప కంచెలు తొలిగాయ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

శుక్రవారం అసెంబ్లీలో ఉభయసభలనుద్దేశించి ఆమె ప్రసంగించారు. శాసనసభాపతి, శాసనమండలి చైర్మెన్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు శుభాకాంక్షలు తెలిపారు. 2023 తెలంగాణ ప్రస్థానంలో మంచి మార్పునకు శ్రీకారం చుట్టిన ఏడాదిగా చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు. కొత్త ప్రభుత్వం..కొత్త సంవత్సరంలో రైతులు, యువత, మహిళలు, పేదల జీవితాల్లో మరిన్ని వెలుగులు నింపుతుందనీ, ప్రజలకు స్వేచ్ఛ, సమాన అవకాశాలు, సామాజిక న్యాయం, ప్రజలకు అందుబాటులో ఉండే పాలనకు శ్రీకారం చుడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులు ప్రజలకు సేవకులే తప్ప పాలకులు కాదు..పెత్తందారులు అంతకంటే కాదని సుస్పష్టంగా చెప్పారు. సామాన్యుడు కూడా ఇది తన ప్రభుత్వం అని చెప్పుకునే ప్రజాపాలన మొదలైందనీ, ఇది దేశానికే ఆదర్శంగా మారబోతున్నందుకు గర్వకారణంగా ఉందని అన్నారు. తెలంగాణ అమరవీరుల ఆశయాలు, విద్యార్థుల పోరాటాలు, పౌర సమాజపు ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ముందుకెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన యూపీఏ ప్రభుత్వానికి, ఆనాటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు, యూపీఏ చైర్మెన్ సోనియాగాంధీకి నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

గ్యారంటీల అమలు ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం

సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఇచ్చిన హామీలు, చెప్పిన మాటకు కట్టుబడి వాటికి చట్టబద్ధత కల్పించే ఫైలుపై ఆయన సంతకం చేయడం ప్రభుత్వ సంకల్పానికి, చిత్తశుద్ధికి నిదర్శనమని గవర్నర్ ఈ సందర్భంగా కొనియాడారు. 48 గంటల్లోపే రెండు గ్యారెంటీలను అమలు చేయడం గొప్ప విషయమన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం, చేయూత గ్యారెంటీలపై వంద రోజుల్లో కార్యాచరణ తీసుకుంటామని చెప్పారు. పెరిగిన వైద్యఖర్చులు, ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా సేవలను మరింత విస్తృతపరిచేందుకు రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం పొందేలా పథకాన్ని ప్రారంభించడం సంతోషకరమన్నారు.

రూ.2 లక్షల రుణమాఫీపై త్వరలో కార్యాచరణ

వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన, నిరంతర విద్యుత్ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ చెప్పారు. రైతు డిక్లరేషన్‌లో ప్రకటించినట్టుగా ప్రతి పంటకూ మద్దతు ధర ఇస్తామని హామీనిచ్చారు. రూ.2 లక్షల రుణమాఫీపై త్వరలోనే కార్యాచరణ ఉంటుందని ప్రకటించారు. ప్రజలకు మాటిచ్చినట్టుగానే కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల నిర్మాణంలో జరిగిన నాణ్యతాలోపం, అవినీతి అవకతవకలపై విచారణ జరిపిస్తామని చెప్పారు. కృష్ణాజలాల్లో తెలంగాణ వాటా సాధన, దక్షిణ తెలంగాణ వరప్రదాయని అయిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధించాలనే సంకల్పంతో తమ ప్రభుత్వం ముందుకుపోతుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్లను పూర్తిచేసి ఎగువనున్న ఆదిలాబాద్, ఇతర జిల్లాలకు సాగునీరందించాలనే లక్ష్యం తమ ప్రభుత్వం ముందుందని చెప్పారు. రైతు, ఎస్సీ,ఎస్టీ, యువ, బీసీ డిక్లరేషన్ల హామీలకు అమలు చేస్తామని మాటిచ్చారు.

ధరణి స్థానంలో భూమాత పోర్టల్..అసైన్డ్, పోడు భూముల పంపిణీ

ప్రజావాణిలో ఎక్కువగా భూ సమస్యలే వస్తున్నాయనీ, ఈ నేపథ్యంలోనే ధరణి స్థానంలో భూమాత పోర్టల్ తెచ్చి భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషిచేస్తుందని గవర్నర్ హామీనిచ్చారు. ల్యాండ్ కమిషన్ ఏర్పాటు చేసి ప్రభుత్వ భూములకు పరిరక్షించే కార్యక్రమాన్ని తీసుకుంటామని ప్రకటించారు. భూ సంస్కరణల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వాలు పంచిన 25 లక్షల ఎకరాల భూమిపై పేదలకు పూర్తిస్థాయి భూ హక్కులు కల్పిస్తామని భరోసానిచ్చారు. అసైన్డ్, పోడు భూములకు పట్టాలిచ్చే కార్యాచరణను తీసుకుంటామని తెలిపారు.

యువతకిచ్చిన మాటను నిలబెట్టుకుంటాం

యువతకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందని గవర్నర్ తెలిపారు. ఆరునెలల్లో మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తామని హామీనిచ్చారు. ఏడాదిలోపు 2 లక్షల ఉద్యోగాల ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. జాబ్‌క్యాలెండర్ విషయంలో ఇచ్చిన మాటప్రకారం ముందుకెళ్తామని చెప్పారు. నిరుద్యోగ యువత జీవితాలతో ఆడుకున్న టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవడం సంతోషకరమన్నారు.

గూడులేనోళ్లకు 'ఇందిరమ్మ' భరోసా

ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇండ్లు లేని వారికి ఇంటి స్థలం, స్థలమున్నవారికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సాయం అందించడానికి ప్రభుత్వం కార్యాచరణ మొదలుపెట్టిందని గవర్నర్ తెలిపారు. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు అదనంగా లక్ష రూపాయలిస్తామని వెల్లడించారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలను గుర్తించి 250 గజాల చొప్పున ఇంటిస్థలం, గౌరవభృతి ఇస్తామని ప్రకటించారు.

డ్రగ్స్ భూతాన్ని తరిమికొడతాం

రాష్ట్రంలో మాదకద్రవ్యాల నిర్మూలన విషయంలో అత్యంత కఠిన వైఖరి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని గవర్నర్ చెప్పారు. డ్రగ్స్‌భూతాన్ని రాష్ట్ర పొలిమేరలు దాటే వరకు తరిమి కొట్టాలన్న దృఢ సంకల్పంతో తమ సర్కార్ ఉందన్నారు. తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్ బ్యూరోకు పూర్తిస్థాయి డైరెక్టర్‌ను నియమించడం శుభపరిణామని చెప్పారు. ఎంతటి ఒత్తిళ్లు వచ్చినా డ్రగ్స్ విషయంలో దోషులను వదిలేది లేదని సభావేదికగా స్పష్టం చేశారు.

ఉపాధి జోన్‌గా మూసీ పరివాహక ప్రాంతం


తెలంగాణకు పాలనా కేంద్రంగా, ఆర్థికంగా గుండెకాయ లాంటి హైదరాబాద్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ తెలిపారు. మూసీని ప్రక్షాళన చేస్తామన్నారు. ఆ నదీ పరివాహక ప్రాంతాన్ని ఉపాధి కల్పనా జోన్‌గా మార్చే కార్యాచరణ మొదలు పెట్టామని ప్రకటించారు. మహానగరాన్ని అన్ని దిశలుగా అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. హైదరాబాద్ కేంద్రంగా రాష్ట్రాన్ని మూడు జోన్లుగా ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఔటర్ లోపల ఉన్న హైదరాబాద్‌ను, ఔటర్ రింగ్‌రోడ్డు-ఆర్‌ఆర్‌ఆర్ మధ్య ఉన్న ప్రాంతాన్ని, ఆర్‌ఆర్‌ఆర్ అవల ఉన్న ప్రాంతాన్ని మరోభాగంగా నిర్ధారించి అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందని వివరించారు.

ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టడమే అతిపెద్ద సవాల్

అస్తవ్యస్తంగా మారిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టడమే రాష్ట్ర ప్రభుత్వం ముందున్న అతి పెద్ద సవాల్ అని గవర్నర్ అన్నారు. గత ప్రభుత్వ నిర్వాకంతో విద్యుత్ వ్యవస్థలు రూ.81,516 కోట్ల అప్పుల్లోకి కూరుకుపోయాయని చెప్పారు. రూ.50,275 కోట్ల మేర నష్టాల్లో ఉన్నాయని తెలిపారు. పౌరసరఫరాల కార్పొరేషన్‌లో రూ.56 వేల కోట్ల అప్పులు, నష్టాలు 11 వేల కోట్లకు చేరాయని వివరించారు. ప్రతి శాఖనూ అప్పుల కుప్పగా మార్చేశారనీ, కార్పొరేషన్ల పేరుతో విచ్చలవిడిగా రుణాలు తెచ్చి రాష్ట్రాన్ని అప్పులమయంగా చేశారని వాపోయారు. రాష్ట్రంలో ఆర్థిక క్రమశిక్షణ లేకుండా చేశారన్నారు. గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థపై శాఖలవారీగా త్వరలోనే శ్వేతపత్రాలు విడుదల చేసి వాస్తవ పరిస్థితిని ప్రజల ముందు ఉంచుతామని చెప్పారు. అత్యంత పారదర్శకమైన పాలన అందిస్తామన్న హామీలో భాగంగానే ఇది చేయబోతున్నామన్నారు. దుబారాను అరికట్టి ప్రజలపై భారం మోపకుండానే సంక్షేమ పాలన అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

తొమ్మిదున్నరేండ్లలో వ్యవస్థల విధ్వంసం

రాష్ట్రంలో గడిచిన తొమ్మిదున్నరేండ్ల కాలంలో అన్ని వ్యవస్థలు విధ్వంసానికి గురయ్యాయనీ, ప్రజాస్వామ్యయుతంగా పనిచేయాల్సిన వ్యవస్థలు, సంస్థలు వ్యక్తుల కోసం పనిచేసే స్థితికి దిగజారడంపై గవర్నర్ ఆందోళన వ్యక్తం చేశారు. వ్యక్తి ఆరాధన కోసం వ్యవస్థలను దిగజార్చడం ప్రజాస్వామ్యానికి శోభనివ్వదన్నారు. శాసన, కార్యనిర్వాహక వ్యవస్థల్లో విలువను పునరుద్ధరిస్తామని భరోసానిచ్చారు. బేషజాలకు పోకుండా ప్రతిపక్షాల సూచనలను పరిగణనలోకి తీసుకుంటామనీ, అన్ని నియోజకవర్గాలకూ అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామని ప్రకటించారు. అణచివేత, వివక్షకు గురైన ప్రతి వర్గానికీ న్యాయం జరిగేలా చూస్తామన్న భరోసానిచ్చారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థలకు విలువ లేకుండా చేసిందన్నారు. పనులకు బిల్లులివ్వకుండా వారిని అప్పుల పాలు చేసిందని తెలిపారు. కొందరు స్థానిక ప్రజాప్రతినిధులు ఆత్మహత్యలు కూడా చేసుకున్న విషయాన్ని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం గ్రామం యూనిట్‌గా అభివృద్ధికి ప్రణాళికలు తీసుకుని ముందుకెళ్తుందని ప్రకటించారు.



పట్టు బిగించారు

- భారత్ ప్రస్తుత ఆధిక్యం 478 పరుగులు
- తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 136 ఆలౌట్
- దీప్తి శర్మ ఐదు వికెట్ల మాయజాలం
- భారత్ రెండో ఇన్నింగ్స్ 186/6



ఇంగ్లాండ్‌తో ఏకైక టెస్టులో టీమ్ ఇండియా పట్టు బిగించింది. తొలి రోజు పరుగుల వరద పారించిన అమ్మాయిలు.. రెండో రోజు వికెట్ల జాతర సాగించారు. స్పిన్నర్ దీప్తి శర్మ (5/7) కెరీర్ అత్యుత్తమ ప్రదర్శనతో ఐదు వికెట్ల మ్యాజిక్ చేయగా ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 136 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఆతిథ్య భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 292 పరుగుల భారీ ఆధిక్యం సొంతం చేసుకుంది. రెండో ఇన్నింగ్స్‌లోనూ వడివడిగా పరుగులు రాబట్టిన టీమ్ ఇండియా.. ప్రస్తుతం 478 పరుగుల ఎదురులేని ముందంజలో కొనసాగుతోంది. మరో రెండు రోజుల ఆట మిగిలి ఉండగా.. హర్మన్‌ప్రీత్ సేన రికార్డు టెస్టు విజయానికి అడుగు దూరంలో నిలిచింది!.

నవతెలంగాణ-ముంబయి

ఆతిథ్య భారత్‌కు ఎదురులేదు. నవీ ముంబయిలో తొలి రోజు భారత బ్యాటర్లు దంచికొట్టగా.. రెండో రోజు బౌలర్లు అదరగొట్టారు. స్పిన్నర్ దీప్తి శర్మ (5/7) ఐదు వికెట్ల ప్రదర్శనతో ఇంగ్లాండ్ విలవిల్లాడింది. 35.3 ఓవర్లలో 136 పరుగులకే ఇంగ్లీశ్ అమ్మాయిలు చేతులెత్తేశారు. దీంతో భారత్ 292 పరుగుల భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కించుకుంది.

ఇంగ్లాండ్ బ్యాటర్లలో నటాలీ సీవర్ (59, 70 బంతుల్లో 10 ఫోర్లు) అర్ధ సెంచరీతో ఆ జట్టుకు గౌరవప్రద మూడెంకల స్కోరు అందించింది. ఇక భారత్ తొలుత తొలి ఇన్నింగ్స్‌లో 428 పరుగులకు ఆలౌట్ కాగా.. రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లకు మరో 186 పరుగులు జోడించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (44 బ్యాటింగ్, 67 బంతుల్లో 5 ఫోర్లు), పూజ (17 బ్యాటింగ్) అజేయంగా ఆడుతున్నారు. టీమ్ ఇండియా ప్రస్తుత ఆధిక్యం 478 పరుగులు.

దీప్తి మాయజాలం

తొలి ఇన్నింగ్స్‌లో భారత్ భారీ స్కోరు సాధించగా.. ఇంగ్లాండ్ సైతం మంచి పోటీ ఇస్తుందనే అంచనాలు ఉన్నాయి. కానీ ఆ జట్టుకు ఆశించిన ఆరంభం దక్కలేదు. రెండో రోజు భారత్ బెయిలెండర్లను త్వరగా అవుట్ చేసిన ఆనందం ఎంతోసేపు నిలువలేదు. టాప్-3 బ్యాటర్లు టామీ బ్యూమంట్ (10), సోఫీ డంక్లీ (11), హీథర్ నైట్ (11)లు నిరాశపరిచారు. రేణుక సింగ్, స్నేహ్ రానాలు కొత్త బంతితో ఇంగ్లాండ్‌ను కోలుకోలేని దెబ్బతీశారు. ఆ తర్వాత సంగతి స్పిన్నర్ దీప్తి శర్మ చూసుకుంది. 5.3 ఓవర్లే వేసిన దీప్తి శర్మ ఇంగ్లాండ్ కథ ముగించింది. కేట్ క్రాస్ (1), సోఫీ ఎకల్‌స్టోన్ (0), ఆమీ జోన్స్ (0), డానీ వ్యాట్ (19), లారెన్ ఫైలర్ (5)లు దీప్తి మాయలో పడ్డారు. దీంతో 108/3తో మెరుగ్గా సాగుతున్న ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ దీప్తి మాయకు 136 పరుగులకే ముగిసింది. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ నటాలీ సీవర్ (59) అర్ధ సెంచరీతో ఓ ఎండ్‌లో నిలిచినా.. మరో ఎండ్‌లో సహకారం దక్కలేదు. 35.3 ఓవర్లలో ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌కు తెరపడింది.

మళ్లీ సమిష్టిగానే..

బ్యాట్‌తో టీమ్ ఇండియా మరోసారి సమిష్టిగా రాణించింది. బ్యాటింగ్ లైనప్‌లో ఎవరూ భారీ స్కోర్లు చేయకపోయినా.. ఓవరాల్‌గా మంచి స్కోరు సాధించారు. ఓపెనర్లు షెఫాలీ వర్మ (35, 53 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), స్మృతీ మంధాన (26, 29 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 61 పరుగులు జోడించి శుభారంభం అందించారు. జెమీమా రొడ్రిగస్ (27), హర్మన్‌ప్రీత్ కౌర్ (44 నాటౌట్), దీప్తి శర్మ (20), పూజ (17 నాటౌట్) రాణించారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 186/6 పరుగులు చేసింది. ఓవరాల్ ఆధిక్యం 478 పరుగుల ముందంజలో నిలిచింది. అంతకుముందు, తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 428 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 410 పరుగులకు మరో 18 పరుగులు జోడించింది. దీప్తి శర్మ (67), పూజ (10) రాణించారు. ఇంగ్లాండ్ బౌలర్లలో సోఫీ ఎకల్‌స్టోన్, లారెన్ బెల్ మూడేసి వికెట్లు పడగొట్టారు.

స్కోరు వివరాలు

భారత మహిళల తొలి ఇన్నింగ్స్ : 428/10

ఇంగ్లాండ్ మహిళల తొలి ఇన్నింగ్స్: టామీ (రనౌట్) 10, సోఫీ (బి) రేణుక 11, హీథర్ (ఎల్బీ) పూజ 11, నటాలీ సీవర్ (బి) రానా 59, వ్యాట్ (సి) జెమీమా (బి) దీప్తి 19, ఆమీ జోన్స్ (సి) షెఫాలీ (బి) దీప్తి 12, సోఫీ (బి) దీప్తి 0, డీన్ (ఎల్బీ) రానా 0, కేట్ క్రాస్ (సి,బి) దీప్తి 1, లారెన్ ఫైలర్ (బి) దీప్తి 5, లారెన్ బెల్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 8, **మొత్తం : (35.3 ఓవర్లలో ఆలౌట్) 136.**

వికెట్ల పతనం : 1-13, 2-28, 3-79, 4-108, 5-126, 6-126, 7-130, 8-131, 9-135, 10-136.

బౌలింగ్ : రేణుక సింగ్ 9-1-32-1, స్నేహ్ రానా 6-0-25-2, పూజ 9-1-39-1, రాజేశ్వరి 6-0-25-0, దీప్తి 5.3-4-7-5.

భారత మహిళల రెండో ఇన్నింగ్స్ : షెఫాలీ (సి) ఎకల్‌స్టోన్ (బి) డీన్ 33, మంధాన (సి) టామీ (బి) ఎకల్‌స్టోన్ 26, భాటియా (సి) టామీ (బి) ఎకల్‌స్టోన్ 9, జెమీమా (సి) టామీ (బి) డీన్ 27, హర్మన్‌ప్రీత్ నాటౌట్ 44, దీప్తి (ఎల్బీ) డీన్ 20, రానా (బి) డీన్ 0, పూజ నాటౌట్ 17, ఎక్స్‌ట్రాలు : 10, **మొత్తం : (42 ఓవర్లలో 6 వికెట్లకు) 186.**

వికెట్ల పతనం : 1-61, 2-71, 3-77, 4-109, 5-133, 6-133.

బౌలింగ్ : లారెన్ బెల్ 3-1-6-0, ఎకల్‌స్టోన్ 15-2-76-2, డీన్ 19-3-68-4, కేట్ క్రాస్ 3-0-13-0, లారెన్ ఫైలర్ 2-0-13-0.

కెప్టెన్ హార్దిక్ పాండ్య

- ముంబయి ఇండియన్స్ కెప్టెన్‌గా ఎంపిక
- ముగిసిన రోహిత్ శర్మ సారథ్య శకం



ముంబయి : ఊహించినట్టే ముంబయి ఇండియన్స్ సంచలన నిర్ణయం తీసుకుంది. గుజరాత్ టైటాన్స్ మాజీ కెప్టెన్, స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యను 2024 ఐపీఎల్ సీజన్ నుంచి తమ నాయకుడిగా ముంబయి ఇండియన్స్ ప్రకటించింది. ఈ మేరకు ముంబయి ఇండియన్స్ గ్లోబల్ మెంటార్ మహేళ జయవర్ధనె ఓ ప్రకటనలో తెలిపాడు. ఈ ఏడాది ఐపీఎల్ ఆటగాళ్ల వేలానికి ముందు ప్లేయర్ ట్రేడింగ్‌లో గుజరాత్ టైటాన్స్ నుంచి రూ.30 కోట్ల బదిలీలో హార్దిక్ పాండ్య ముంబయి ఇండియన్స్ గూటికి చేరుకున్న సంగతి తెలిసిందే. ఐపీఎల్‌లో తొలిసారి రూ.10 లక్షల కనీస ధరకు ముంబయి ఇండియన్స్‌కు సొంతమైన పాండ్య.. ఆ ఫ్రాంచైజీలోనే స్టార్ ఆల్‌రౌండర్‌గా ఎదిగాడు. గుజరాత్ టైటాన్స్‌కు రెండు సీజన్లలో కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించి ఓ సారి చాంపియన్‌గా, మరోసారి రన్నరప్‌గా నిలిపాడు.

రోహిత్‌కు షాక్ : ముంబయి ఇండియన్స్‌కు 2013 నుంచి పది సీజన్ల పాటు నాయకత్వ బాధ్యతలు వహించిన రోహిత్ శర్మకు ఊహించని షాక్ ఎదురైంది. పదేండ్ల పాటు ముంబయికి కెప్టెన్సీ వహించిన రోహిత్ శర్మ రికార్డు స్థాయిలో ఐదు సార్లు విజేతగా నిలిపాడు. ఎం.ఎస్ ధోనితో సమానంగా ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన కెప్టెన్‌గా నిలిచాడు. ప్రస్తుతం రోహిత్ శర్మ వయసు 37. దీంతో భవిష్యత్ ప్రణాళికలను గమనంలో ఉంచుకుని హార్దిక్ పాండ్యను సారథిగా ఎంచుకుంది. నాయకత్వ బాధ్యతల నుంచి తప్పించినా.. రానున్న సీజన్లలో ముంబయి ఇండియన్స్‌కు ఆటగాడిగా రోహిత్ శర్మ ఆడనున్నాడు. ముంబయి ఇండియన్స్‌కు 163 మ్యాచుల్లో కెప్టెన్సీ వహించిన రోహిత్ శర్మ.. 91 మ్యాచుల్లో విజయాలు, 68 మ్యాచుల్లో పరాజయాలు ఎదురయ్యాయి. నాలుగు మ్యాచులు టైగా ముగిశాయి. రోహిత్ సారథ్యంలో 2013, 2015, 2017, 2019, 2020 ఐపీఎల్ సీజన్లలో ముంబయి ఇండియన్స్ చాంపియన్‌గా నిలిచింది.



వారసుడు పాండ్య : క్రికెట్ వర్గాలు, అభిమానులకు ఇది షాక్‌కు గురిచేసే వార్త. కానీ ముంబయి ఇండియన్స్ ఫ్రాంచైజీకి ఇది ముందస్తు ప్రణాళిక. రోహిత్ శర్మ సహా ఫ్రాంచైజీ సహాయక, వ్యూహ బృందం సమాలోచనలు చేసి హార్దిక్ పాండ్యను తిరిగి తెచ్చుకున్నాయి. సూర్యకుమార్ యాదవ్ వంటి టీ20 సూపర్‌స్టార్ అందుబాటులో ఉన్నప్పటికీ.. ముంబయి ఇండియన్స్ యాజమాన్యం పాండ్య కోసం వెళ్లింది. అతడి కోసం కామెరూన్ గ్రీన్‌ను వదిలేసుకుంది. రూ.15 కోట్ల వార్షిక వేతనం హార్దిక్‌కు చెల్లించటంతో పాటు రూ. 20 కోట్ల వరకు గుజరాత్ టైటాన్స్‌కు బదిలీ ఫీజు కింద చెల్లించింది. గుజరాత్ టైటాన్స్‌ను వరుసగా రెండు సీజన్లలో ఫైనల్స్‌కు చేర్చిన హార్దిక్ పాండ్య.. నాయకత్వ బాధ్యతల భరోసాతోనే ముంబయి ఇండియన్స్‌కు మారేందుకు అంగీకారం తెలిపినట్టు సమాచారం.

ఆల్‌ఇండియాకు ఓయు ఫుట్‌బాల్ జట్టు

- సౌత్‌ఈస్ట్‌జోన్‌లో అజేయ రికార్డు

హైదరాబాద్ : ఉస్మానియా యూనివర్శిటీ (ఓయు) ఫుట్‌బాల్ జట్టు చరిత్ర సృష్టించింది. 23 ఏండ్ల సుదీర్ఘ విరామం అనంతరం ఆల్ ఇండియా యూనివర్శిటీ టోర్నమెంట్‌కు అర్హత సాధించింది. ఇటీవల మంగళూర్‌లో జరిగిన సౌత్ ఈస్ట్ జోన్ వర్శిటీ టోర్నీలో నాలుగు మ్యాచుల్లో విజయాలు సాధించిన ఓయు.. ఆల్ ఇండియాకు అర్హత సాధించింది.

కాకతీయ యూనివర్శిటీపై 3-0తో, ఛత్తీశ్‌గఢ్ స్వామివివేకానంద టెక్నికల్ వర్శిటీపై 1-0తో, గార్డెన్ సిటీపై 6-0తో, పాలమూరు యూనివర్శిటీపై 5-0తో ఎదురులేని విజయాలు నమోదు చేసింది. ఓయు తరఫున సయ్యద్ ఒవైసుద్దీన్ ఆరు గోల్స్‌తో విజయంలో కీలక పాత్ర పోషించాడు.

ఆస్ట్రేలియా 487/10

- పాకిస్థాన్‌తో తొలి టెస్టు రెండో రోజు

పెర్త్ : పాకిస్థాన్‌తో తొలి టెస్టులో ఆతిథ్య ఆస్ట్రేలియా భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ డెవిడ్ వార్నర్ (164) శతకానికి తోడు లోయర్ ఆర్డర్‌లో మిచెల్ మార్ష్ (90, 107 బంతుల్లో 15 ఫోర్లు, 1 సిక్స్) భారీ అర్ధ సెంచరీతో మెరవటంతో తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 487 పరుగుల భారీ స్కోరు చేసింది. అలెక్స్ కేరీ (34), ట్రావిశ్ హెడ్ (40), ఉస్మాన్ ఖవాజ (41) రాణించారు. పాక్ బౌలర్లలో ఆమర్ జమాల్ (6/111) ఆరు వికెట్ల ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. రెండో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో ఎదురీదుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 53 ఓవర్లలో 2 వికెట్లకు 132 పరుగులు చేసింది. అబ్దుల్లా షఫీక్ (42), షాన్ మసూద్ (30) రాణించారు. ఇమామ్ ఉల్ హాక్ (38 నాటౌట్), షాజాద్ (7 నాటౌట్) అజేయంగా ఆడుతున్నారు. పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో మరో 355 పరుగుల వెనుకంజలో కొనసాగుతోంది.

నవచిత్రం



నాగార్జున, అల్లరి నరేష్


స్నేహమంటే ఇదేరా..

నాగార్జున నటిస్తున్న తాజా చిత్రం 'నా సామిరంగ'. నూతన దర్శకుడు విజయ్ బిన్నీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో ఫ్రెండ్ షిప్‌కి మంచి ప్రాముఖ్యత ఉంది. సినిమాలోని ఆ లేయర్‌ని ఒక గ్లింప్స్ ద్వారా మేకర్స్ రివీల్ చేసి అందర్నీ సర్‌ప్రైజ్ చేశారు.
అలాగే ఇందులో అల్లరి నరేష్ కీలక పాత్ర పోషిస్తున్నారు. 'అంజి'గా ఆయన పాత్రను గ్లింప్స్ ద్వారా పరిచయం చేశారు. ఇది కేవలం పాత్రను పరిచయం చేయడానికే కాదు, అల్లరి నరేష్‌తో నాగార్జునకు ఉన్న రిలేషన్‌ని చాలా అద్భుతంగా చూపించింది. మాటొచ్చేత్తది అనేది తను తరుచుగా వాడే మాటే. ఇది మాట మీద నిలబడే వ్యక్తిగా అతని పాత్రను సూచిస్తుంది. శివేంద్ర దాశరథి పల్లెటూరి వాతావరణాన్ని అద్భుతంగా చూపించగా, కీరవాణి తన ఆకర్షణీయమైన సంగీతంతో విజువల్స్‌కు మరింత అందాన్ని తీసుకొచ్చారు. గ్లింప్స్ ద్వారా ఈ సినిమా టీజర్‌ను త్వరలో విడుదల చేస్తామని మేకర్స్ అనౌన్స్ చేశారు. ఆషికా రంగానంద్ ఈ చిత్రంలో కథానాయిక. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్‌పై నిర్మాత శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతి కానుకగా విడుదల కానుంది.

నా కెరీర్‌లో ఇలాంటి పాత్ర చేయలేదు - ప్రభాస్

ప్రభాస్, ప్రశాంత్‌నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'సలార్ సీజ్ ఫైర్'. హోంబలే ఫిలిమ్స్ నిర్మించిన ఈ సినిమా ఈనెల 22న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఈ లేటెస్ట్ భారీ యాక్షన్ అండ్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్ గురించి ప్రభాస్ పలు ఆసక్తికరమైన విషయాలను మీడియాకి తెలిపారు.

- ఇందులో పాత్రల మధ్య చక్కటి ఎమోషన్స్ ఉంటాయి. ప్రేక్షకులు ఇప్పటి వరకు చూడనటు వంటి పాత్రలో నన్ను చూస్తారు.నా కెరీర్‌లో ఇలాంటి పాత్ర చేయలేదు. నేను, ప్రశాంత్ నీల్ కలిసి పని చేయాలనుకున్నప్పుడు సినిమా ఎలా ఉంటే అందరినీ ఆకట్టుకుంటుందనే విషయాలపై బాగా చర్చించాం. నా ఆలోచనలను ఆయన ముందు పెట్టాను. వాటిని దృష్టిలో పెట్టుకుని ప్రశాంత్ నీల్ కథని అద్భుతంగా తయారు చేశారు. అలాగే మేం అనుకున్న కథకు బాడీ లాంగ్వేజ్ కూడా ఎలా ఉండాలనే విషయాన్ని డిస్కస్ చేశాం.
- నా సినీ జర్నీని ప్రారంభమై 21 ఏళ్లు అవుతున్నాయి. అయితే ప్రశాంత్‌నీల్‌తో ఎప్పుడు షూటింగ్ చేస్తానా అని ఎంతో ఆసక్తిగా ఎదురు చూశాను. ప్రశాంత్ హీరోలను గొప్పగా చూపించాలనుకునే దర్శకుడు. నాతో పాటు శ్రుతీ హాసన్, పృథ్వీరాజ్, జగపతిబాబు ఇలా అందరం సెట్స్‌లో చాలా సరదాగా గడిపాం.
- ఈ సినిమాలో నా పాత్ర కోసం నేనేం ప్రత్యేకంగా కష్టపడలేదు. క్యారెక్టర్ డిమాండ్ మేరకు కండలు పెంచాను. 'సలార్ సీజ్ ఫైర్'లో రెండు ప్రధాన పాత్రల మధ్య చక్కటి సోదర భావాన్ని ప్రేక్షకులు చూస్తారు. క్రిస్మస్ సీజన్‌లో హొంబలే సంస్థ ఆడియెన్స్‌కు అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసింది. మీ అందర్నీ సినిమా కచ్చితంగా అలరిస్తుందనే నమ్మకంతో ఉన్నాం.



ప్రభాస్

హిట్ కళ కనిపిస్తోంది.. - కె.రాఘవేంద్రరావు



రోషన్ కనకాల, మానస చౌదరి

రవికాంత్ పేరేపు దర్శకత్వంలో రోషన్ కనకాల హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'బబుల్‌గమ్'. ఈ సినిమా నెల 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా శుక్రవారం ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ని లాంచ్ చేశారు. దర్శకేంద్రుడు కె రాఘవేంద్రరావు, డైరెక్టర్ అనిల్ రావిపూడి, హీరో రానా దగ్గుబాటి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఈ ట్రైలర్ లాంచ్ వేడుక చాలా గ్రాండ్‌గా జరిగింది.
కె రాఘవేంద్రరావు మాట్లాడుతూ,'ఈ ట్రైలర్‌లో సూపర్ హిట్ కళ కనిపిస్తోంది. బబుల్‌గమ్ మెల్లగా ఉబ్బి ఉబ్బి పెద్దగా పేలుతుంది. ఈ సినిమా టాక్ కూడా మెల్లగా స్టార్ట్ అయి సూపర్ హిట్ టాక్‌తో ఎండ్ అవుతుంది. రోషన్, మానస కెమిస్ట్రీ చాలా బావుంది. సినిమా ఖచ్చితంగా చాలా బాగా ఆడుతుంది' అని తెలిపారు.
'సుమ, రాజీవ్‌కి ఈనెల 29 ఒక ప్రౌడ్ మూమెంట్. ట్రైలర్ ఖచ్చితంగా సినిమా బ్లాక్ బస్టర్ అవుతుంది. ఇందులో యూత్‌కీ కావాల్సిన అన్ని ఎలిమెంట్స్ ఉన్నాయి' అని అనిల్ రావిపూడి చెప్పారు. రానా మాట్లాడుతూ, 'సుమ మా జీవితాల్లో భాగమై పోయారు. రోషన్‌కి అందరి ప్రేమ, అభిమానం దక్కాలని కోరుకుంటున్నాను. దర్శకుడు రవికాంత్ కథలు కొత్తగా ఉంటాయి. మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని చెప్పారు.
రోషన్ మాట్లాడుతూ, 'రాఘవేంద్రరావు మా ట్రైలర్‌ని లాంచ్ చేయడం ఒక గౌరవంగా భావిస్తున్నాం. ఇది చలికాలం. కొంచెం వెచ్చగా ఉండాలని ఇలాంటి ఫైర్ లాంటి ట్రైలర్‌ని దింపాడు రవికాంత్. జీవితంలో ఎదో సందర్భంలో రివేంజ్ తీర్చుకోవాలని పిస్తుంది. ఈ సినిమాలో ఆది పాత్ర మాటల్లో చెప్పాలంటే.. 'ఒక రోజు వస్తది. ఆ రోజు చెవులు మూసుకున్నా వినపడతా. కళ్ళు మూసు కున్నా కనపడతా' అని తెలిపారు. 'పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ప్రెజెంట్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ట్రైలర్ కంటే సినిమా ఇరవై రెట్లు హై ఇస్తుంది. సినిమా అందరికీ క్రేజీక్రేజీగా నచ్చుతుంది. బబుల్‌గమ్ అంటుకుంటే తీసేయాలని పిస్తుంది. కానీ ఈ బబుల్‌గమ్‌కి ఎదురెళ్ళి అంటించు కోవాలనిపిస్తుంది. తప్పకుండా అందరూ థియేటర్స్‌లో చూడాలి' అని దర్శకుడు రవికాంత్ పెరేపు అన్నారు. మానస చౌదరి మాట్లాడుతూ,'ఈ చిత్రంలో అవకాశం కల్పించిన దర్శక, నిర్మాతలకు ధన్యవాదాలు. ఈ సినిమా చూడటానికి మీతో పాటు నేనూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను' అని చెప్పారు.

రుధిరాక్ష వైభవంగా ప్రారంభం



ఆది సాయికుమార్ హీరోగా, జె.డి.చక్రవర్తి, సత్యరాజ్ ప్రధాన పాత్రలలో 9 స్టార్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్‌లో తెరకెక్కనున్న పాన్ ఇండియా చిత్రం 'రుధిరాక్ష'. శివ శంకర్ దేవ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రాజు జువ్వల నిర్మిస్తున్నారు. డార్క్, థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందనున్న ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమం రామానాయుడు స్టూడియోలో ఘనంగా జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి సముద్రఖని క్లాప్ కొట్టగా, రామ్ తాళ్లూరి కెమరా స్విచాన్ చేశారు.
ఫస్ట్ షాట్‌కు డైరెక్టర్ దేవ్ దర్శకత్వం వహించారు. 'యానిమల్' ఫేం హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందిస్తున్నారు. కిశోర్ బోయిదాపు డీవోపీగా పని చేస్తున్న ఈ చిత్రానికి విజయ్ కృష్ణ ఆర్ట్ డైరెక్టర్. పవన్ హిమాన్షు, బాలు మహేంద్ర మాటలు అందిస్తున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రారంభం కానుంది. ఈ చిత్రానికి సంబంధించి మరిన్ని వివరాలు త్వరలోనే తెలియనున్నాయి.

ఇన్‌సైడ్ జరిగిన విషయాలతో వ్యూహం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాజకీయ జీవితంలో జరిగిన కొన్ని ఘటనలను ప్రతిబింబిస్తూ రామ్‌గోపాల్ వర్మ తెరకెక్కించిన చిత్రం 'వ్యూహం'. ఈ చిత్రాన్ని రామదూత క్రియేషన్స్ బ్యానర్‌లో దాసరి కిరణ్ కుమార్ నిర్మించారు.
ఇందులో వైఎస్ జగన్ పాత్రలో అజ్మల్ నటించగా, వైఎస్ భారతి పాత్రలో మానస కనిపించనుంది. సెన్సార్ పూర్తి చేసుకుని క్లీన్ యూ సర్టిఫికెట్‌తో ఈ నెల 29న గ్రాండ్‌గా థియేటర్స్ లోకి రాబోతోంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ట్రైలర్2ను రిలీజ్ చేశారు.
ఈ సందర్భంగా దర్శకుడు ఆర్‌జీవీ మాట్లాడుతూ, 'సెన్సార్ అడ్డంకులతో మా సినిమా ఆగిపోయినప్పుడే చెప్పాను. అరచేతిని అడ్డుపెట్టి సూర్యుడిని ఆపలేనట్లే..మా సినిమా థియేటర్స్‌లోకి రావడాన్నీ అడ్డుకోలేరని. ఇవాళ అదే జరిగింది. అందుకే ఫస్ట్ టైమ్ సెన్సార్ సర్టిఫికెట్‌తో పోస్టర్ డిజైన్ చేయించాం. ఈ నెల 29న గ్రాండ్‌గా సినిమాను రిలీజ్ చేస్తున్నాం. ఇందులో రాజకీయ నాయకులు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ పాత్రలను పోలిన క్యారెక్టర్స్ ఉంటాయి. అయితే వాటికి చంద్రబాబు, పవన్ రియల్ లైఫ్‌కు సంబంధం లేదు. ఈ కథలో వైఎస్ రాజ శేఖర్ రెడ్డి మరణం నుండి మొదలై జగన్ అరెస్ట్, ఆయన పార్టీ పెట్టి సీఎం అవడం, వైఎస్ వివేక హత్య వంటి అనేక ముఖ్య సంఘటనలు ఉంటాయి. సినిమా అంటే డ్రామా కాబట్టి ఆ ఘటనలన్నీ డ్రమటిక్‌గా సినిమా చూసే ప్రేక్షకులకు నచ్చేలా రూపొందించాను. ఈ కథలోని అంశాలు ప్రజలందరికీ తెలిసిన విషయాలు కావు. ఇన్‌సైడ్ జరిగిన విషయాలు. అలాంటి అంశాలు ఈ సినిమాలో చూపిస్తున్నాం. 'వ్యూహం'లో మీకున్న డౌట్స్ నా రాబోయే 'శపథం' సినిమా చూస్తే క్లియర్ అవుతాయి' అని తెలిపారు.



దాసరి కిరణ్ కుమార్, రామ్‌గోపాల్ వర్మ

'దేవుడు కొందరితో కొన్ని పనులను లోక కల్యాణం కోసం చేయిస్తుంటాడు. అలా నాతో ఈ సినిమా చేయించాడు అని భావిస్తున్నా. 'వంగవీటి' తర్వాత నేను వర్మతో చేస్తున్న సినిమా ఇది. మా సినిమాని ఎక్కువ సంఖ్యలోనే థియేటర్స్‌లో రిలీజ్ చేస్తాం' అని నిర్మాత దాసరి కిరణ్ కుమార్ అన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.